9-03-2026

# విశాల భారతి

తెలుగు దినపత్రిక

www.vishalabharati.com
epaper.vishalabharati.com

సోమవారం, హైదరాబాద్ సంపుటి:4 సంచిక: 64



# విశ్వవిజేతగా భారత్

## వరుసగా రెండోసారి టీ20 ప్రపంచ విజేతగా భారత్

నరేంద్ర మోదీ స్టేడియం సాక్షిగా భారత్ విశ్వవిజేతగా అవతరించింది. యావత్ భారతావని గర్వించేలా, కోట్లాది మంది అభిమానుల కళ్లలో ఆనంద బాష్పాలు నింపేలా టీమ్‌ఇండియా అద్భుతాన్ని ఆవిష్కరించింది. 2024లో బార్బడోస్ గడ్డపై రోహిత్ సేన ఎగురవేసిన విజయకేతనాన్ని, ఇప్పుడు అహ్మదాబాద్‌లో సూర్యకుమార్ సేన కొనసాగించింది. వరుసగా రెండోసారి టీ20 ప్రపంచకప్ ఛాంపియన్‌గా నిలిచి, క్రికెట్ చరిత్రలో మరే జట్టుకూ సాధ్యం కాని రీతిలో భారత్ తన ఆధిపత్యాన్ని చాటుకుంది. కివీస్‌తో జరిగిన ఫైనల్ పోరులో అన్ని విభాగాల్లోనూ ఆల్ రౌండ్ ప్రదర్శన చేసిన భారత్, 96 పరుగుల తేడాతో న్యూజిలాండ్‌ను మట్టికరిపించి ట్రోఫీని ముద్దాడింది.

- న్యూజిలాండ్‌పై సంజూ శాంసన్, అభిషేక్ శర్మల బౌండరీల వర్షం.
- విరాట్ కోహ్లీ అరుదైన ఫీట్‌ను సమం చేసిన సంజూ శాంసన్
- టీ20 ప్రపంచకప్ ఫైనల్‌లో అత్యధిక వ్యక్తిగత స్కోరు నమోదు
- రెండో వికెట్‌కు ఇషాన్ కిషన్‌తో కలిసి 105 పరుగుల జోడి
- న్యూజిలాండ్‌పై 96 పరుగుల తేడాతో భారీ విజయం
- 256 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో 159 పరుగులకే కుప్పకూలిన కివీస్
- ఆఖర్లో శివమ్ దూబే మెరుపులతో భారీ స్కోరు సాధించిన టీమ్ ఇండియా
- బౌలింగ్‌లో అక్షర్ పటేల్, బుమ్రా, హార్దిక్ పాండ్యల విలయం
- సొంతగడ్డపై వరల్డ్ కప్ అందుకున్న తొలి కెప్టెన్‌గా సూర్యకుమార్ రికార్డు
- మూడు టీ20 ప్రపంచకప్‌లు గెలిచిన ఏకైక జట్టుగా భారత్ అరుదైన ఘనత




**విశాలభారతి, క్రీడలు:** మ్యాచ్ ఆరంభం నుంచే భారత్ తన ఉగ్రరూపాన్ని ప్రదర్శించింది. నిర్ణీత 20 ఓవర్లలో భారత్ నిర్దేశించిన 256 పరుగుల భారీ లక్ష్యం కివీస్ బ్యాటర్లకు కొండంత సవాలుగా మారింది. ఇంత పెద్ద స్కోరును ఫైనల్ లాంటి ఒత్తిడి ఉన్న మ్యాచ్‌లో ఛేదించడం అసాధ్యమని భారత్ నిరూపించింది. కివీస్ ఇన్నింగ్స్ మొదలైన కొద్దిసేపటికే భారత బౌలర్లు విరుచుకుపడ్డారు. ముఖ్యంగా అక్షర్ పటేల్ తన స్పిన్ మాయాజాలంతో కివీస్ వెన్నుముక విరిచాడు. పవర్ ప్లే ముగిసేసరికే మూడు కీలక వికెట్లు కోల్పోయిన న్యూజిలాండ్, కోలుకోలేనంత దెబ్బతిన్నది. స్టేడియంలో ఉన్న లక్షకు పైగా ప్రేక్షకుల కోలాహలం మధ్య కివీస్ బ్యాటర్లు ఒత్తిడికి చిత్తయ్యారు. కివీస్ ఇన్నింగ్స్ రెండో ఓవర్లోనే భారత్ శుభారంభం అందుకుంది. గత మ్యాచ్‌లో సెంచరీతో చెలరేగిన ఫిన్ అలెన్‌ను అక్షర్ పటేల్ కేవలం 9 పరుగులకే వెనక్కి పంపాడు. దీంతో కివీస్ శిబిరంలో ఆందోళన మొదలైంది. ఆ వెంటనే బుమ్రా తనదైన శైలిలో రచిన్ రవీంద్రను పెవిలియన్‌కు చేర్చాడు. అక్షర్ పటేల్ తన రెండో వికెట్‌గా గ్లెన్ ఫిలిప్స్‌ను అవుట్ చేయడంతో న్యూజిలాండ్ 31 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. పవర్ ప్లే ముగిసే సమయానికి 52 పరుగులకు 3 వికెట్లు కోల్పోయిన కివీస్, లక్ష్యానికి ఆమడ దూరంలో నిలిచిపోయింది.

మిగతా 9లో..

## మూసీ బ్యూటిఫికేషన్‌పై తగ్గేదేలే..!

- మూసీ నది పునరుజ్జీవంపై సీఎం రేవంత్ ప్రకటన
- హైదరాబాద్‌లో 100శాతం ఎలక్ట్రిక్ బస్సులు
- మహిళా జర్నలిస్టులకు రక్షణ, ప్రత్యేక గుర్తింపుపై హామీ
- జర్నలిస్టులు, ప్రజాప్రతినిధులకు ప్రత్యేక కాలనీలు
- రెడ్, ఆరెంజ్ కేటగిరీ పరిశ్రమల తరలింపునకు నిర్ణయం
- మార్చి 13న మూసీ ప్రాజెక్టుపై సమగ్ర వివరణ




**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** హైదరాబాద్ నగరాన్ని ప్రపంచస్థాయి ప్రమాణాలతో తీర్చిదిద్దడమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జ్యోతిరావు పూలే భవన్‌లో జరిగిన మహిళా జర్నలిస్టుల సత్కార


మిగతా 3లో..

## ప్రాజెక్టుల భూ సేకరణకు రూ.5 వేల కోట్లు

- జూన్ 2లోపు భూసేకరణకు రూ. 5 వేల కోట్ల కేటాయింపు
- రాబోయే రెండేళ్లలో రూ. 22 వేల కోట్లతో ప్రాజెక్టుల పూర్తి
- ప్రాజెక్టు పనుల కోసం నిధుల విడుదలకు ప్రత్యేక వెసులుబాటు
- పాలమూరు ప్రాజెక్టులు ఎక్కడి వేసిన గొంగళి అక్కడే
- 2028 డిసెంబర్ నాటికి ఉమ్మడి జిల్లా సాగునీటి కల సాకారం
- ప్రస్తుత ఖరీఫ్‌లో తెలంగాణ వ్యాప్తంగా భారీగా పెరిగిన వరి సాగు

04





## ఇరాన్ అల్లకల్లోలం

- టెహ్రాన్‌పై ఇజ్రాయెల్ క్షిపణుల వర్షం
- బేషరతుగా లొంగిపోవాలన్న ట్రంప్ హెచ్చరిక
- యూఏఈపై ఇరాన్ డ్రోన్ల దాడి,అడ్డుకున్న రక్షణ దళాలు
- దుబాయ్ మెరినా టవర్‌కు భారీ నష్టం
- నార్వేలోని అమెరికా ఎంబసీ వద్ద పేలుడు
- బ్రిటన్ తీరుపై ట్రంప్ అసహనం

03

## మన గ్యాస్.. మనకేది?

- కేజీ బేసిన్ నిధులపై తెలంగాణకు జరుగుతున్న అన్యాయం
- పార్లమెంటులో గళమెత్తని ప్రజాప్రతినిధులపై విమర్శలు
- రాష్ట్ర సరిహద్దులు దాటి 1500 కిలోమీటర్ల దూరం తరలిపోతున్న సంపద
- సీఎన్జీ వాటా దక్కకపోవడంతో ఎల్పీజీ భారం మోస్తున్న సామాన్యుడు
- 12 ఏళ్లుగా అపరిష్కృతంగానే సహజ వనరుల కేటాయింపులు
- రిలయన్స్, కేంద్రం తీరును ప్రశ్నించని ఎంపీల వైఖరిపై ధ్వజం



04

## 'సింగరేణిలో కాంగ్రెస్ దందా'



- సింగరేణి టెండర్లలో భారీ దోపిడీ.. హరీశ్ రావు
- 'సైట్ విజిట్ సర్టిఫికెట్' ముసుగులో కాంట్రాక్టర్ల సిండికేట్
- శ్రీరాంపూర్ టెండర్లలో ప్రభుత్వం అసలు బాగోతం బట్టబయలు
- సీఎం బంధువుల కోసమే నిబంధనల మార్పు అని ఆరోపణ
- బిడ్లు వాయిదా వేస్తూ కమీషన్ల కోసం కక్కుర్తి పడ్డారని విమర్శ

02



# దీదీ సర్కార్‌పై మోదీ ఫైర్

- రాష్ట్రపతి ప్రోటోకాల్‌పై కేంద్రం, బెంగాల్ మధ్య రచ్చ
- మమత సర్కార్ రాజ్యాంగాన్ని అవమానించిందన్న ప్రధాని
- మురికి రాజకీయం చేస్తున్నారంటూ టీఎంసీపై మోదీ ఫైర్
- అవన్నీ తప్పుడు ఆరోపణలన్న సీఎం మమతా బెనర్జీ
- ఎన్నికల కోసమే బీజేపీ కుట్రలు చేస్తోందని మండిపాటు
- వచ్చే ఎన్నికల్లో బెంగాల్ జనం బుద్ధి చెబుతారన్న ప్రధాని

**విశాలభారతి, జాతీయం:**

పశ్చిమ బెంగాల్ రాజకీయాలు ఎప్పుడూ వేడివేడిగానే ఉంటాయి, కానీ ఇప్పుడు ఆ వేడి దేశ అత్యున్నత పదవి అయిన రాష్ట్రపతి భవన్‌ను కూడా తాకింది. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పర్యటనలో ప్రోటోకాల్ పాటించలేదనే అంశంపై కేంద్ర ప్రభుత్వం, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం మధ్య మాటల యుద్ధం తారాస్థాయికి చేరింది. రాష్ట్రపతిని గౌరవించడంలో మమతా బెనర్జీ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని కేంద్రం ఆరోపిస్తుంటే, ఇదంతా బీజేపీ ఆడుతున్న రాజకీయ డ్రామా అని తృణమూల్ కాంగ్రెస్ కొట్టిపారేస్తోంది. ఈ క్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ నేరుగా రంగంలోకి దిగి టీఎంసీ వైఖరిపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ప్రధాని మోదీ బెంగాల్ పర్యటనలో భాగంగా నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడుతూ.. టీఎంసీ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. రాష్ట్రపతి ముర్ము బెంగాల్‌కు వస్తే ఆమెను సముచిత రీతిలో సత్కరించాల్సింది పోయి, ఆమె పాల్గొనాల్సిన కార్యక్రమాలకు అనుమతులు నిరాకరించడం దారుణమని మండిపడ్డారు. ఇది కేవలం ఒక వ్యక్తికి జరిగిన అవమానం



కాదని, దేశ అత్యున్నత పదవికి, భారత రాజ్యాంగానికి జరిగిన అవమానంగా మోదీ అభివర్ణించారు. మమత ప్రభుత్వం తన అహంతో రాజ్యాంగబద్ధమైన పదవులను కూడా లెక్కచేయడం లేదని ఆయన విమర్శించారు. ద్రౌపదీ ముర్ము జీవిత ప్రయాణం ఎంతో స్ఫూర్తిదాయకమని, గిరిజన ప్రాంతం నుంచి వచ్చి ఎన్నో కష్టాలను ఎదుర్కొని దేశ ప్రథమ పౌరురాలిగా ఎదిగారని ప్రధాని కొనియాడారు. అలాంటి మహిళా మూర్తి పట్ల తృణమూల్ కాంగ్రెస్ చూపుతున్న వివక్ష వారి సంకుచిత మనస్తత్వానికి నిదర్శనమని విమర్శించారు. ఒక సాధారణ గిరిజన మహిళ అత్యున్నత స్థానంలో ఉండటం టీఎంసీ నాయకులకు నచ్చడం లేదని, అందుకే ఇలాంటి అడ్డంకులు సృష్టిస్తున్నారని మోదీ ఆరోపించారు. మురికి రాజకీయాల కోసం రాజ్యాంగ వ్యవస్థలను వాడుకోవడం సరికాదని హితవు పలికారు. బెంగాల్ రాజకీయాల్లో మార్పు మొదలైందని, మమతా బెనర్జీ అరాచక పాలనకు అంతం దగ్గర పడిందని మోదీ ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రపతిని అవమానించిన తృణమూల్ కాంగ్రెస్‌కు బెంగాల్ ప్రజలు రాబోయే ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. రాష్ట్ర అభివృద్ధిని పక్కన పెట్టి కేవలం ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే కేంద్రంతో ఘర్షణ పడుతున్నారని దుయ్యబట్టారు. వచ్చే ఎన్నికల్లో బెంగాల్ గడ్డపై కచ్చితంగా బీజేపీ జెండా ఎగురుతుందని, ప్రజలు మార్పును కోరుకుంటున్నారని ఆయన స్పష్టం చేశారు.

మరోవైపు ప్రధాని మోదీ ఆరోపణలపై బెంగాల్ సీఎం మమతా బెనర్జీ తీవ్రంగా స్పందించారు. కేంద్ర ప్రభుత్వం కావాలనే కుట్రపూరితంగా రాష్ట్ర ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తోందని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో లబ్ధి పొందడం కోసమే రాష్ట్రపతి పదవిని బీజేపీ రాజకీయాల్లోకి లాగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము ఎప్పుడూ రాష్ట్రపతి స్థానాన్ని గౌరవిస్తామని, ఆమె పట్ల తమకు ఎలాంటి వ్యతిరేకత లేదని స్పష్టం చేశారు. బీజేపీ చేస్తున్నవన్నీ అభూతకల్పనలని ఆమె కొట్టిపారేసారు.

రాష్ట్రపతి పాల్గొనే కార్యక్రమం గురించి తమకు సరైన సమాచారం లేదని మమత వివరణ ఇచ్చారు. ఆ కార్యక్రమ వివరాలు లేదా ఆమె పర్యటన షెడ్యూల్ గురించి ముందస్తుగా ఎలాంటి అధికారిక సమాచారం అందలేదని, అలాంటప్పుడు అనుమతుల నిరాకరణ అనే ప్రసక్తే రాదని పేర్కొన్నారు. బీజేపీ నాయకులు కావాలనే గందరగోళం సృష్టించి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆమె ఆరోపించారు. కేంద్ర దర్యాప్తు సంస్థలను ఉపయోగించి ఇబ్బంది పెడుతున్న బీజేపీ, ఇప్పుడు కొత్తగా ఇలాంటి ప్రోటోకాల్ అంశాలను తెరపైకి తెస్తోందని విమర్శించారు.

బెంగాల్‌లో మమత ప్రభుత్వం గిరిజన వ్యతిరేకి అని ముద్ర వేసేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని టీఎంసీ నేతలు వాదిస్తున్నారు. రాష్ట్రపతి ముర్ము పట్ల తమకు ఎంతో గౌరవం ఉందని, గతంలో కూడా ఆమె పర్యటనలను ఘనంగా నిర్వహించామని గుర్తు చేస్తున్నారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం ఒక రాజ్యాంగబద్ధమైన పర్యటనను వివాదాస్పదం చేయడం కేంద్రానికే చెల్లిందని వారు ఎద్దేవా చేశారు. రాష్ట్ర హక్కులను హరిస్తూ, మర్యాదల పేరుతో రాజకీయాలు చేయడం భావ్యం కాదని టీఎంసీ శ్రేణులు అభిప్రాయపడుతున్నాయి.

ఈ వివాదం ఇప్పుడు కేవలం ప్రోటోకాల్ పరిమితులకే పరిమితం కాకుండా, రాబోయే బెంగాల్ ఎన్నికల ప్రచార అస్త్రంగా మారిపోయింది. ప్రధాని మోదీ తన ప్రసంగాల్లో మహిళా గౌరవం, గిరిజన సాధికారతను హైలైట్ చేస్తూ టీఎంసీని ఇరకాటంలో పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. మరోవైపు మమతా బెనర్జీ కూడా తగ్గేదేలే అన్నట్లుగా.. కేంద్రం రాష్ట్రాలపై చేస్తున్న పెత్తనాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారు. ఇరు పార్టీల మధ్య నడుస్తున్న ఈ 'కోల్డ్ వార్' బెంగాల్ వీధుల్లో పెను ప్రకంపనలు సృష్టిస్తోంది.

ప్రజాస్వామ్యంలో వ్యవస్థల మధ్య సమన్వయం ఉండాలని, కానీ బెంగాల్ విషయంలో అది మచ్చుకైనా కనిపించడం లేదని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. రాష్ట్రపతి వంటి ఉన్నత పదవిలో ఉన్న వ్యక్తులు పర్యటించినప్పుడు రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాల్సి ఉంటుందని, కానీ ఇక్కడ ఇరుపక్షాలు తమ పంతాలకే ప్రాధాన్యత ఇస్తున్నాయని విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ వివాదం ఎటు దారితీస్తుందో కానీ, బెంగాల్ ప్రజలు మాత్రం ఈ రాజకీయ చదరంగంపై ఆసక్తిగా చర్చించుకుంటున్నారు. బెంగాల్ రాజకీయ భవిష్యత్తును నిర్ణయించే ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో, ఇలాంటి సెంటిమెంట్ అంశాలు ఓటర్లపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలు గిరిజన ఓటు బ్యాంకును ఆకర్షిస్తాయా లేదా మమత ఇస్తున్న కౌంటర్ అటాక్ వర్కౌట్ అవుతుందా అనేది వేచి చూడాలి. ఏది ఏమైనా, రాష్ట్రపతి పర్యటన చుట్టూ అల్లుకున్న ఈ ప్రోటోకాల్ వివాదం మాత్రం ప్రస్తుతానికి దేశవ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది.

## పదవ తరగతి పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి

- ఎమ్మెల్యే జారె ఆదినారాయణ
- గిరిజన ఆశ్రమ పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు ప్రోత్సాహం
- అనంతారం గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల, పెద్దవాగు ప్రాజెక్ట్ పరిధిలోని బాలుర పాఠశాల సందర్శన
- పదవ తరగతి పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలని ఉపాధ్యాయులకు సూచనలు
- గిరిజన విద్యార్థుల అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని హామీ



**అశ్వారావుపేట, విశాలభారతి :** పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. అశ్వారావుపేట మండలంలోని అనంతారం గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాల మరియు పెద్దవాగు ప్రాజెక్ట్ పరిధిలో ఉన్న గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల విద్యా సామర్థ్యం, వసతి సదుపాయాలను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. త్వరలో జరగనున్న పదవ తరగతి పరీక్షలను దృష్టిలో పెట్టుకొని విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత దృష్టి పెట్టి బలహీనంగా ఉన్న వారికి అదనపు తరగతులు నిర్వహించి ఉత్తీర్ణత శాతాన్ని పెంచేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు తెలిపారు. గిరిజన ప్రాంతాల విద్యార్థులు కూడా ఉన్నత విద్యను సాధించి మంచి భవిష్యత్తు నిర్మించుకోవాలని, విద్యార్థుల అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని పేర్కొన్నారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అశ్వారావుపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్‌బాబు, పార్టీ కార్యకర్తలు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ డబుల్ గేమ్ ఆడుతోంది

- ఇరాన్‌కు వ్యతిరేకంగా ఓటు వేసి సంబంధాలు దెబ్బతీశారు
- అప్పుడు 16 దేశాలే, ఇప్పుడు 40 దేశాల నుంచి దిగుమతి
- దేశంలో ఇంధన, గ్యాస్ కొరత లేదు, ప్రజలు భయపడొద్దు
- కాంగ్రెస్‌కు చైనాతో రహస్య ఒప్పందాలు ఉన్నాయని ఆరోపణ
- రేవంత్ సర్కార్ ప్రజాధనాన్ని కేరళ ప్రచారానికి వాడుతోంది
- వచ్చే ఎన్నికల్లో ఎవరితోనూ పొత్తులు పెట్టుకోబోం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం అంతర్జాతీయ పరిణామాలు, స్థానిక ఆర్థిక అంశాల మధ్య మాటల యుద్ధం ముదిరింది. గతంలో ఇరాన్‌కు వ్యతిరేకంగా వ్యవహరించిన కాంగ్రెస్ పార్టీ, ఇప్పుడు అదే ఇరాన్‌పై ప్రేమ ఒలకబోస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు తీవ్రంగా విమర్శించారు. ముఖ్యంగా 2005లో యూపీఏ ప్రభుత్వం ఇంటర్నేషనల్ అటామిక్ ఎనర్జీ ఏజెన్సీ వేదికగా ఇరాన్‌కు వ్యతిరేకంగా తీసుకున్న నిర్ణయం వల్ల భారతదేశానికి జరిగిన నష్టాన్ని ఆయన గుర్తు చేశారు. ఆ రోజు కాంగ్రెస్ తీసుకున్న అనాలోచిత నిర్ణయం వల్లే 2012లో ఇరాన్ భారత్‌కు చమురు సరఫరాను నిలిపివేసిందని, ఆ పాపం పూర్తిగా కాంగ్రెస్‌దేనని ఆయన దుయ్యబట్టారు. కాంగ్రెస్ పార్టీకి దేశ ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలే ముఖ్యమని, గతంలో ఒకలా ఇప్పుడు మరోలా మాట్లాడుతున్నారని రామచందర్ రావు మండిపడ్డారు. ప్రస్తుతం ఇరాన్‌ఇజ్రాయెల్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలను సాకుగా చూపి, దేశంలో చమురు కొరత ఏర్పడుతుందంటూ కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తోందని ఆయన ఆరోపించారు. ప్రజల్లో భయాందోళనలు సృష్టించడం ద్వారా రాజకీయ లబ్ధి పొందాలని చూడటం కాంగ్రెస్ నీచ సంస్కృతికి నిదర్శనమని హితవు పలికారు. దేశానికి అనుకూలంగా మాట్లాడకపోయినా పర్వాలేదు కానీ, అబద్ధాలతో ప్రజలను వణికించవద్దని ఆయన హెచ్చరించారు. యూపీఏ హయాంలో ఉన్న చమురు విధానాలకు, మోదీ ప్రభుత్వ విధానాలకు ఉన్న వ్యత్యాసాన్ని ఆయన వివరించారు. కాంగ్రెస్ పాలనలో భారత్ కేవలం 16 దేశాల నుంచి మాత్రమే చమురు దిగుమతులు చేసుకునేదని, దీనివల్ల అంతర్జాతీయ మార్కెట్లో ఒడిదుడుకులు వచ్చినప్పుడు భారత్ తీవ్రంగా నష్టపోయేదని గుర్తు చేశారు. అయితే నరేంద్ర మోదీ ప్రధాని అయ్యాక వ్యూహాత్మక దౌత్యంతో ఇప్పుడు మనం ఏకంగా 40 దేశాల నుంచి ముడి చమురును దిగుమతి చేసుకుంటున్నామని వెల్లడించారు. ఈ వైవిధ్యం వల్ల ఒక దేశంలో యుద్ధం వచ్చినా మన సరఫరా గొలుసుకు ఎటువంటి విఘాతం కలగదని ఆయన స్పష్టం చేశారు.

ప్రస్తుత యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో గ్యాస్ సిలిండర్ ధరలు పెరుగుతాయని గానీ, సరఫరా ఆగిపోతుందని గానీ వస్తున్న వార్తల్లో వాస్తవం లేదని రామచందర్ రావు భరోసా ఇచ్చారు. దేశంలో తగినంత ఇంధనం, గ్యాస్ స్టాక్ అందుబాటులో ఉందని, కేంద్ర ప్రభుత్వం అన్ని పరిస్థితులను నిశితంగా గమనిస్తోందని చెప్పారు. సామాన్యులపై ఎటువంటి భారం పడకుండా మోదీ ప్రభుత్వం కచ్చితమైన చర్యలు తీసుకుంటోందని, కాంగ్రెస్ చేసే దుష్ప్రచారాన్ని ఎవరూ నమ్మవద్దని కోరారు. ఇంధన భద్రత విషయంలో భారత్ ఇప్పుడు స్వయం సమృద్ధి దిశగా అడుగులు వేస్తోందని ఆయన పేర్కొన్నారు.

కాంగ్రెస్ పార్టీ వైఖరిని ఎండగడుతూ, ఆ పార్టీకి



చైనాతో ఉన్న రహస్య ఒప్పందాల గురించి రామచందర్ రావు ప్రస్తావించారు. దేశ భద్రత కంటే విదేశీ శక్తుల ప్రయోజనాలకే కాంగ్రెస్ పెద్దపీట వేస్తోందని ఆరోపించారు. ఒకవైపు సరిహద్దుల్లో సవాళ్లు ఎదురవుతున్నా, కాంగ్రెస్ నాయకులు మాత్రం శత్రు దేశాలకు అనుకూలంగా మాట్లాడటం వారి ద్వంద్వ నీతిని బయటపెడుతోందన్నారు. చైనాతో కుదుర్చుకున్న ఒప్పందాలు ఏమిటో ప్రజల ముందు ఉంచాలని ఆయన డిమాండ్ చేశారు. ఇలాంటి చర్యల వల్లే కాంగ్రెస్ దేశవ్యాప్తంగా తన ఉనికిని కోల్పోతోందని విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర రాజకీయాలపై స్పందిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరును ఆయన తూర్పారబట్టారు. రాష్ట్ర ఖజానా ఖాళీ అయిందని, సంక్షేమ పథకాలకు నిధులు లేవని ముఖ్యమంత్రి నిత్యం కన్నీరు కారుస్తున్నారని ఎద్దేవా చేశారు. ఒకవైపు రాష్ట్రంలో నిధుల కొరత ఉందని చెబుతూనే, మరోవైపు తెలంగాణ ప్రజల సొమ్మును ఇతర రాష్ట్రాల్లో ఎన్నికల ప్రచారం కోసం ఎలా ఖర్చు చేస్తున్నారని నిలదీశారు. కేరళ ఎన్నికల ప్రచారంలో రేవంత్ రెడ్డి చేస్తున్న హడావిడి చూస్తుంటే తెలంగాణ ప్రజల ధనం పట్ల ఆయనకు ఉన్న బాధ్యతారాహిత్యం అర్థమవుతోందని మండిపడ్డారు.

తెలంగాణ ప్రజల కష్టార్జితమైన కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని కాంగ్రెస్ పార్టీ తన రాజకీయ స్వార్థం కోసం వృథా చేస్తోందని రామచందర్ రావు ఆరోపించారు. రాష్ట్రంలోని రైతులు, నిరుద్యోగులు తమ సమస్యల పరిష్కారం కోసం ఎదురు చూస్తుంటే, ప్రభుత్వం మాత్రం పొరుగు రాష్ట్రాల ఎన్నికలపై దృష్టి పెట్టడం సిగ్గుచేటన్నారు. అభివృద్ధి కంటే ప్రచారానికే రేవంత్ సర్కార్ ప్రాధాన్యం ఇస్తోందని, త్వరలోనే తెలంగాణ ప్రజలు కాంగ్రెస్‌కు బుద్ధి చెబుతారని హెచ్చరించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గాడిలో పెట్టడం మానేసి, రాజకీయ విహారయాత్రలు చేయడం మానుకోవాలని సూచించారు.


రాబోయే అసెంబ్లీ ఎన్నికల విషయంలో బీజేపీ వ్యూహాన్ని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణలో బీజేపీ బలోపేతం అవుతోందని, ప్రజలు మార్పును కోరుకుంటున్నారని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోదని, ఒంటరిగానే బరిలోకి దిగుతుందని ప్రకటించారు. ఇతర పార్టీలపై ఆధారపడాల్సిన అవసరం బీజేపీకి లేదని, ప్రజా మద్దతే తమ బలమని ధీమా వ్యక్తం చేశారు. గత ఎన్నికల ఫలితాలు మరియు ప్రస్తుత పరిస్థితులు గమనిస్తే తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ఆయన జోస్యం చెప్పారు.

రాష్ట్రంలోని గ్రామగ్రామాన బీజేపీ జెండా రెపరెపలాడుతోందని, యువత ముఖ్యంగా మోదీ నాయకత్వాన్ని బలపరుస్తున్నారని రామచందర్ రావు అన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు తమ ఉనికిని కాపాడుకోవడానికి పడే తాపత్రయం చూస్తుంటే జనం నవ్వుకుంటున్నారని వ్యాఖ్యానించారు.

# 'సింగరేణిలో కాంగ్రెస్ దందా'

- సింగరేణి టెండర్లలో భారీ దోపిడీ.. హరీశ్ రావు
- 'సైట్ విజిట్ సర్టిఫికెట్' ముసుగులో కాంట్రాక్టర్ల సిండికేట్
- శ్రీరాంపూర్ టెండర్లలో ప్రభుత్వం అసలు బాగోతం బట్టబయలు
- సీఎం బంధువుల కోసమే నిబంధనల మార్పు అని ఆరోపణ
- బిడ్లు వాయిదా వేస్తూ కమీషన్ల కోసం కక్కుర్తి పడ్డారని విమర్శ
- తక్షణమే సైట్ విజిట్ నిబంధనను రద్దు చేయాలని డిమాండ్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



సింగరేణి కాలరీస్ ఓవర్ బర్డెన్ (ఓబీ) టెండర్ల ప్రక్రియలో రాష్ట్ర ప్రభుత్వం భారీ అక్రమాలకు పాల్పడుతోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు సంచలన ఆరోపణలు చేశారు. ఆదివారం మీడియాతో మాట్లాడిన ఆయన, రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణి సంస్థను దోచుకోవడమే లక్ష్యంగా పనిచేస్తోందని విమర్శించారు. ముఖ్యంగా 'సైట్ విజిట్ సర్టిఫికెట్' అనే నిబంధనను అడ్డం పెట్టుకుని కాంట్రాక్టర్ల రింగ్ ఏర్పాటు చేసి, సంస్థ సంపదను లూటీ చేస్తున్నారని ఆయన ఆధారాలతో సహా వివరించారు. ఈ వ్యవహారమంతా కేవలం అధికార పార్టీకి సన్నిహితంగా ఉండే కాంట్రాక్టర్లకు మేలు చేసేందుకే జరుగుతోందని ఆయన మండిపడ్డారు. శ్రీరాంపూర్ ఎస్ఆర్పీ ఓసీII టెండర్ల వ్యవహారం ఇప్పుడు ప్రభుత్వ వైఫల్యానికి నిలువుటద్దంగా మారిందని హరీశ్ రావు పేర్కొన్నారు. ఈ టెండర్లకు సంబంధించిన ఫైనాన్షియల్ బిడ్లను ఏకంగా ఏడుసార్లు వాయిదా వేయడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని ఆయన ధ్వజమెత్తారు. టెక్నికల్ బిడ్ ప్రక్రియ ముగిసిన తర్వాత కూడా కావాలని జాప్యం చేస్తూ, తమకు అనుకూలమైన వారు రంగంలోకి దిగే వరకు వేచి చూశారని ఆరోపించారు. అయితే బీఆర్ఎస్ నిరంతర పోరాటం, కార్మికుల్లో తెచ్చిన చైతన్యం వల్ల ఎట్టకేలకు పారదర్శకతకు తలొగ్గాల్సి వచ్చిందని, అందుకే ఈ టెండర్ మైనస్ 12 శాతం వద్ద ముగిసిందని ఆయన స్పష్టం చేశారు.

గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఓబీ టెండర్లు అత్యంత పారదర్శకంగా ఆన్‌లైన్ విధానంలో జరిగేవని హరీశ్ రావు గుర్తు చేశారు. అప్పట్లో కాంట్రాక్టర్ల మధ్య గట్టి పోటీ ఉండటంతో సుమారు 7 శాతం నుంచి 20 శాతం తక్కువ ధరలకే పనులు పూర్తయ్యేవని, దీనివల్ల సింగరేణి సంస్థకు వందల కోట్ల రూపాయలు ఆదా అయ్యేవని వివరించారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'సైట్ విజిట్ సర్టిఫికెట్' నిబంధన వల్ల అసలు టెండర్ ఎవరు వేస్తున్నారో ముందే తెలుసుకునే అవకాశం లభించిందని, తద్వారా సిండికేట్ ఏర్పాటు చేయడానికి అధికార పార్టీ నేతలకు ఇది ఒక బ్రహ్మాస్త్రంగా మారిందని ఆయన ఎద్దేవా చేశారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బావమరిది సృజన్ రెడ్డి పేరును ప్రస్తావిస్తూ హరీశ్ రావు తీవ్ర విమర్శలు గుప్పించారు. సృజన్ రెడ్డి సిండికేట్‌ను బద్దలు కొడితే పోటీ ఎలా ఉంటుందో, ధరలు ఎలా దిగివస్తాయో తాజా శ్రీరాంపూర్ టెండర్ నిరూపించిందని ఆయన అన్నారు. ఒకవైపు సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి పడిపోతుంటే, మరోవైపు కమీషన్ల కోసం కక్కుర్తి పడి ఓబీ పనుల్లో జాప్యం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం అనుసరిస్తున్న ఈ విధానాల వల్ల సంస్థ ఆర్థికంగా దెబ్బతినడమే కాకుండా, కార్మికుల ప్రయోజనాలకు కూడా గండి పడుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణి కార్మికులు తమ ప్రాణాలను పణంగా పెట్టి భూగర్భంలో పని చేస్తూ సంస్థను లాభాల బాటలో నడిపిస్తున్నారని, అలాంటి వారి కష్టార్జితాన్ని ప్రభుత్వం దోచుకోవడం దుర్మార్గమని హరీశ్ రావు అన్నారు. ఏటా దసరా బోనస్ రూపంలో కార్మికులు ఆశగా ఎదురుచూసే లాభాల వాటా శాతానికి ఈ కుంభకోణాల వల్ల కోత పడే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. సంస్థను రాజకీయ కమీషన్లకు అడ్డాగా మారిస్తే చూస్తూ ఊరుకోబోమని, కార్మికుల పక్షాన బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వ నిర్ణయాల వల్ల సింగరేణి భవిష్యత్తు అంధకారంలో పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

టెండర్లలో పారదర్శకతను దెబ్బతీసే సైట్ విజిట్ సర్టిఫికెట్ నిబంధనను తక్షణమే రద్దు చేయాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. ఈ కాంట్రాక్టర్ల సిండికేట్ బాగోతంపై సమగ్ర విచారణ జరిపించాలని, బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఇప్పుడు బయటపడిన ఈ వివరాలు కేవలం మచ్చుతునక మాత్రమేనని, లోతుగా దర్యాప్తు చేస్తే ఇంకా పెద్ద ఎత్తున అవినీతి బయటపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. తెలంగాణ ప్రజల సంపదను కాపాడటంలో బీఆర్ఎస్ ఎప్పుడూ ముందుంటుందని, ప్రభుత్వ దోపిడీని ఎండగడుతూనే ఉంటామని ఆయన తేల్చి చెప్పారు. ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే ప్రభుత్వానికి సంస్థ అభివృద్ధి కంటే సొంత జేబులు నింపుకోవడమే ప్రాధాన్యంగా కనిపిస్తోందని హరీశ్ రావు విమర్శించారు. సింగరేణిలో ఉత్పత్తి తగ్గుముఖం పట్టడానికి ఓబీ పనుల్లో జరుగుతున్న ఆలస్యమే ప్రధాన కారణమని, దీనికి ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పారదర్శకత గురించి గొప్పలు చెప్పుకునే రేవంత్ రెడ్డి, తన బావమరిది ప్రమేయం ఉన్న టెండర్ల విషయంలో ఎందుకు మౌనంగా ఉన్నారని ఆయన ప్రశ్నించారు. ఈ వ్యవహారంలో జరిగిన లోపాలన్నింటినీ ప్రజల ముందు ఉంచుతామని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ వనరులను కాపాడేది ఎవరో, కాంట్రాక్టర్ల కమీషన్ల కోసం పాకులాడేది ఎవరో ప్రజలకు ఇప్పటికే అర్థమైందని హరీశ్ రావు అన్నారు. శ్రీరాంపూర్ టెండర్ ఫలితం తెలంగాణ ప్రజల విజయమని, ఇది తమ పోరాటం వల్ల వచ్చిన మార్పు అని ఆయన విశ్లేషించారు.




# సత్యవతి రాథోడ్ కుటుంబంలో మహాలక్ష్మి జననం

- మహిళా శక్తికి ప్రతీకగా నిలిచిన అపూర్వ సందర్భం
- కుటుంబ సభ్యుల్లో ఆనందోత్సాహం



**మహబూబాబాద్, విశాలభారతి:** మహబూబాబాద్ జిల్లా రాజకీయాల్లో ప్రత్యేక గుర్తింపు పొందిన మాజీ మంత్రి శ్రీమతి సత్యవతి రాథోడ్ కుటుంబంలో ఆనందం వెల్లివిరిసింది. ప్రపంచవ్యాప్తంగా మహిళా సాధికారతను స్మరించుకునే అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజునే వారి కుటుంబంలో ఆడబిడ్డ జన్మించడం ఒక విశేషంగా నిలిచింది. సత్యవతి రాథోడ్ కుమారుడు సునీల్ రాథోడ్ మరియు కోడలు సోనం దంపతులకు రెండో సంతానంగా జన్మించిన ఈ చిన్నారి కుటుంబ సభ్యులకు, అభిమానులకు అపారమైన ఆనందాన్ని కలిగించింది. మహిళా శక్తిని గౌరవించే ఈ ప్రత్యేక రోజునే ఈ పుట్టుక జరగడం ఒక దైవ సంకల్పంగా పలువురు అభివర్ణిస్తున్నారు. గిరిజన గడ్డపై పుట్టి సామాన్య కుటుంబం నుంచి వచ్చిన సత్యవతి రాథోడ్ తమ కృషి, పట్టుదలతో రాష్ట్ర రాజకీయాల్లో ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. ఎటువంటి రాజకీయ వారసత్వం లేకుండా ప్రజా సేవను ధ్యేయంగా తీసుకుని అడుగడుగునా కష్టాలను ఎదుర్కొంటూ ఎదిగిన ఆమె ప్రస్థానం తెలంగాణ మహిళలకు స్ఫూర్తిదాయకంగా నిలిచింది. గ్రామీణ ప్రాంతాల్లో పుట్టిన ఒక సాధారణ గిరిజన యువతి రాష్ట్ర కేబినెట్ మంత్రిగా ఎదగడం అనేది అరుదైన ఘట్టం. ఆమె తన రాజకీయ ప్రయాణంలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ ప్రజల విశ్వాసాన్ని సంపాదించారు. సత్యవతి రాథోడ్ ప్రజా సేవా తపన, మహిళా సాధికారత కోసం చేసిన కృషి, గిరిజనుల అభివృద్ధికి తీసుకున్న నిర్ణయాలు ఆమెను ప్రజల మనసుల్లో ఒక ప్రత్యేక స్థానం కలిగించాయి. రాజకీయాల్లో మహిళలు కూడా పెద్ద స్థాయికి ఎదగగలరని ఆమె తన జీవితంతోనే నిరూపించారు. ఆమె ప్రస్థానం అనేక మహిళలకు ధైర్యం ఇచ్చింది. గ్రామీణ ప్రాంతాల్లోని యువతులు కూడా తమ కలలను సాకారం చేసుకోవచ్చని ఆమె చూపించిన మార్గం ఒక ప్రేరణగా నిలిచింది. ఇలాంటి స్ఫూర్తిదాయక మహిళా నాయకురాలి కుటుంబంలో మహిళా దినోత్సవం రోజే ఆడబిడ్డ జన్మించడం కుటుంబ సభ్యులకు మాత్రమే కాకుండా అభిమానులకు కూడా ఒక ప్రత్యేక ఆనందాన్ని కలిగించింది. ఈ చిన్నారి పుట్టుకతో కుటుంబంలో సంతోషం వెల్లివిరిసింది. నానమ్మగా సత్యవతి రాథోడ్ ఈ చిన్నారిని ఆశీర్వదిస్తూ కుటుంబ సభ్యులతో కలిసి ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, స్నేహితులు, రాజకీయ నాయకులు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. సునీల్ రాథోడ్ - సోనం దంపతులకు ఇది రెండో సంతానం కావడం విశేషం. కుటుంబ సభ్యులు ఈ చిన్నారిని "మహాలక్ష్మి"గా భావిస్తూ ఇంటికి వచ్చిన కొత్త వెలుగుగా స్వాగతిస్తున్నారు. మహిళా శక్తిని గౌరవించే రోజునే ఈ పుట్టుక జరగడం ఒక శుభసూచకంగా పలువురు పేర్కొంటున్నారు. భవిష్యత్తులో ఈ చిన్నారి కూడా తన నానమ్మలాగే పట్టుదలతో ఎదిగి సమాజానికి సేవ చేసే గొప్ప వ్యక్తిగా నిలవాలని కుటుంబ సభ్యులు ఆకాంక్షిస్తున్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా మహిళల శక్తి, వారి సామర్థ్యాన్ని ప్రపంచం గుర్తు చేసుకుంటున్న వేళ సత్యవతి రాథోడ్ కుటుంబంలో జరిగిన ఈ సంఘటన ఒక ప్రత్యేక సందేశాన్ని ఇస్తోంది. మహిళలు సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తారని, వారికి అవకాశాలు లభిస్తే వారు అసాధ్యాన్ని సైతం సాధించగలరని ఇది మరోసారి నిరూపిస్తోంది. ఈ సందర్భంగా సునీల్ రాథోడ్ కి, సోనం కి, అలాగే మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ కుటుంబ సభ్యులందరికీ పలువురు నాయకులు, అభిమానులు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నారు. మహిళా శక్తికి ప్రతీకగా నిలిచిన ఈ ప్రత్యేక రోజు వారి కుటుంబానికి చిరస్మరణీయమైన రోజుగా నిలిచిపోతుందని వారు పేర్కొంటున్నారు.

# ఆర్థిక యుద్ధం దిశగా ఇరాన్

- హర్మూజ్ జలసంధి దిగ్బంధంతో గల్ఫ్ చమురు గొంతు నులమడం
- యుద్ధాన్ని సైనిక క్షేత్రం నుండి ఆర్థిక క్షేత్రానికి మళ్లించడం
- బ్యారెల్ ధర 200 డాలర్లకు చేరితే ప్రపంచవ్యాప్త ద్రవ్యోల్బణం
- అమెరికా మిత్రదేశాల ద్వారా ట్రంప్‌పై ఒత్తిడి తెచ్చే ఎత్తుగడ
- సముద్రగర్భ కేబుల్స్, డేటా సెంటర్లపై దాడుల హెచ్చరిక
- నేరుగా గెలవలేక ప్రపంచ ఆర్థిక వ్యవస్థను పణంగా పెట్టడం



**విశాలభారతి, అంతర్జాతీయం:**

యుద్ధం అంటే కేవలం తుపాకులు, క్షిపణులు మాత్రమే కాదు.. అవతలి వాడి జేబు ఖాళీ చేయడం కూడా. ఇప్పుడు ఇరాన్ సరిగ్గా ఇదే చేస్తోంది. "హర్మూజ్ జలసంధిని మూసేశాం.. ఇక చమురు మంటలు చూడండి" అంటూ ఐఆర్‌జీసీ సలహాదారు ఇబ్రహీం జబారీ చేసిన వ్యాఖ్యలు కేవలం హెచ్చరికలు మాత్రమే కాదు, ఇరాన్ గీసుకున్న కొత్త యుద్ధ వ్యూహానికి నిదర్శనం. అమెరికా, ఇజ్రాయెల్ వంటి అగ్రరాజ్యాల సైనిక శక్తి ముందు నేరుగా నిలబడటం కష్టమని తెలిసిన ఇరాన్, ఇప్పుడు ప్రపంచ ఆర్థిక నాడిని పట్టుకుంది. ఈ యుద్ధం గెలవడానికంటే, ప్రపంచాన్ని తనతో పాటు సంక్షోభంలోకి లాగడమే లక్ష్యంగా కనిపిస్తోంది. సాధారణంగా ఏ దేశమైనా యుద్ధం చేస్తే మిత్రదేశాల మద్దతు కోరుకుంటుంది. కానీ ఇరాన్ పరిస్థితి వేరు. చైనా, రష్యా, ఉత్తర కొరియా వంటి దేశాలు మాటల మద్దతు ఇస్తున్నా, క్షేత్రస్థాయిలో అమెరికాతో తలపడటానికి సిద్ధంగా లేవు. ఒకవేళ ఇజ్రాయెల్, అమెరికా కలిసి విరుచుకుపడితే ఇరాన్ ఏకాకి కాక తప్పదు. ఆ అశక్తత నుంచే ఈ 'ఆర్థిక ఉగ్రవాదం' పుట్టుకొచ్చింది. ప్రపంచానికి చమురు సరఫరా చేసే హర్మూజ్ జలసంధిని అడ్డం పెట్టుకుని, గల్ఫ్ దేశాల చమురు కేంద్రాలపై దాడులు చేయడం ద్వారా ప్రపంచాన్ని తన దారికి తెచ్చుకోవాలని ఖమేనీ సర్కార్ భావిస్తోంది.

చమురు ధరలు పెరగడం అంటే కేవలం పెట్రోల్ ధరలు పెరగడం మాత్రమే కాదు, అది నిత్యావసరాల నుంచి రవాణా వరకు ప్రతి రంగాన్ని దెబ్బతీస్తుంది. ప్రస్తుతం 80 డాలర్ల వద్ద ఉన్న బ్యారెల్ ధర ఒక్కసారిగా 200 డాలర్లకు చేరితే ప్రపంచ దేశాల బడ్జెట్లు తలకిందులవుతాయి. హర్మూజ్ జలసంధి ద్వారా భారత్ తన అవసరాల్లో మెజారిటీ వాటాను దిగుమతి చేసుకుంటుంది. జపాన్, దక్షిణ కొరియా వంటి దేశాలు పూర్తిగా దీనిపైనే ఆధారపడ్డాయి. ఇరాన్ వేస్తున్న ఈ చమురు దెబ్బ తగిలితే ఢిల్లీ నుంచి టోక్యో వరకు ప్రతి దేశం గిలగిలలాడాల్సిందే.

ఇరాన్ వ్యూహం చాలా స్పష్టంగా ఉంది. తనపై దాడులు జరిగితే, దాని ప్రభావం కేవలం తన సరిహద్దులకే పరిమితం కాకూడదని ఆ దేశం కోరుకుంటోంది. గల్ఫ్ దేశాల్లోని చమురు పైపులైన్లు, నిల్వ కేంద్రాలను లక్ష్యంగా చేసుకోవడం ద్వారా ఆ దేశాల ఆర్థిక వ్యవస్థలను కుప్పకూల్చాలని చూస్తోంది. ఇలా చేయడం వల్ల ఇటు ఇంధన కొరత ఏర్పడటమే కాకుండా, అటు ఎగుమతులు నిలిచిపోయి ప్రపంచ మార్కెట్లో హాహాకారాలు మొదలవుతాయి. ఈ రకమైన అనిశ్చితి ప్రపంచ దేశాలను ఇరాన్ పక్షాన నిలబడేలా చేయకపోయినా, అమెరికాపై ఒత్తిడి తెచ్చేలా చేస్తాయని ఆ దేశ అంచనా. ముఖ్యంగా అమెరికాలో అధికారంలో ఉన్న ట్రంప్ సర్కార్‌ను లక్ష్యంగా చేసుకుని ఈ వ్యూహం రూపుదిద్దుకుంది. అమెరికా ఆర్థిక వ్యవస్థకు ద్రవ్యోల్బణం పెద్ద శత్రువు. చమురు ధరలు పెరిగితే అమెరికా పౌరుల నుంచి ట్రంప్‌కు వ్యతిరేకత మొదలవుతుంది. తన దేశ ప్రజల ప్రయోజనాల దృష్ట్యా, ఇరాన్‌తో యుద్ధాన్ని ఆపమని లేదా షరతులు సడలించమని ట్రంప్ ఆలోచించాల్సి వస్తుంది. అంటే, యుద్ధ క్షేత్రంలో సైనికులను చంపడం కంటే, ప్రత్యర్థి దేశంలో ధరలను పెంచి రాజకీయంగా దెబ్బతీయడమే ఇరాన్ అసలు ఉద్దేశం. ఈ విధ్వంసం కేవలం చమురుతోనే ఆగిపోదు. ఆధునిక ప్రపంచానికి జీవనాడి అయిన డేటా సెంటర్లు, ఇంటర్నెట్ సేవలకు ఆధారమైన సముద్రగర్భ కేబుల్స్‌పై కూడా కన్ను పడింది. ఇప్పటికే బహ్రెయిన్ వంటి దేశాల్లోని డేటా కేంద్రాలపై దాడుల హెచ్చరికలు వెలువడ్డాయి. ఒకవేళ ఇరాన్ ఈ కేబుళ్లను దెబ్బతీస్తే ప్రపంచ వ్యాప్తంగా బ్యాంకింగ్, కమ్యూనికేషన్ వ్యవస్థలు అస్తవ్యస్తమవుతాయి. తుపాకీ గుండు కంటే కీబోర్డ్ దెబ్బ బలంగా ఉంటుందని ఇరాన్ ఈ రకమైన సైబర్ మరియు భౌతిక దాడుల ద్వారా నిరూపించాలని చూస్తోంది. ప్రస్తుత తరం ఈ యుద్ధాన్ని కేవలం మ్యాపుల్లో చూసి వదిలేయడానికి వీల్లేదు. ఎందుకంటే, పశ్చిమ ఆసియాలో మండుతున్న మంటల సెగ మీ జేబుకు తగులుతుంది. ఇరాన్ అనుసరిస్తున్న ఈ 'ప్రత్యామ్నాయ యుద్ధం' వల్ల సామాన్యుడి బతుకు భారమవుతుంది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం వల్ల ఇప్పటికే సరఫరా గొలుసు దెబ్బతిన్న తరుణంలో, ఇప్పుడు ఇరాన్ చేస్తున్న ఈ ఆర్థిక బ్లాక్ మెయిల్ ప్రపంచాన్ని మరో గొప్ప మాంద్యం వైపు నెట్టే ప్రమాదం ఉంది. ఇరాన్ గెలుపు కోసం కాదు, కనీసం తన ఉనికిని చాటుకోవడానికి ప్రపంచాన్ని బలిపీఠం మీద పెడుతోంది.

ఇక గల్ఫ్ దేశాల పరిస్థితి అడకత్తెరలో పోకచెక్కలా మారింది. ఒకవైపు ఇరాన్ బెదిరింపులు, మరోవైపు అమెరికా రక్షణ కవచం మధ్య అవి నలిగిపోతున్నాయి. ఇరాక్ ఇప్పటికే చమురు ఎగుమతులను నియంత్రిస్తూ తన ఆర్థిక మూలాలను కాపాడుకునే ప్రయత్నం చేస్తోంది. కానీ పూర్తిస్థాయిలో యుద్ధం మొదలైతే ఏ దేశం కూడా సురక్షితంగా ఉండదు. ఇరాన్ చేస్తున్న ఈ దాడులు ఇతర దేశాల సార్వభౌమత్వాన్ని దెబ్బతీయడమే కాకుండా, అంతర్జాతీయ వాణిజ్య నిబంధనలను కాలరాస్తున్నాయి. అయినా ఇరాన్ తగ్గడం లేదంటే అది తన మనుగడ కోసమేనని స్పష్టమవుతోంది. యుద్ధం ఆగిపోవాలంటే ఇజ్రాయెల్, అమెరికా క్షిపణులు శాంతించాలి. కానీ ఇరాన్ మొదలుపెట్టిన ఈ ఆర్థిక సమరానికి ముగింపు ఎక్కడో ఎవరికీ తెలియదు. చమురు సరఫరా పునరుద్ధరణ జరగడానికి నెలలు పట్టవచ్చు. ఈ లోపు ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు జరగాల్సిన నష్టం జరిగిపోతుంది. దౌత్య మార్గాల ద్వారా ఒత్తిడి పెంచి ఇరాన్‌ను దారికి తెచ్చే ప్రయత్నాలు జరుగుతున్నా, క్షేత్రస్థాయిలో బ్రిగేడియర్ జనరల్ జబారీ వంటి వారి వ్యాఖ్యలు అగ్నికి ఆజ్యం పోస్తున్నాయి. ఇరాన్ తన తెలివితేటలను సైనిక రంగం నుంచి ఆర్థిక రంగం వైపు మళ్లించిన తీరు ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. ఇది కేవలం ఇరాన్ వర్సెస్ అమెరికా యుద్ధం కాదు.. ఇది 'ప్రపంచం వర్సెస్ పెట్రోల్ ధరలు' అన్నట్టుగా మారిపోయింది. ఇరాన్ తన పంతం నెగ్గించుకోవడానికి అనుసరిస్తున్న ఈ విధ్వంసకర వ్యూహం ఫలించినా, విఫలమైనా అంతిమంగా నష్టపోయేది ప్రపంచ సామాన్యుడే. ట్రంప్ ఈ సవాళ్లను ఎలా ఎదుర్కొంటారు, ఇరాన్ వేసిన ఈ ఆర్థిక ఉచ్చు నుంచి ప్రపంచాన్ని ఎలా కాపాడతారు అనేది వేచి చూడాలి. యుద్ధం ఆయుధాలతో ముగిసినా, దాని వల్ల ఏర్పడే ఆర్థిక గాయాలు మానడానికి చాలా కాలం పడుతుంది.

# ఇరాన్ అల్లకల్లోలం

**విశాలభారతి, అంతర్జాతీయం:**

పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు కమ్ముకోవడమే కాదు, ఇప్పుడు అగ్నిపర్వతంలా బద్దలయ్యాయి. గత వారం రోజులుగా సాగుతున్న ఉద్రిక్తతలు ఆదివారంతో పరాకాష్టకు చేరాయి. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌ను లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయెల్ క్షిపణుల వర్షం కురిపించడంతో ఆ నగరం ఒక్కసారిగా అగ్నిగుండంగా మారిపోయింది. ఎటు చూసినా పేలుళ్ల శబ్దాలు, మంటల పొగలతో యుద్ధ భయానక దృశ్యాలు కళ్ల ముందు కదలాడుతున్నాయి. ముఖ్యంగా టెహ్రాన్ తూర్పు, దక్షిణ ప్రాంతాలపై ఇజ్రాయెల్ యుద్ధ విమానాలు కనికరం లేకుండా విరుచుకుపడ్డాయి. అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా జరిపిన ఈ భీకర దాడుల్లో ఇరాన్‌కు చెందిన అనేక యుద్ధ విమానాలు నేలమట్టమవడమే కాకుండా, ఆ దేశ ఆర్థిక మూలాధారమైన భారీ చమురు నిల్వ కేంద్రాలు ధ్వంసమయ్యాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ యుద్ధంలో మరింత దూకుడు ప్రదర్శిస్తున్నారు. అమెరికాతో చర్చలు జరిపే ప్రసక్తే లేదన్న ఇరాన్ ప్రకటనపై ఆయన తీవ్రంగా స్పందించారు. ఇరాన్‌పై దాడులను మరింత తీవ్రతరం చేస్తామని, ఆ దేశాన్ని బేషరతుగా లొంగిపోయేలా చేస్తామని శపథం చేశారు. భూమిపై ఉన్న ఒక పెద్ద క్యాన్సర్‌ను తాము తొలగిస్తున్నామని, తాము చేస్తున్న ఈ పని కేవలం అమెరికా, ఇజ్రాయెల్‌కు మాత్రమే కాకుండా యావత్ ప్రపంచానికి మేలు చేస్తుందని ట్రంప్ వ్యాఖ్యానించడం గమనార్హం. మినాబ్‌లోని బాలికల పాఠశాలపై ఇరానే దాడి చేసిందన్న తీవ్ర ఆరోపణలు చేసిన ట్రంప్, ఇరాన్ నౌకాదళాన్ని తాము ఇప్పటికే పూర్తిగా తుడిచిపెట్టేశామని ధీమా వ్యక్తం చేశారు. మరోవైపు ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెన్యామిన్ నెతన్యాహు తనదైన శైలిలో హెచ్చరికలు జారీ చేశారు. ఇరాన్‌కు "ముందుంది ముసళ్ల పండగ" అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు యుద్ధం ఎంత తీవ్రస్థాయికి చేరుతుందో సూచిస్తున్నాయి. కేవలం శనివారం ఒక్క రోజే ఇరాన్‌లోని 300 లక్ష్యాలపై దాడులు చేశామని ప్రకటించిన ఇజ్రాయెల్, యుద్ధం ఇక్కడితో ఆగదని స్పష్టం చేసింది. తదుపరి దశలో ఇరాన్‌కు ఊహించని "సర్ప్రైజ్‌లు" ఇస్తామని నెతన్యాహు ప్రకటించడంతో, పశ్చిమాసియాలో ఏ క్షణంలో ఏం జరుగుతుందోనన్న ఆందోళన నెలకొంది. ఈ యుద్ధ తంత్రంలో బ్రిటన్ సహకరించకపోవడంపై ట్రంప్ అసహనం వ్యక్తం చేయడం అంతర్జాతీయ రాజకీయాల్లో కొత్త చర్చకు దారితీసింది. యుద్ధం కేవలం ఇరాన్, ఇజ్రాయెల్ సరిహద్దులకే పరిమితం కాకుండా గల్ఫ్ దేశాలకు కూడా పాకింది. ఆదివారం ఉదయం ఇరాన్ నుంచి ప్రయోగించిన 16 బాలిస్టిక్



క్షిపణులు, 117కు పైగా డ్రోన్లు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ వైపు దూసుకొచ్చాయి. అయితే యూఏఈ రక్షణ మంత్రిత్వ శాఖ అప్రమత్తంగా వ్యవహరించి అన్ని క్షిపణులను విజయవంతంగా అడ్డుకుంది. మెజారిటీ డ్రోన్లను కూల్చివేసినా, నాలుగు డ్రోన్లు తమ భూభాగంలో పడ్డాయని యూఏఈ అధికారులు ధ్రువీకరించారు. ఇటువంటి ముప్పులను ఎదుర్కోవడానికి తమ సైన్యం సర్వసన్నద్ధంగా ఉందని వారు స్పష్టం చేశారు. ఈ దాడుల ప్రభావంతో దుబాయ్‌లోని ప్రసిద్ధ 23 మెరినా టవర్ దెబ్బతినడం స్థానికులను భయాందోళనలకు గురిచేస్తోంది.

ప్రతీకారేచ్ఛతో రగిలిపోతున్న ఇరాన్, గల్ఫ్ దేశాల్లోని అమెరికా స్థావరాలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తోంది. గత రాత్రి బహ్రెయిన్‌లోని అమెరికా స్థావరం, ఇరాక్‌లోని అమెరికా ఎంబసీ, ఇర్బిల్ విమానాశ్రయంపై ఇరాన్ క్షిపణులతో విరుచుకుపడింది. పొరుగు దేశాల నుంచి తమపై దాడులు జరిగితే తాము ఊరుకోబోమని ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ గట్టి హెచ్చరికలు జారీ చేశారు. అయితే ఇతర దేశాల ప్రజలకు హాని చేయడం తమ ఉద్దేశం కాదని, కేవలం తమ ఆత్మరక్షణ కోసమే స్పందిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. లొంగిపోయే ప్రసక్తే లేదని తేల్చిచెప్పిన ఆయన, తమ పొరుగు దేశాలకు కలిగిన అసౌకర్యానికి క్షమాపణలు కోరడం విశేషం.

యుద్ధం కారణంగా గల్ఫ్ ప్రాంతంలో చమురు సంక్షోభం తలెత్తే సూచనలు కనిపిస్తున్నాయి. ముందుజాగ్రత్త చర్యగా కువైట్ ప్రభుత్వం చమురు ఉత్పత్తిని తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. చమురు ధరలు పెరిగినా, అంతే వేగంగా తగ్గుతాయని ట్రంప్ భరోసా ఇస్తున్నప్పటికీ, ప్రపంచవ్యాప్తంగా సరఫరా వ్యవస్థ దెబ్బతినే ప్రమాదం ఉంది. ఇరాన్ ఎదుర్కొంటున్న ఈ క్లిష్ట పరిస్థితుల్లో, ఆ దేశ అసెంబ్లీ ఆఫ్ ఎక్స్‌పర్ట్స్ కొత్త సుప్రీం లీడర్ ఎంపిక కోసం అత్యవసరంగా భేటీ కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇది ఇరాన్ రాజకీయ భవిష్యత్తును మార్చే పరిణామంగా నిపుణులు భావిస్తున్నారు. యుద్ధం సెగ ఇప్పుడు ఐరోపా దేశాలకు కూడా తాకింది. నార్వే రాజధాని ఓస్లోలోని యూఎస్ ఎంబసీ సమీపంలో భారీ పేలుడు సంభవించడం కలకలం సృష్టించింది. పెద్ద శబ్దం రావడంతో పాటు ఆ ప్రాంతమంతా దట్టమైన పొగ కమ్ముకుందని పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనలో ఎవరూ గాయపడనప్పటికీ, పేలుడుకు గల కారణాలు ఇంకా స్పష్టం కాలేదు. ఇది ఇరాన్ మద్దతుదారుల చర్యా లేక సాంకేతిక లోపమా అనే కోణంలో దర్యాప్తు సాగుతోంది. ఈ పరిణామంతో ప్రపంచవ్యాప్తంగా ఉన్న అమెరికా రాయబార కార్యాలయాల వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. లెబనాన్ రాజధాని బీరుట్‌లోనూ ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతున్నాయి. అక్కడ ఒక హోటల్‌పై జరిగిన దాడిలో నలుగురు వ్యక్తులు మరణించినట్లు లెబనీస్ అధికారులు ధ్రువీకరించారు. ఇరాన్‌కు మద్దతు ఇస్తున్న సాయుధ గ్రూపులే లక్ష్యంగా ఇజ్రాయెల్ ఈ దాడులు చేస్తోంది. ఇరాక్‌లోని కుర్దిష్ దళాలు ఈ యుద్ధంలో తలదూర్చవద్దని ట్రంప్ కోరడం ద్వారా, యుద్ధాన్ని మరింత క్లిష్టంగా మార్చకూడదని అమెరికా భావిస్తున్నట్లు కనిపిస్తోంది. కానీ క్షేత్రస్థాయిలో జరుగుతున్న విధ్వంసం మాత్రం అందుకు భిన్నంగా ఉంది.

గత ఎనిమిది రోజులుగా నిరంతరాయంగా సాగుతున్న ఈ పోరులో ఇరాన్ రక్షణ వ్యవస్థ దాదాపు కుప్పకూలిందని సమాచారం. ఆధునిక యుద్ధ విమానాలు, క్షిపణులతో ఇజ్రాయెల్ చేస్తున్న దాడులను ఎదుర్కోవడం ఇరాన్‌కు కష్టతరంగా మారింది. టెహ్రాన్ వీధుల్లో ప్రస్తుతం మరణహోమం కనిపిస్తోంది. ప్రజలు ఇళ్లను వదిలి సురక్షిత ప్రాంతాలకు పరుగులు తీస్తున్నారు. ఇటు ట్రంప్ కఠిన వైఖరి, అటు నెతన్యాహు దూకుడు వెరసి ఇరాన్ ఇప్పుడు ఒక అంధకారంలోకి నెట్టబడింది. ప్రస్తుతానికి పశ్చిమాసియాలో శాంతి చర్చల ఊసే వినిపించడం లేదు. ఇరు పక్షాలు వెనక్కి తగ్గే సూచనలు లేకపోవడంతో ఈ ప్రాంతం మూడవ ప్రపంచ యుద్ధానికి కేంద్ర బిందువుగా మారుతుందా అన్న భయం ప్రపంచ దేశాలను వెంటాడుతోంది. ఐక్యరాజ్యసమితి జోక్యం చేసుకుని యుద్ధాన్ని ఆపకపోతే మానవ ప్రాణనష్టం ఊహించని స్థాయిలో ఉంటుందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. రానున్న 24 గంటలు ఇరాన్ మనుగడకు అత్యంత కీలకమైనవిగా మారనున్నాయి.

# మూసీ బ్యూటిఫికేషన్‌పై తగ్గేదేలే..!

మొదటిపేజీ తరువాయి

కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ప్రసంగం చేశారు. ముఖ్యంగా మూసీ బ్యూటిఫికేషన్ విషయంలో ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను ఆయన తీవ్రంగా తిప్పికొట్టారు. నగరాన్ని కాలుష్య రహితంగా మార్చే ప్రక్రియలో భాగంగా మూసీ ప్రక్షాళన అనేది అత్యంత ఆవశ్యకమని, ఇందులో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. ఢిల్లీలో యమునా, గుజరాత్‌లో సబర్మతీ నదులను ప్రక్షాళన చేసినట్లే, హైదరాబాద్‌ను కాపాడుకోవడానికి మూసీని పునరుద్ధరించాల్సిందేనని ఆయన తేల్చి చెప్పారు. రాజధాని నగరం హైదరాబాద్ కాలుష్య కోరల్లో చిక్కుకోకుండా ఉండేందుకు ప్రభుత్వం దీర్ఘకాలిక ప్రణాళికలు సిద్ధం చేసింది. ప్రస్తుతం నగరంలో గాలి నాణ్యత ఆరెంజ్ కేటగిరీలోకి చేరడం పట్ల సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో మన పిల్లలు మాస్కులు లేకుండా తిరగలేని పరిస్థితి రాకూడదంటే ఇప్పుడే కఠిన నిర్ణయాలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఇందులో భాగంగానే 2026 డిసెంబర్ 9 నాటికి నగరంలో డీజిల్ బస్సులను పూర్తిగా తొలగించి, వంద శాతం ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కాలుష్యకారక పరిశ్రమలను నగరం అవతలికి తరలించడంతో పాటు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను కూడా పూర్తిగా నిషేధించబోతున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు.

రాష్ట్ర అభివృద్ధిలో మహిళల పాత్ర ఎనలేనిదని, కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ మహిళా నాయకత్వానికి అగ్రపీఠం వేస్తుందని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. రాష్ట్రపతి నుంచి ముఖ్యమంత్రుల వరకు కీలక పదవులను మహిళలకు అందించిన ఘనత తమ పార్టీదేనన్నారు. తెలంగాణలో కూడా కీలకమైన జిల్లా కలెక్టర్లుగా, ఎస్ఐబీ చీఫ్‌లుగా మహిళా అధికారులనే నియమించామని, వారికి అవకాశం ఇస్తే అద్భుతాలు సృష్టిస్తారని కొనియాడారు. మహిళా సంఘాలు కేవలం పొదుపు సంఘాలుగా మాత్రమే మిగిలిపోకుండా, కార్పొరేట్ కంపెనీలతో పోటీ పడేలా వారిని వెయ్యి బస్సుల యజమానులను చేశామని, సోలార్ ప్లాంట్ల నిర్వహణను కూడా వారికి అప్పగించామని సీఎం వివరించారు.

జర్నలిస్టుల సంక్షేమంపై ముఖ్యమంత్రి వరాల జల్లు కురిపించారు. ముఖ్యంగా మహిళా జర్నలిస్టులకు కార్యాలయాల్లో రక్షణ కోసం ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. డెస్క్ జర్నలిస్టుల గుర్తింపు విషయంలోనూ ఎవరికీ అన్యాయం జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని భరోసా ఇచ్చారు. జర్నలిస్టుల చిరకాల స్వప్నమైన



ఇళ్ల స్థలాల విషయంలో త్వరలోనే శుభవార్త చెబుతామని, చట్టపరమైన ఇబ్బందులు లేకుండా ఈ ప్రక్రియను పూర్తి చేస్తామని ప్రకటించారు. ఫ్యూచర్ సిటీలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు జర్నలిస్టుల కోసం ప్రత్యేకంగా ఒక మోడల్ కాలనీని డిజైన్ చేస్తామని ఆయన ఈ సందర్భంగా వెల్లడించారు.

గాంధీ సరోవర్ ప్రాజెక్టుపై జరుగుతున్న తప్పుడు ప్రచారాలను సీఎం రేవంత్ రెడ్డి గట్టిగా ఖండించారు. ఈ ప్రాజెక్టు పేరుతో వేల కోట్లు ఖర్చు చేస్తున్నారన్నది పచ్చి అబద్ధమని, కేవలం 200 కోట్లతోనే గాంధీ విగ్రహం, విజ్ఞాన కేంద్రం, పరిసరాల అభివృద్ధిని చేపడుతున్నామని వివరించారు. బాధితులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని, నష్టపోయిన వారికి ప్రత్యామ్నాయంగా అపార్ట్‌మెంట్లు కట్టించి ఇస్తామని లేదా నగదు రూపంలో పరిహారం అందిస్తామని స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన పూర్తి వాస్తవాలను ప్రజల ముందు ఉంచేందుకు ఈ నెల 13వ తేదీన ఒక సమగ్రమైన పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు.

తెలంగాణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో భాగ్యనగరం వెన్నెముక వంటిదని సీఎం అభిప్రాయపడ్డారు. ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు, వైఎస్ రాజశేఖర్ రెడ్డి వంటి నాయకులు హైదరాబాద్‌ను అభివృద్ధి చేశారని, ఇప్పుడు దానిని అంతర్జాతీయ స్థాయిలో టోక్యో, న్యూయార్క్ నగరాలతో పోటీ పడేలా తీర్చిదిద్దడం తమ బాధ్యత అని చెప్పారు. ప్రస్తుతం దేశ జీడీపీలో తెలంగాణ వాటా 5 శాతంగా ఉందని, 2047 నాటికి దీనిని 10 శాతానికి పెంచాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ భారీ లక్ష్యసాధనలో ప్రజలందరితో పాటు ముఖ్యంగా మహిళల సహకారం అత్యంత అవసరమని ఆయన కోరారు.

కాలుష్య నియంత్రణలో భాగంగా వాహనదారులను ఈవీ వైపు మళ్లించేందుకు ప్రభుత్వం జీరో ట్యాక్స్ పాలసీని అమల్లోకి తెచ్చిందని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. త్వరలోనే కాలేజీ విద్యార్థినులకు ఈవీ స్కూటీలను పంపిణీ చేయబోతున్నట్లు ఒక ఆసక్తికరమైన ప్రకటన చేశారు. నగరంలో ఉన్న సుమారు రెండు లక్షల ఆటోలను కూడా రెట్రోఫిటింగ్ ద్వారా ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఇలాంటి మార్పుల వల్ల పర్యావరణం మెరుగుపడటమే కాకుండా ప్రజల ఆరోగ్యానికి కూడా మేలు జరుగుతుందని ఆయన ఆకాంక్షించారు. రాబోయే కాలంలో హైదరాబాద్ ఒక కాలుష్య రహిత గ్రీన్ సిటీగా మారుతుందని ధీమా వ్యక్తం చేశారు.

సోషల్ మీడియాలో సాగుతున్న తప్పుడు ప్రచారాలపై సీఎం ఘాటుగా స్పందించారు. జర్నలిస్టుల ముసుగులో కొందరు పనిగట్టుకుని ప్రభుత్వంపై అసత్యాలను ప్రచారం చేస్తున్నారని, దీనిని అరికట్టేందుకు ఒక ప్రత్యేక వేదికను ఏర్పాటు చేస్తామని చెప్పారు. నిజాయితీగా పని చేసే జర్నలిస్టులకు ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని, కానీ సమాజాన్ని తప్పుదోవ పట్టించే కథనాలపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ప్రజాస్వామ్యంలో విమర్శలను ఆహ్వానిస్తామని, అయితే అవి అభివృద్ధిని అడ్డుకునే విధంగా ఉండకూడదని సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి మహిళా శక్తిని మరింతగా ప్రోత్సహించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. హైటెక్ సిటీ పక్కనే అత్యంత విలువైన స్థలంలో మహిళా పారిశ్రామికవేత్తల కోసం ప్రత్యేక స్టాల్స్‌ను ఏర్పాటు చేశామని, మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే రాష్ట్రం పురోగమిస్తుందని తెలిపారు. మహిళా జర్నలిస్టులు తమ నైపుణ్యంతో సమాజంలో మార్పు తీసుకురావాలని, రాష్ట్ర అభివృద్ధి పథంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. తెలంగాణను దేశంలోనే అగ్రస్థానంలో నిలబెట్టేందుకు ప్రతి ఒక్కరూ కంకణబద్ధులై పని చేయాలని ఆయన కోరారు. మొత్తానికి, మూసీ ప్రక్షాళన, నగర అభివృద్ధి విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టమైన విజన్‌తో ముందుకు వెళ్తున్నట్లు కనిపిస్తోంది. ప్రతిపక్షాల విమర్శలను పట్టించుకోకుండా, భవిష్యత్ తరాల బాగుకోసం కఠిన నిర్ణయాలు తీసుకునేందుకు కూడా వెనుకాడబోమని ఆయన మాటల్లో స్పష్టమైంది. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, పలువురు మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొని సీఎం ఆలోచనలకు మద్దతు ప్రకటించారు. భాగ్యనగరం మరోసారి విశ్వనగరంగా విరాజిల్లడానికి ప్రభుత్వం చేపట్టిన ఈ చర్యలు ఎంతవరకు సఫలీకృతం అవుతాయో వేచి చూడాలి.

# ఘనంగా మహిళా దినోత్సవం వేడుకలు

**కీసర,విశాలభారతి :**

మేడ్చల్ జిల్లా పి ఆర్ టి యు టి ఎస్ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పి ఆర్ టి యు టి ఎస్ మేడ్చల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో కాప్రా మండలం విజయ హై స్కూల్ ప్రాంగణంలో మహిళా దినోత్సవ వేడుకలు పి ఆర్ టి యు టి ఎస్ జిల్లా అధ్యక్షులు రామేశ్వర్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనంద్ రెడ్డి ఆధ్వర్యంలో, జిల్లా అసోసియేట్ అధ్యక్షురాలు విజయలక్ష్మి అధ్యక్షతన ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ మహిళా దినోత్సవ వేడుకలకు పి ఆర్ టి యు టి ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంకరి భిక్షం గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై వేడుకలను ప్రారంభించారు. మహిళా దినోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా సాగాయి. ఈ సందర్భంగా మహిళా ఉపాధ్యాయులకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించారు. ఆటలు పోటీల్లో గెలుపొందిన మహిళ ఉపాధ్యాయులకు రిటైర్డ్ పి ఆర్ టి యు టి ఎస్ నాయకులు చంద్రమౌళి గారి సౌజన్యంతో బహుమతుల ప్రధానోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిథి సుంకరి భిక్షం గౌడ్



గారు మాట్లాడుతూ మహిళలు సమాజంలో అత్యంత కీలకమైన స్థానంలో తమ పాత్రను విజయవంతంగా పోషిస్తూ అటు కుటుంబాన్ని, ఇటు ఉద్యోగ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ అటు రాష్ట్ర ప్రగతి మాత్రమే కాకుండా దేశ ప్రగతిలో కూడా విశేషంగా భాగస్వాములు అవుతున్నారని కొనియాడారు. అదేవిధంగా మహిళ లేనిదే జగతి లేదని చెప్పడం పి ఆర్ టి యు టి ఎస్ సంఘం మహిళలకు మరియు మహిళా ఉపాధ్యాయులకు ఇస్తున్న ప్రాధాన్యాన్ని తెలియజేశారు. మహిళా దినోత్సవ వేడుకలలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు త్రివేణి, జ్యోతి, సరిత, చైతన్య నౌషర్, మేడ్చల్ మండల ప్రధాన కార్యదర్శి రజిత మండల బాధ్యులు శ్రీలక్ష్మి సునీత దేవి, జ్యోత్స్న, మహిళా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ప్రాజెక్టుల భూ సేకరణకు రూ.5 వేల కోట్లు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



తెలంగాణ సాగునీటి రంగంలో సరికొత్త అధ్యాయం మొదలుకాబోతోంది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులకు మోక్షం కల్పించే దిశగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆదివారం జలసౌధలో నిర్వహించిన సమీక్షా సమావేశం ఈ విషయాన్ని స్పష్టం చేస్తోంది. ముఖ్యంగా నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, భీమా ప్రాజెక్టుల పురోగతిపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించిన మంత్రి, రైతాంగానికి తీపి కబురు అందించారు. రాబోయే జూన్ 2వ తేదీలోపు కేవలం భూసేకరణ కోసమే ఏకంగా రూ. 5 వేల కోట్ల నిధులను కేటాయించనున్నట్లు ప్రకటించి సాగునీటి రంగంపై తమ ప్రభుత్వ చిత్తశుద్ధిని చాటుకున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రజల దశాబ్దాల కలలను సాకారం చేసేందుకు ప్రభుత్వం ఎంతటి ఖర్చుకైనా వెనకాడబోదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి భరోసా ఇచ్చారు. రాబోయే రెండేళ్ల కాలంలో సుమారు రూ. 22 వేల కోట్లు ఖర్చు చేసి జిల్లాలోని అసంపూర్తిగా ఉన్న అన్ని ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కృష్ణా జలాలను ఒక చుక్క కూడా వృథా కాకుండా సమర్థవంతంగా వినియోగించుకుంటామని స్పష్టం చేశారు. ఈ నీటిని ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాలకు మళ్లించి, ఆ ప్రాంతాలను సస్యశ్యామలం చేయడమే తమ ప్రధాన లక్ష్యమని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత వ్యవసాయ రంగంలో కనివినీ ఎరుగని రీతిలో పురోగతి కనిపిస్తోందని మంత్రి వివరించారు. ముఖ్యంగా ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా అత్యధిక విస్తీర్ణంలో వరి సాగు జరగడం ఒక రికార్డు అని ఆయన గుర్తు చేశారు. కృష్ణా, గోదావరి బేసిన్ల పరిధిలో రైతులు ఉత్సాహంగా పంటలు పండించారని, ఇది ప్రభుత్వ సాగునీటి నిర్వహణకు నిదర్శనమని పేర్కొన్నారు. గత పాలకుల హయాంలో జరిగిన జాప్యాన్ని అధిగమిస్తూ, ఇప్పుడు పారదర్శకమైన విధానాలతో ప్రాజెక్టులను ముందుకు తీసుకెళ్తున్నామని, తద్వారా రైతులకు భరోసా కల్పిస్తున్నామని ఆయన పత్రికా ముఖంగా వెల్లడించారు.

గత పదేళ్ల పాలనపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నిశిత విమర్శలు చేశారు. 2014 జూన్ 2న ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ప్రాజెక్టులు ఏ స్థితిలో ఉన్నాయో, 2024 జూన్ 2 నాటికి కూడా అవి అదే స్థితిలో ఉండటం దురదృష్టకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్ వంటి కీలక ప్రాజెక్టులను గత ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని మండిపడ్డారు. కేవలం ప్రకటనలకే పరిమితమైన గత పాలకులు, క్షేత్రస్థాయిలో పనులను గాలికొదిలేశారని, దీనివల్ల పాలమూరు రైతాంగం తీవ్రంగా నష్టపోయిందని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు.

పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టు విషయంలో గత ప్రభుత్వం చేసిన ప్రచారంపై ఉత్తమ్ తీవ్రంగా ధ్వజమెత్తారు. ప్రాజెక్టు పనులు 90 శాతం పూర్తయ్యాయని అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మొత్తం రూ. 55 వేల కోట్ల అంచనా వ్యయం ఉన్న ప్రాజెక్టులో కేవలం రూ. 27 వేల కోట్లు ఖర్చు చేస్తే, అది 90 శాతం ఎలా అవుతుందని ఆయన ప్రశ్నించారు. పైగా వారి హయాంలోనే అంచనాలను ఏకంగా రూ. 84 వేల కోట్లకు పెంచారని గుర్తు చేశారు. వేల కోట్లు ఖర్చు చేసినా ఒక్క ఎకరానికి కూడా సాగునీరు అందించలేకపోయారనేది నగ్న సత్యమని ఆయన పునరుద్ఘాటించారు.

ప్రాజెక్టుల డిజైన్ల మార్పు వల్ల జరిగిన నష్టాన్ని మంత్రి వివరించారు. పాలమూరు ప్రాజెక్టును జూరాల నుంచి శ్రీశైలంకు షిఫ్ట్ చేయడం వల్ల జిల్లాకు తీరని అన్యాయం జరిగిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన సాంకేతిక లోపాలు, అవకతవకలే పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టులో కూడా పునరావృతమయ్యాయని ఆయన విమర్శించారు. కేవలం కమీషన్ల కోసమే రీడిజైనింగ్ పేరుతో నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని దుయ్యబట్టారు. ఈ తప్పిదాలను సవరిస్తూ, ప్రాజెక్టును సరైన మార్గంలోకి తీసుకురావడానికి తమ ప్రభుత్వం శ్రమిస్తోందని ఆయన తెలిపారు.

పాలమూరు రైతాంగానికి సాగునీటి భరోసా కల్పిస్తూ 2028 డిసెంబర్ నాటికి ఉమ్మడి జిల్లాలోని అన్ని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేస్తామని మంత్రి స్పష్టమైన గడువు విధించారు. ఇందుకోసం నిధుల కొరత లేకుండా 'గ్రీన్ ఛానల్' ద్వారా నిధులను విడుదల చేయనున్నట్లు ఆయన ప్రకటించారు. ప్రాజెక్టుల నిర్మాణంలో నాణ్యతను పాటిస్తూనే, నిర్ణీత కాలవ్యవధిలో పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ, పనుల్లో వేగం పెంచేలా పర్యవేక్షణ ఉంటుందని ఆయన తెలిపారు.

రాష్ట్రవ్యాప్తంగా సాగునీటి రంగాన్ని ప్రక్షాళన చేయడమే కాకుండా, కృష్ణా జలాల్లో తెలంగాణకు రావాల్సిన వాటాను దక్కించుకోవడంలో రేవంత్ సర్కార్ రాజీపడబోదని ఉత్తమ్ స్పష్టం చేశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ , నల్లగొండ జిల్లాలకు సాగునీరు అందించడం ద్వారా ఈ ప్రాంతాలను ఎడారి నుంచి పచ్చని పొలాలుగా మారుస్తామని చెప్పారు. ప్రతి నీటి చుక్కను పొదుపుగా, ప్రణాళికాబద్ధంగా వాడుకోవడం ద్వారా రాష్ట్ర వ్యవసాయ రంగాన్ని దేశానికే ఆదర్శంగా నిలబెడతామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. గత పాలకుల వైఫల్యాలను ఎండగడుతూనే, భవిష్యత్ ప్రణాళికపై స్పష్టతనిచ్చారు. ప్రాజెక్టుల పురోగతిపై నిరంతరం సమీక్షలు నిర్వహిస్తామని, ఎక్కడైనా జాప్యం జరిగితే ఉపేక్షించబోమని మంత్రి అధికారులను హెచ్చరించారు. రైతుల ప్రయోజనాలే పరమావధిగా ప్రభుత్వం పని చేస్తోందని, నిధుల విడుదల విషయంలో ఎలాంటి ఆటంకాలు ఉండవని పేర్కొన్నారు. ముఖ్యంగా భూసేకరణ వల్ల ఆగిపోయిన పనులను తక్షణమే ప్రారంభించేలా కలెక్టర్లతో సమన్వయం చేసుకుంటామని చెప్పారు. రాబోయే రెండేళ్లలో పాలమూరు ముఖచిత్రం మారిపోతుందని, కృష్ణమ్మ పరవళ్లతో ఈ ప్రాంతం కళకళలాడుతుందని ఆయన ఆకాంక్షించారు. మొత్తానికి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చేసిన ఈ ప్రకటనలు పాలమూరు రైతాంగంలో కొత్త ఆశలను చిగురింపజేశాయి. రూ. 22 వేల కోట్ల భారీ పెట్టుబడితో ప్రాజెక్టులను పూర్తి చేస్తామన్న హామీ నెరవేరితే, తెలంగాణలో వ్యవసాయ రంగం మరింత బలోపేతం కావడం ఖాయం. అబద్ధపు ప్రచారాలకు స్వస్తి పలికి, వాస్తవిక దృక్పథంతో ముందుకు సాగుతామన్న మంత్రి మాటలు ప్రభుత్వ చిత్తశుద్ధిని తెలియజేస్తున్నాయి. 2028 నాటికల్లా ప్రతి ఎకరాకు నీరు అందించడమే లక్ష్యంగా సాగుతున్న ఈ ప్రస్థానం, తెలంగాణ అభివృద్ధిలో మైలురాయిగా నిలవనుంది.

## త్యాగాలకు మహిళలే ఆదర్శం

**మాజీ కార్పొరేటర్ స్వరూప గౌడ్**



**సికింద్రాబాద్, విశాలభారతి:** కుటుంబాన్ని క్రమశిక్షణలో ఉంచి యోగక్షేమాలు ప్రతి రోజు చూస్తూ కుటుంబ పోషణలో తల మునకలై మహిళలు ఈరోజు ప్రపంచంలో ముందున్నారని మాజీ కార్పొరేటర్ స్వరూప గౌడ్ అన్నారు అంతే కాకుండా పలు రంగాలలో చంద్ర మండల యాత్రకు సైతం మేము సైతం అంటూ మహిళలు ముందు నడిపించి ప్రపంచ పటంలో ముందున్నారని ఈరోజు రాజకీయ రంగంలో కూడా మహిళలకు ప్రత్యేక స్థానం ఏర్పడిందని అనేకమంది మంత్రులుగా ముఖ్యమంత్రులుగా రాష్ట్రపతులుగా వన్నెతెచ్చారని మాజీ కార్పొరేటర్ స్వరూప గౌడ్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా మహిళల చేసిన త్యాగాలను గుర్తించుకుంటూ ఆదివారం మహిళా ఆత్మీయులకు శా ల్వాతో సత్కరించి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలపారు. ఈ కార్యక్రమంలో జ్యోతి అంజమ్మ వాణి హేమలత అండాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

## హెచ్‌పివి వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



**రాజేంద్రనగర్, విశాలభారతి:** శంషాబాద్ సర్కిల్ పరిధిలోని ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సి హెచ్ సి )లో మహిళల ఆరోగ్య పరిరక్షణను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం చేపట్టిన గర్భాశయ క్యాన్సర్ నివారణ (హెచ్ పి.వి) వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ ఆదివారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, మహిళల్లో కనిపించే గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను నివారించడంలో హెచ్‌పివి టీకా కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. క్యాన్సర్ రహిత సమాజ నిర్మాణం కోసం ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నదని ఆయన పేర్కొన్నారు. 9 నుంచి 14 సంవత్సరాల మధ్య వయస్సు గల బాలికలకు ఈ వ్యాక్సిన్ ఇవ్వడం ద్వారా భవిష్యత్తులో క్యాన్సర్ ముప్పును గణనీయంగా తగ్గించవచ్చని ఎమ్మెల్యే చెప్పారు. తల్లిదండ్రులు ఎటువంటి అపోహలు లేకుండా తమ పిల్లలకు టీకాలు వేయించాలని ఆయన సూచించారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఖరీదైన ఈ వ్యాక్సిన్‌ను ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్నందున, శంషాబాద్ మండలం మరియు పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్, వైద్యులు, ఆరోగ్య సిబ్బంది మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే ఆసుపత్రిలోని సౌకర్యాలను పరిశీలించి, రోగులకు అందుతున్న వైద్య సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు.

## కేసీ తండాలో వెంకటేశ్వర స్వామి రథోత్సవం

**ప్రత్యేక పూజల్లో పాల్గొన్న దండెం రాంరెడ్డి**



**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** యాచారం మండలం కేసీ తండా గ్రామంలో శ్రీశ్రీశ్రీ వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు (జాతర) సందర్భంగా నిర్వహించిన రథోత్సవం, అన్నదాన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో జరిగింది. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు దండెం రాంరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీశ్రీశ్రీ అలివేలు మంగమ్మ పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి దేవస్థానం, గ్రామ పెద్దల ఆహ్వానం మేరకు ఆయన ఈ కార్యక్రమంలో పాల్గొని రథోత్సవాన్ని వీక్షించి, అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో భక్తులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో కేసీ తండా సర్పంచ్ జే. రమేష్, ఉప సర్పంచ్ ఎన్. శంకర్, చైర్మన్ యాదయ్య, వార్డు సభ్యులు శ్రీను, రొట్టిగడ్డ తండా సర్పంచ్ రాజు, ఉప సర్పంచ్ మున్నా నాయక్, బీఆర్ఎస్ యువ నాయకులు రాజు, వెంకటేష్, వార్డు సభ్యులు జయేంద్ర, బికు, సీనియర్ నాయకులు కె. రాజు, రవి, రమేష్, శ్రీకాంత్, రజినీకాంత్, కిషన్, సుమన్, శ్రీను నాయక్, లక్ష్మణ్, దేవసోత్ హథీరాం, కందుకూరి మల్లారెడ్డి, కాంటేకర్ రాహుల్, జాటోత్ సాయి, కొలం శ్రీకాంత్ రెడ్డి, గ్రామ పెద్దలు, నాయకులు, కార్యకర్తలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మహిళా దినోత్సవం



**సికింద్రాబాద్,విశాలభారతి:** జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా సుందరయ్య విజ్ఞాన భవన్లో హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ స్వరూప గౌడు కు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ సన్మానించి జ్ఞాపికను అందజేయడం జరిగింది.

## మహిళా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక గ్రామసభ



**విశాలభారతి, అబ్దుల్లాపుర్మెట్ :** మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని అబ్దుల్లాపూర్మెట్ మండలం కవాడిపల్లి గ్రామపంచాయతీ ఆవరణలో మహిళా ప్రత్యేక గ్రామసభను ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని మహిళలకు అవగాహన కల్పించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా పరిసరాల పరిశుభ్రత, తడిచెత్త – పొడిచెత్త వేరు చేయడం, మహిళా సాధికారత, మహిళల భద్రత మరియు మాదకద్రవ్యాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అబ్దుల్లాపుర్మెట్ ఎంపీడీఓ శ్రీవాణి, డీఎల్‌పీవో సాధన రెడ్డి హాజరై మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందుకు రావాలని, గ్రామాభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో కీలకమని తెలిపారు. మహిళలు స్వయం సాధికారత సాధించి సమాజానికి ఆదర్శంగా నిలవాలని సూచించారు. ఈ గ్రామసభకు అధ్యక్షత వహించిన కవాడిపల్లి గ్రామ సర్పంచ్ కోలన్ ప్రసన్న రవీందర్ రెడ్డి మాట్లాడుతూ.. మహిళలకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాసాల రాము యాదవ్, గ్రామపంచాయతీ వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది, డ్వాక్రా మహిళలు, గ్రామ పెద్దలు, మాజీ సర్పంచులు కందాడి కృష్ణారెడ్డి, సుర్వి బాలమణి తదితరులు పాల్గొన్నారు.

## శతక పద్య రచయిత అన్నపూర్ణకు ఘన సన్మానం



**శేరిలింగంపల్లి, విశాలభారతి:** మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శతక పద్య రచయిత్రి కాటేపల్లి అన్నపూర్ణ ఘన సన్మానం పొందారు. విశ్వభారతీ సాహితి సంస్థ ఆధ్వర్యంలో మహిళా కవులను ఆల్వాల్‌లో నిర్వహించిన మహిళా దినోత్సవ కార్యక్రమంలో ఆదివారం సన్మానించారు. ఇందులో భాగంగా శేరిలింగంపల్లి నియోజకవర్గం మియాపూర్‌కు చెందిన కవి కాటేపల్లి అన్నపూర్ణను సన్మానించారు. బాలా త్రిపుర సుందరిపై ఇటీవలి ఆమె శతక పద్యాలను రచించటంతో పాటు పుస్తక రూపంలో పాఠకులకు అందుబాటులోకి తీసుకువచ్చారు. పద్య రచనలతో పాటు పలు అవధానాలలో అన్నపూర్ణ పృచ్ఛకురాలిగా పాల్గొంటూ అవధానుల మన్ననలు సైతం పొందారు.తన 65 వ సంవత్సరం నుంచి శతక పద్య రచనలను ఆరంభించినట్లు అవధానుల తోడ్పాటుతో ముందుకు సాగుతున్నట్లు కాటేపల్లి అన్నపూర్ణ తెలిపారు. సన్మానం పొందిన అన్నపూర్ణను పలువురు అభినందించారు.

## చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలి

**కళ్లెం నవజీవన్ రెడ్డి**



**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** ఉమ్మడి హయత్ నగర్ డివిజన్ పరిధిలోని భూలక్ష్మి నగర్ కాలనీలో కాలనీవాసులకు చట్టాలపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక హయత్ నగర్ తాజా మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐఏఎస్ అధికారి శివకుమార్ మాట్లాడుతూ.. ప్రజలకు చట్టాలపై కనీస అవగాహన ఉండటం చాలా అవసరమని తెలిపారు. రోజువారీ జీవితంలో పాటించాల్సిన ముఖ్యమైన చట్టాలను వివరించి, సమాజంలో శాంతి భద్రతలు, క్రమశిక్షణ నెలకొనాలంటే ప్రతి ఒక్కరూ చట్టాలను గౌరవించి పాటించాలని సూచించారు. కళ్లెం నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజలు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవడం ద్వారా సమాజంలో సమస్యలు తలెత్తకుండా ఉంటాయని అన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించి చట్టాలను గౌరవించాలని పిలుపునిచ్చారు. ఇలాంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం వల్ల ప్రజల్లో చట్టాలపై స్పష్టత పెరుగుతుందని తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని భూలక్ష్మి నగర్ కాలనీలో సేవలందిస్తున్న పారిశుధ్య మహిళా కార్మికులను కళ్లెం నవజీవన్ రెడ్డి ఘనంగా సన్మానించారు. సమాజ పరిశుభ్రత కోసం వారు చేస్తున్న సేవలను అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు కాసిపతి, బీజేపీ సీనియర్ నాయకుడు సంఘీ అశోక్, కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు నత్తి మైసయ్య ఘన సన్మానం


- మహిళలు అన్ని రంగాలలో రాణించాలి
- ముఖ్య అతిథులుగా పాల్గొన్న డిప్యూటీ కమిషనర్ శైలజ
- బోడుప్పల్లో 368వ వారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కు జ్ఞానమాల



**బోడుప్పల్, విశాలభారతి:** మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్లో అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి 368వ ఆదివారం జ్ఞానమాల కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా బోడుప్పల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శైలజ, మాజీ ఎంపీటీసీ నత్తి జంగమ్మ తదితరులు పాల్గొని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. అనంతరం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ముఖ్య అతిథులను నత్తి మైసయ్య ఘనంగా సన్మానించి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు అనంతరం ఆయన మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కృషి ఫలితంగా మహిళలకు రిజర్వేషన్లు కల్పించబడ్డాయని, అంబేద్కర్ స్ఫూర్తితో మహిళలు అన్ని రంగాలలో రాణించాలని, ముఖ్యంగా మహిళలు రాజకీయాలలో ప్రవేశించి ప్రజలకు ఉత్తమ సేవలందించాలని నథింగ్ నరసయ్య పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భూ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు బుగ్గ మైసయ్య, బోడుప్పల్ అరుంధతి మాదిగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గురుకుల యాకయ్య, చిల్ల అంజయ్య, కొండయ్య మేస్త్రి, జి వెంకటేశ్వర్లు, ఏ రాజేష్, యేసు రాజు, కంచి సతీష్, మహిళలు కమలమ్మ, విజయలక్ష్మి, సుగుణమ్మ, లింగమ్మ, యాకమ్మ, మంగమ్మ, సులోచన,లక్ష్మి ఎంతదితరులు పాల్గొన్నారు.

# మన గ్యాస్.. మనకేది?

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



తెలంగాణ గడ్డపై పుట్టిన వనరులు, పొరుగున ఉన్న సాగర తీరంలో దొరికిన సహజ సంపద మన ఇంటి వంటగదిని వెలిగించాల్సింది పోయి, వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న ఇతర రాష్ట్రాల పారిశ్రామిక చక్రాలను తిప్పుతున్నాయి. రాష్ట్రం ఆవిర్భవించి పన్నెండేళ్లు గడుస్తున్నా, ఢిల్లీ నడిబొడ్డున కొలువుదీరిన మన ఎంపీలు తెలంగాణకు దక్కాల్సిన కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్ (సీఎన్జీ) వాటాపై గళమెత్తకపోవడం గమనార్హం. లోక్‌సభ, రాజ్యసభ సాక్షిగా రాష్ట్ర హక్కుల కోసం పోరాడాల్సిన నాయకులు, రాజకీయ ప్రయోజనాల కోసం పాకులాడుతున్నారే తప్ప, సామాన్యుడికి భారంగా మారిన గ్యాస్ ధరలపై కేంద్రాన్ని నిలదీయడంలో విఫలమయ్యారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తీరంలో 200203 కాలంలో కనుగొన్న కృష్ణాగోదావరి (కేజీడీ6) బేసిన్ నిక్షేపాలు దేశానికే తలమానికం. రిలయన్స్ ఇండస్ట్రీస్ చేపట్టిన ఈ అన్వేషణ ప్రపంచంలోనే అతిపెద్ద సహజ వాయువు నిల్వగా గుర్తింపు పొందింది. 2008 నుంచి ఇక్కడ వాణిజ్య ఉత్పత్తి ప్రారంభమైనప్పటికీ, ఆ సంపదపై తెలంగాణ ప్రజలకు హక్కు లేకుండా పోయింది. సహజ న్యాయ సూత్రాల ప్రకారం ఎక్కడైతే వనరులు లభిస్తాయో, మొదట ఆ ప్రాంత అవసరాలు తీర్చాలి. కానీ, మన గ్యాస్ 1,500 కిలోమీటర్ల దూరంలో ఉన్న గుజరాత్, మహారాష్ట్ర, ఢిల్లీలకు తరలిపోతుంటే మన ప్రతినిధులు మాత్రం ప్రేక్షక పాత్రకే పరిమితమయ్యారు. ప్రస్తుతం జరుగుతున్న కేటాయింపులు చూస్తే కళ్లు బైర్లు కమ్మడం ఖాయం. లభ్యమవుతున్న సీఎన్జీలో ఏకంగా 45 శాతం వాటా గుజరాత్‌కు, 24 శాతం మహారాష్ట్రకు కేటాయిస్తుండగా, ఉత్తరప్రదేశ్, ఢిల్లీలు కూడా భారీగా లబ్ధి పొందుతున్నాయి. విచారకరమైన విషయం ఏంటంటే, ఈ వనరులకు మూలమైన తెలుగు రాష్ట్రాలకు దక్కుతున్న వాటా కేవలం 1.2 శాతం మాత్రమే. ఈ వివక్షను చూస్తూ కూడా మన ఎంపీలు మౌనవ్రతం పాటించడం వెనుక ఆయా కార్పొరేట్ శక్తుల పట్ల ఉన్న భయమా లేక బాధ్యతారాహిత్యమా అని మేధావులు ప్రశ్నిస్తున్నారు.

గతంలో ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఈ విషయంలో కేంద్రంపై కొంత మేర పోరాటం చేశారు. రాష్ట్రానికి న్యాయమైన వాటా కావాలని యూపీఏ ప్రభుత్వానికి 24 సార్లు లేఖలు రాశారు. 12వ ఆర్థిక సంఘం కూడా స్థానిక వనరుల పై స్థానికులకే ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేసింది. అంతేకాకుండా, 2013లో పార్లమెంటు స్టాండింగ్ కమిటీ ఒక అడుగు ముందుకు వేసి, గ్యాస్ ఉత్పత్తి అయ్యే రాష్ట్రాలకు కనీసం 50 శాతం వాటా ఇవ్వాలని, రాయల్టీ చెల్లించాలని సిఫార్సు చేసింది. ఈ నివేదికలు పక్కన పడి దుమ్ము పడుతున్నా, వాటిని దులిపి కేంద్రం కళ్లముందు ఉంచే ధైర్యం మన ఎంపీలు చేయలేకపోయారు.

తెలంగాణ భూగర్భం నుంచి పైపులైన్ల ద్వారా గ్యాస్ ఇతర రాష్ట్రాలకు తరలిపోతుంటే, అక్కడ ప్రజలు అత్యంత చౌకగా పీఎన్జీ (పైప్డ్ నేచురల్ గ్యాస్) వాడుకుంటూ సుఖంగా ఉన్నారు. కానీ తెలంగాణలో మాత్రం పరిస్థితి ఇందుకు భిన్నం. హైదరాబాద్, వరంగల్ వంటి మహానగరాల్లో కూడా ఇంటింటికీ గ్యాస్ పైపులైన్లు వచ్చే అవకాశం ఉన్నా, సీఎన్జీ కేటాయింపులు లేక ఆ ప్రాజెక్టులు కుంటుపడుతున్నాయి. ఫలితంగా సామాన్యుడు ఇంకా ఎల్పీజీ సిలిండర్ల మీదనే ఆధారపడాల్సి వస్తోంది. అంతర్జాతీయంగా చమురు ధరలు పెరిగిన ప్రతిసారీ సామాన్యుడి జేబుకు చిల్లు పడక తప్పడం లేదు.

ముఖ్యంగా ఇరాన్‌ఇజ్రాయెల్ యుద్ధ మేఘాల నేపథ్యంలో ముడి చమురు ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. అరబ్ దేశాల నుంచి సరఫరా నిలిచిపోవడంతో భారత్‌పై భారం పడింది. దీని ప్రభావంతో తాజాగా ఎల్పీజీ సిలిండర్‌పై రూ.60 అదనపు భారం పడటం తెలంగాణ వాసులకు మింగుడుపడటం లేదు. ఒకవేళ మన ఎంపీలు ముందే మేల్కొని కేజీ బేసిన్ నుంచి మనకు రావాల్సిన న్యాయమైన వాటా సాధించి ఉంటే, ఈ రోజు అంతర్జాతీయ ధరలతో సంబంధం లేకుండా తక్కువ ధరకే మన గ్యాస్ మనకు అందుబాటులో ఉండేది. ఈ వైఫల్యం ముమ్మాటికీ ప్రజాప్రతినిధుల దేనని స్పష్టమవుతోంది.

పన్నెండేళ్ల కాలంలో ఎంతో మంది కేంద్ర మంత్రులు మారారు, ప్రధానులు మారారు. కానీ తెలంగాణకు దక్కాల్సిన గ్యాస్ వాటాపై మాత్రం పార్లమెంటులో ఒక్కరోజూ సమగ్రమైన చర్చ జరగలేదు. రిలయన్స్ వంటి బడా కంపెనీల నిర్లక్ష్యాన్ని ప్రశ్నించే సాహసం ఏ ఒక్క ఎంపీ కూడా చేయలేదు. రాష్ట్ర ప్రయోజనాల కంటే పార్టీ ప్రయోజనాలే మిన్నగా భావిస్తూ, కేంద్ర పెద్దల వద్ద మొహమాటాలకు పోతుండటం వల్ల రాష్ట్రం భారీగా నష్టపోతోంది. ఇక్కడి ప్రజలు తమ పన్నుల రూపంలో, వనరుల రూపంలో కేంద్రానికి సహకరిస్తున్నా, ప్రతిఫలంగా రావాల్సిన న్యాయమైన కేటాయింపుల్లో మాత్రం అన్యాయమే ఎదురవుతోంది.

రాష్ట్రానికి రావాల్సిన వాటా కోసం పోరాడటం అంటే అది కేవలం రాజకీయ నినాదం కాదు, లక్షలాది మంది సామాన్యుల జీవితాలతో ముడిపడి ఉన్న అంశం. సీఎన్జీ అందుబాటులోకి వస్తే కేవలం వంట గ్యాస్ ధరలే కాదు, రవాణా రంగంలో కూడా విప్లవాత్మక మార్పులు వస్తాయి. హైదరాబాద్ నగరంలో కాలుష్యాన్ని తగ్గించేందుకు సీఎన్జీ బస్సులను విరివిగా నడిపే వీలుంటుంది. తక్కువ ధరకే రవాణా సదుపాయం లభిస్తే నిత్యావసరాల ధరలు కూడా తగ్గుతాయి. ఇన్ని లాభాలున్న అంశాన్ని మన ఎంపీలు విస్మరించడం రాష్ట్ర భవిష్యత్తుకు పెద్ద శాపంగా మారింది.

రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాల ప్రకారం సహజ వనరుల యాజమాన్యం, నియంత్రణ ఆయా ప్రాంతాల ప్రజలందరి ప్రయోజనాలను కాపాడేలా ఉండాలి. కానీ ప్రస్తుత పరిస్థితులు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా సాగుతున్నాయి. తెలంగాణ ఎంపీలు ఇప్పటికైనా తమ నిద్రను వీడి, రాష్ట్ర ప్రయోజనాల కోసం ఢిల్లీ గడప తొక్కాల్సిన అవసరం ఉంది. కేవలం ఎన్నికల వేళ ఓట్ల కోసం మాత్రమే కాకుండా, ప్రజల కష్టాలను తీర్చే దిశగా సీఎన్జీ కోటా సాధన కోసం ఐక్యంగా పోరాడాలి. లేనిపక్షంలో తెలంగాణ సంపద పరాయి పాలవుతుంటే, ఇక్కడి ప్రజలు ధరల భారంతో కుంగిపోవడం ఖాయం. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు ప్రతిరూపంగా ఉండాల్సిన ప్రజాప్రతినిధులు, ఇప్పటికైనా తమ వైఖరిని మార్చుకోవాలి. కేజీ బేసిన్ గ్యాస్‌లో మన వాటా మనకు దక్కే వరకు పోరాటాన్ని ఆపకూడదు. 50 శాతం వాటా దక్కాలన్న స్టాండింగ్ కమిటీ సిఫార్సులను అమలు చేసేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావడమే ఇప్పుడు మన ముందున్న ఏకైక మార్గం. ఈ విషయంలో అలసత్వం వహిస్తే రాబోయే తరాలకు మన సహజ వనరులను కాపాడుకోలేకపోయామన్న అపవాదు మిగిలిపోతుంది. రాజకీయాలకతీతంగా రాష్ట్ర ప్రయోజనాలే పరమావధిగా ఎంపీలు గళమెత్తాలని తెలంగాణ సమాజం డిమాండ్ చేస్తోంది.

# ఘనంగా మెగా మహిళా రైతు మేళా






- ఆరు వేల మంది మహిళా రైతుల హాజరు
- పాల్గొన్న మంత్రులు తుమ్మల దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, సీతక్క

**రాజేంద్రనగర్, విశాలభారతి:**

రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణా వ్యవసాయ విశ్వవిద్యాలయం క్రీడా ప్రాంగణంలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న మెగా మహిళా రైతు మేళా ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. సుమారు ఆరు వేల మంది మహిళా రైతులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ మేళాను పీజేటీయూ, కరోమండేలా ఇంటర్నేషనల్ లిమిటెడ్ మరియు రాష్ట్ర వ్యవసాయ శాఖలు సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. యునైటెడ్ నేషన్స్ 2026 సంవత్సరాన్ని అంతర్జాతీయ మహిళా రైతు సంవత్సరంగా ప్రకటించిన నేపథ్యంలో, అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్రం నలుమూలల నుండి రైతులు, మహిళా రైతులు, వ్యవసాయ రంగ నిపుణులు, వ్యవసాయ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం వ్యవసాయం, రైతాంగ సంక్షేమాన్ని ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తోందని తెలిపారు. తెలంగాణ రైతు ప్రపంచంలో తలెత్తుకుని నిలబడేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ తర్వాత, రాహుల్ గాంధీ ఆలోచనల ఆధారంగా సుమారు 25 లక్షల మంది రైతులకు రూ.21 వేల కోట్ల రుణమాఫీ చేసినట్లు వెల్లడించారు. గత ప్రభుత్వంలో నిలిచిపోయిన రాయితీ విత్తనాలు, వ్యవసాయ యాంత్రీకరణ పథకాలను పునరుద్ధరించామని తెలిపారు. రూ.500 కోట్లతో అమలు చేస్తున్న వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో మహిళా రైతులకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నామని, భవిష్యత్తులో మహిళలకు డ్రోన్లు అందిస్తామని చెప్పారు.

రాష్ట్ర ఐటీ మరియు పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు మాట్లాడుతూ, రైతులు అధునాతన టెక్నాలజీలు, నైపుణ్యాలను ఉపయోగించి ప్రజల అవసరాలకు సరిపడా ఆహార ధాన్యాలను పండించాలని పిలుపునిచ్చారు. భూసార పరిరక్షణ, పంటల వైవిధ్యీకరణపై రైతులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం కొత్త వంగడాలు, టెక్నాలజీలను అందుబాటులోకి తీసుకువచ్చి రైతులకు సేవలందిస్తున్నదని ప్రశంసించారు.

పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) మాట్లాడుతూ, ఆహార ఉత్పత్తిలో మహిళల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. వ్యవసాయ రంగంలో 60 నుంచి 80 శాతం వరకు మహిళలు పనిచేస్తున్నారని, విత్తనం నాటిన దశ నుంచి పంట కోత వరకు మహిళలే ప్రధానంగా శ్రమిస్తున్నారని తెలిపారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందన్నారు. ఇండియన్ కౌన్సిల్ అఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ డైరెక్టర్ జనరల్ ఎం.ఎల్. జాట్ మాట్లాడుతూ, రైతులకు కొత్త టెక్నాలజీలు అందించడంలో తెలంగాణ ఇతర రాష్ట్రాలకు మార్గదర్శకంగా నిలుస్తోందని అన్నారు. పంటల వైవిధ్యీకరణ, మార్కెట్‌లతో రైతులను అనుసంధానం చేయడంపై దృష్టి పెట్టాలని సూచించారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి అల్దాస్ జానయ్య మాట్లాడుతూ, భారతదేశ వ్యవసాయ రంగంలో మహిళల వాటా సుమారు 58 శాతం ఉందని తెలిపారు. తమ విశ్వవిద్యాలయంలో బోధన సిబ్బందిలో 50 శాతం మహిళలే ఉన్నారని, వ్యవసాయ విద్యార్థుల్లో 70 శాతం అమ్మాయిలే ఉన్నారని వివరించారు. మహిళా రైతులకు సాధికారత కల్పించడమే ఈ మెగా రైతు మేళా ప్రధాన లక్ష్యమని చెప్పారు. ఈ సందర్భంగా 30 మంది మహిళా రైతులకు, ఆరుగురు వ్యవసాయ పాత్రికేయులకు మంత్రులు అవార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సంచాలకులు డాక్టర్ గోపి, ఉద్యాన శాఖ సంచాలకులు శ్రీమతి యాస్మీన్ బాషా, శాసన మండలి విప్ పట్నం మహేందర్ రెడ్డి, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్, కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఎం.డి. శంకర సుబ్రహ్మణ్యం, ఐకార్ సంస్థల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సేవాలాల్ మహారాజ్ దేవాలయ విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం



**నిజామాబాద్, విశాలభారతి:** నిజామాబాద్ నగరంలోని కంఠేశ్వర్ ప్రాంతం, ఇందిరా ప్రియదర్శిని కాలనీలో నూతనంగా నిర్మించిన ఇందూర్ ఘడ్ శ్రీ భగదాంబ - సేవాలాల్ మహారాజ్ దేవాలయ విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి దేవతల ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ, మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించడం ఎంతో ఆనందదాయకమని అన్నారు. సమాజంలో ఐక్యత, శాంతి, సౌభ్రాతృత్వం పెంపొందేందుకు దేవాలయాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. జగదాంబ తల్లి మరియు సేవాలాల్ మహారాజ్ కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నగర మేయర్ కూరగాయల ఉమారాణి , రమేష్ , 42వ డివిజన్ స్థానిక కార్పొరేటర్ శశాంక్ రెడ్డి ,19వ డివిజన్ కార్పొరేటర్ నాగోల్ల లక్ష్మి నారాయణ , 39 వ డివిజన్ కార్పొరేటర్ జ్యోతి మురళి , ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజలు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



**తిరుమలగిరి, విశాలభారతి:** ఆదివారం రోజున తిరుమలగిరి మండలం తొండ గ్రామపంచాయతీలో నూతన సర్పంచ్ భాషమల్ల స్వాతి భాస్కర్ ఆధ్వర్యంలో ఘనంగా మహిళా దినోత్సవం నిర్వహించారు. సందర్భంగా వివిధ వార్డులో మహిళలుగా గెలుపొందిన వార్డు సభ్యులందరికీ శాలువాతో సన్మానించారు. గ్రామ సర్పంచ్ భాషమల్ల స్వాతి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందు ఉండాలని, దేశ భవిష్యత్తు ప్రధానంగా మహిళల చేతిలో ఉందన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



**ఆర్మూర్, విశాలభారతి:** నందిపేట్ మండలం కంఠం గ్రామంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఆదివారం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం మహిళలకు శాలువలతో సత్కరించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ అజిగిరి సాయినాథ్ మాట్లాడుతూ స్త్రీ లేకపోతే గమనం లేదు స్త్రీ లేకపోతే సృష్టిలో జీవం లేదు. స్త్రీలనీ గౌరవించాలని కోరారు. ఈ కార్యక్రమం లో వర్డ్ సభ్యులు పోషెట్టి, భులక్ష్మి, సమతా కార్యదర్శి మారుతీరావు, గ్రామ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమకారుల యువజన విభాగం అధ్యక్షుడిగా అరవింద్ రజాకా



**మొయినాబాద్, విశాలభారతి:** తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మొయినాబాద్ మండల యువజన విభాగం అధ్యక్షుడిగా అరవింద్ రజాకను నియమిస్తూ.. నియామక పత్రం అందజేసిన తెలంగాణ ఉద్యమకారుల ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు మహేశ్వర్ రెడ్డి యాలాల, తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మొయినాబాద్ మండల అధ్యక్షుడు న్యాలటి మహిపాల్ లు అరవింద్ రజక కు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మొయినాబాద్ మండల యువజన అధ్యక్షుడు చాకలి అరవింద్ రజక మాట్లాడుతూ.. నాపై నమ్మకం ఉంచి తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల మొయినాబాద్ మండల యువజన సంఘం అధ్యక్షుడిగా నన్ను నియమించిన వ్యవస్థాపకులు.. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా మహేశ్వర్ రెడ్డి యాలాల, తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మొయినాబాద్ అధ్యక్షుడు న్యాలటి మహిపాల్ లకు ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలియజేశారు. తెలంగాణ ఉద్యమకారులకు రావలసిన సంక్షేమ పలాలను వచ్చేవరకు తమ పోరాటం ఆగదని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీల భాగంగా ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు పింఛన్, ఉద్యమకారులకు గుర్తింపు కార్డు, సాధించేవరకు మలిదశ ఉద్యమకారులను ఐక్యం చేసి కాంగ్రెస్ ప్రభుత్వం పై పోరాటం చేస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మొయినాబాద్ మండల మున్సిపల్ తెలంగాణ ఉద్యమకారులు, తదితరులు పాల్గొన్నారు.

## హెచ్.పి.వి వ్యాక్సిన్ తప్పక ఇప్పించాలి



- కలెక్టర్ ఇలా త్రిపాఠి
- వ్యాక్సిన్ కార్యక్రమాన్ని ప్రారంభించిన కలెక్టర్

**నిజామాబాద్, విశాలభారతి:**

నిజామాబాద్, గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ నిరోధం కోసం ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న హెచ్.పి.వి వ్యాక్సిన్ ను 1415 సంవత్సరాల మధ్య వయసు కలిగిన బాలికలు అందరికీ తప్పనిసరిగా ఇప్పించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి తల్లిదండ్రులకు సూచించారు. జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఆదివారం హెచ్.పి.వి వ్యాక్సిన్ ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి ముఖ్య అతిథిగా విచ్చేసి, లాంఛనంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, హెచ్.పి.వి వ్యాక్సిన్ ఎంతో ఉపయోగకరమైనదని, దీనిని తీసుకోవడం వల్ల 95 శాతం వరకు గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ ను నిరోధించుకోవచ్చని అన్నారు. ఈ వ్యాక్సిన్ పట్ల ఎటువంటి అపోహలు అవసరం లేదని, ఎవరు కూడా ఆందోళనకు గురి కాకుండా జిల్లాలో 14 15 వయస్సు కలిగిన 12,363 మంది బాలికలకు మిషన్ మోడ్ లో హెచ్.పి.వి వ్యాక్సిన్ వేయించాలని కలెక్టర్ సూచించారు. ఇప్పటివరకు ఇది కేవలం ప్రైవేటు ఆసుపత్రులలోనే అందుబాటులో ఉండేదని, సర్వైకల్ క్యాన్సర్ ను నిర్మూలించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రస్తుతం ఉచితంగా ఈ వ్యాక్సిన్ ను అందిస్తోందని తెలిపారు. జీజీహెచ్ తో పాటు జిల్లాలోని డిచ్పల్లి, ధర్పల్లి, నవీపేట్, వర్ని, మోర్తాడ్, బాల్కొండ, ఆర్మూర్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో కూడా ఈ వ్యాక్సిన్ ఇవ్వడం జరుగుతుందని సూచించారు. వ్యాక్సిన్ వేయించుకున్న వారు సర్టిఫికెట్ తీసుకోవాలని, తెలంగాణ ప్రభుత్వం త్వరలోనే అందుబాటులోకి తేనున్న హెల్త్ ప్రొఫైల్ కోసం ఈ సర్టిఫికెట్ ఉపయోగపడుతుందని అన్నారు. కాగా, వ్యాక్సిన్ తీసుకున్న వారిలో శారీరక బలహీనత వల్ల కొంతమందికి అలసట, జ్వరం వంటి లక్షణాలు కనిపించవచ్చని, అంతమాత్రాన భయపడకుండా పారసీటమల్ టాబ్లెట్ వేసుకుంటే సరిపోతుందని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారిణి డాక్టర్ రాజశ్రీ సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవంను పురస్కరించుకుని వ్యాక్సిన్ తీసుకునేందుకు వచ్చిన బాలికలతో కలెక్టర్ కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ అశోక్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ రాములు, డీసీహెచ్ఎస్ డాక్టర్ శ్రీనివాస్ ప్రసాద్, డిప్యూటీ డిఎంహెచ్వో డాక్టర్ అశ్విని, నర్సింగ్ సూపరింటెండెంట్ చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధరలను ఉపసరించుకోవాలి

- సిపిఎం చేవెళ్ల డివిజన్ కార్యదర్శి అల్లీ దేవేందర్

**మొయినాబాద్ , విశాలభారతి:**

కేంద్ర ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్ ధరలను వెంటనే ఉప సహకరించుకోవాలని సిపిఎం చేవెళ్ల డివిజన్ కార్యదర్శి అల్లీ దేవేందర్ పేర్కొన్నారు. ఆదివారం మొయినాబాద్ మున్సిపల్ కేంద్రంలోని కేంద్ర ప్రభుత్వం పెంచిన వంటగ్యాస్ ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లీ దేవేందర్ మాట్లాడుతూ.. ఒక వైపు నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశానందుతున్నాయని, పెరిగిన నిత్యవసర వస్తువుల ధరలతో పేద, మధ్యతరగతి వాళ్ళు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన అన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలు నెలజీతం మొత్తం కుటుంబ పోషణకే ఖర్చవుతుందని, పిల్లల భవిష్యత్తు.. కోసం డబ్బులు పొదుపు చేయలేకపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం మరోసారి గ్యాస్ ధరలు పెంచి పేద, మధ్యతరగతి కుటుంబాల నడ్డి విరుస్తుందని ఆయన ఆరోపిస్తున్నారు. దేశంలో బడా కార్పొరేట్లపై పన్ను వేయకుండా అంబానీ, ఆదానీలకు దేశ సంపదను దోచిపెడుతూ.. పేదల నడ్డి విరుస్తున్నారని ఆయన అన్నారు. వెంటనే కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధరలు తగ్గించాలని లేనిపక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళనలు ఉదృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మొయినాబాద్ మండల నాయకులు ప్రభుదాస్, కర్ర వెంకటయ్య, తాళ్లపల్లి శ్రీనివాస్, ట్రాన్స్పోర్ట్ యూనియన్ సిఐటియు మండల వర్కింగ్ ప్రెసిడెంట్ శేఖర్, ఉపాధ్యక్షులు సుధాకర్ గౌడ్, సిఐటియు మొయినాబాద్ మండల నాయకులు సురేష్, అంజయ్య, అన్నయ్య, ఎస్ఎఫ్ఐ చివర డివిజన్ అధ్యక్షులు ఎర్రవల్లి శ్రీనివాస్, ఎస్ఎఫ్ఐ మొయినాబాద్ మండల కార్యదర్శి చరణ్ గౌడ్, వినోద్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.



## వరల్డ్ కప్ మనదే

**దేవాలయంలో చిన్నారుల ప్రత్యేక పూజలు**



**విశాలభారతి, మల్కాజిగిరి:** టి 20 వరల్డ్ కప్ మనమే సాధించాలని ఓల్డ్ మల్కాజిగిరి లోని అమ్మవారి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు చిన్నారులు. రేపు జరగబోయే టి 20 వరల్డ్ కప్ మ్యాచ్ లో ఇండియా ఘన విజయం సాధించాలని ఆలయ ప్రధాన అర్చకులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మంచి కోరుకునేవారికి విజయం ఎప్పుడూ ఉంటుదని ఆయన తెలిపారు.

## కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

**బొబ్బిలి రామకృష్ణ డిసిసి అధ్యక్షులు నిజామాబాద్ కార్పొరేషన్**



**నిజామాబాద్, విశాలభారతి:** ఈ రోజు జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు నిజామాబాద్ కార్పొరేషన్ డిసిసి అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ విలేకరుల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవిత్ర రంజన్ నెల కొనసాగుతున్న సందర్భంగా మైనారిటీ సోదరుల కొరకు నిజామాబాద్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఖిల్లా రోడ్ లో హాస్మి మస్జిద్ ఎదురుగా ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం జరిగిందనీ,ఇఫ్తార్ విందులో ముఖ్య అతిథిలుగా రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్,రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి,రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ అలీ షబ్బీర్,వివిధ రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్లు పాల్గొంటున్నారని తెలిపారు.కావున నిజామాబాద్ కార్పొరేషన్ పరిధిలోని మైనారిటీ సోదరులు ఇఫ్తార్ విందులో పాల్గొనగలరని బొబ్బిలి రామకృష్ణ అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ అబుద్ బిన్ హందాన్,నయీం శర్వాన్, కుద్దుస్ ,పాప ఖాన్, మెయిన్,అన్వర్, కరీం మరియు తదితరులు పాల్గొన్నారు

## మహిళలను సన్మానించిన సర్పంచ్ చింత రవి



**దేవరుప్పుల, విశాలభారతి:** మండలం, కామారెడ్డిగూడెం గ్రామంలో గ్రామపంచాయితీ పరిధిలోనీ ప్రభుత్వ అనుబంధ వివిధ శాఖలలో పనిచేస్తున్న అంగన్ వాడి టీచర్లు నారెడ్డి దేవేంద్ర, దుద్దుల నిర్మల, రాములమ్మ, ఆశ వర్కర్ మహమ్మద్ పర్వీన్,ఐకెపి సిఎ చింత సమ్మక్క,ఫాతిమా గ్రామ మహిళా సిబ్బంది చింత స్వరూప,గ్రామ మహిళా వార్డు సభ్యులు మరాఠీ నర్సమ్మ,మారేపెల్లి స్వాతి, చింత లక్ష్మీ,చింత వెంకటమ్మలను గ్రామ సర్పంచ్ చింత రవి శాలువాతో సన్మానించి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పులిపంపుల భాస్కర్,వార్డు మెంబర్స్ ఎల్లబోయిన గిరి యాదవ్, చింత లక్ష్మయ్య, అశోక్, ఏళ్లబోయిన నగేష్, కారోబార్ గనగాని ఉప్పలయ్య, సిబ్బంది మారిపెల్లి అంజయ్య, చెందేటి పరుశరాములు, గ్రామ ప్రజలు బిళ్ళ సోమారెడ్డి , ఏళ్ళబోయిన యాకయ్య, మురళి,ఎల్లయ్య,నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

## మండలాన్ని క్లీన్ అండ్ గ్రీన్‌గా ఉంచాలి

**డిపిఓ శ్రీనివాస్**



**నిజామాబాద్, విశాలభారతి:** మోస్రా బాన్సువాడ నియోజకవర్గం పరిధిలోని మోస్రా గ్రామపంచాయతీలో ఆదివారం ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని డిపిఓ శ్రీనివాస్ గ్రామంలోని డ్వాక్రా గ్రూపు మహిళా మణులతో, అంగన్వాడి టీచర్లతో, గ్రామపంచాయతీ వార్డ్ మెంబర్లతో సమావేశాన్ని ఏర్పాటు చేసి డిపిఓ పలు విషయాలపై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిపిఓ మాట్లాడుతూ గ్రామాలలో ఉన్న మహిళలు ఉదయం లేవగానే క్లీన్ అండ్ గ్రీన్ గా ఇండ్లను ఉంచాలని తెలియజేశారు. ప్రతి మహిళ ప్లాస్టిక్ వాడకాలని పూర్తిగా తగ్గించి సహజ సిద్ధమైన చేతితో చేసిన వస్తువులను వాడాలన్నారు. ప్లాస్టిక్ వాడడం వల్ల ఎంతోమంది క్యాన్సర్ వ్యాధికి గురి అయిన విషయాన్ని గుర్తు చేశారు. గ్రామంలోని మహిళలందరూ తడి చెత్తను పొడి చెత్తను వేరు చేసి గ్రామంలోని మహిళలందరూ తడి చెత్తను పొడి చెత్తను వేరు చేసి ఉంచినట్లయితే గ్రామపంచాయతీ వారు తీసుకెళ్తారని ఈ తడి చెత్త పొడి చెత్త పై జీవామృతంతో తయారుచేసిన నీళ్లను చల్లినట్లయితే వర్మీ కంపోస్ట్ తయారై రైతులకు అమ్మినట్లయితే గ్రామపంచాయతీకి ఆదాయం సమకూరుతుందని అన్నారు. బోధన్ డి ఎల్ పి ఓ నాగరాజు మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించి పర్యవరణాన్ని కాపాడాలన్నారు. ప్లాస్టిక్ వాడడం వల్ల కలుగు దుష్పరిణామాల గురించి వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మోస్రా సర్పంచ్ గుత్ప భూపాల్ రెడ్డి, ఎంపీ ఓ వెంకటేశ్వర్లు, వార్డ్ మెంబర్లు షేక్ ఇంతియాజ్, కొమిరి సాయిలు, గ్రామపంచాయతీ కార్యదర్శి హంగార్గ శ్రవణ్ కుమార్, ప్రీతం కుమార్, అంగన్వాడీ టీచర్లు కొత్తి మిర్కర్ పుష్పలత, నూలు మీనా, ఆ షావర్కర్లు, గ్రామపంచాయతీ సిబ్బంది గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ సలహాదారులను కలిసిన కాంగ్రెస్ నాయకులు



**నిజామాబాద్, విశాలభారతి:** మచ్చుకురి గంగాధర్ కాంగ్రెస్ నాయకులు ఆదివారం నిజామాబాదులో నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారులు పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి. సమస్యలపై మాట్లాడారు. ఎడపల్లి గ్రామపంచాయతీ లో జూనియర్ అసిస్టెంట్. బిల్ కలెక్టర్ పోస్టులు. ఖాళీగా ఉన్నందున కొంత ఇబ్బంది కరంఉందని గ్రామపంచాయతీ పరిధిలో కొన్ని బోర్లు లేనందున , మురికినీటి డ్రైనేజీలు వంటి పనుల గురించి ఆయన దృష్టికి తీసుకువెళ్లడం జరిగింది ఆయన వెంటనే స్పందించి త్వరలో సిబ్బందిని ఏర్పాటు చేస్తానని ఈ సందర్భంలో పై అధికారులకు చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో బోధన్ ఏఎంసీ డైరెక్టర్ బొబ్బిలి శ్రీనివాస్ మస్తాన్, నవీన్, గోపి,పురం శేఖర్, శ్రీకాంత్, పాల్గొనడం జరిగింది.

## మహిళలు అన్ని రంగాల్లో ముందుకు రావాలి

**సర్పంచ్ గుగులోత్ శాంతి కిషన్ నాయక్.**



**బయ్యారం, విశాల భారతి:** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బయ్యారం మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. గ్రామపంచాయతీ సర్పంచ్ గుగులోత్ శాంతి కిషన్ నాయక్, ఉపసర్పంచ్ ఎనుగుల ఉమా, రంజిత్ గార్ల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. మహిళలకు పూలమాలలు వేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ గుగులోత్ శాంతి కిషన్ నాయక్ మాట్లాడుతూ సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర అత్యంత కీలకమని తెలిపారు. నేటి కాలంలో మహిళలు రాజకీయ రంగం, ఉద్యోగ రంగం, వ్యాపార రంగం వంటి అన్ని రంగాల్లో పురుషులకు దీటుగా ముందుకు సాగుతున్నారని అన్నారు. గతంతో పోల్చితే ఇప్పుడు మహిళలు మరింత ధైర్యంగా సమాజంలో తమ స్థానం సంపాదించుకుంటున్నారని పేర్కొన్నారు. బయ్యారం గ్రామపంచాయతీలో మహిళలే ఎక్కువ సంఖ్యలో వార్డు సభ్యులుగా ఉండడం ఎంతో ఆనందకరమని ఆమె అన్నారు. ఇది మహిళా సాధికారతకు మంచి ఉదాహరణ అని పేర్కొన్నారు. మహిళల అభివృద్ధికి ప్రభుత్వం మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసి సహాయ సహకారాలు అందించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీధర్, బంగారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కంబాల ముసలయ్య, నందగిరి భద్రయ్య, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు న్యాయం శ్రీనివాస్ రెడ్డి, తాటి జనార్ధన్, రామగిరి వెంకటేశ్వర్లు, సూర్యనారాయణ, తుపాకుల సతీష్, బి.రెడ్డి శ్రీనివాస్ పాల్గొన్నారు. అలాగే బయ్యారం మేజర్ గ్రామపంచాయతీకి చెందిన మహిళా కాంగ్రెస్ నాయకురాలు మండ రేణుక, నందిపాటి భవాని, వార్డు సభ్యులు ఎట్టి సరిత, బండి నాగమణి తదితరులు కార్యక్రమంలో పాల్గొని మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామపంచాయతీ కార్యాలయంలో సంతోషకర వాతావరణంలో కార్యక్రమం సాగింది. మహిళలు సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తారని, వారి అభివృద్ధి ద్వారానే సమాజం ముందుకు సాగుతుందని పలువురు నాయకులు అభిప్రాయం వ్యక్తం చేశారు.

# సమాన న్యాయం ప్రతిచోట ఉండాలి

**ఖమ్మం, విశాలభారతి:**




తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్, మహిళా విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు టీజీవో భవన్ నందు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏలూరు శ్రీనివాసరావు టీజీవో రాష్ట్ర అధ్యక్షులు, టీజీఈజెఏసి సెక్రటరీ జనరల్, స్థానిక కార్పొరేటర్ శ్రీమతి మిక్కిలినేని మంజుల ముఖ్య అతిథులుగా హాజరైనారు. ఈ కార్యక్రమానికి పి సుధారాణి టీజీఓ మహిళా కార్యదర్శి అధ్యక్షత వహించి, కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ, ఈ ఏడాది ఐక్యరాజ్యసమితి ప్రకటించిన హక్కులు, న్యాయం, కార్యాచరణ, అందరు మహిళలు మరియు బాలికల కోసం అనే థీమ్‌తో పాటు, అంతర్జాతీయంగా "Give to Gain" అనే ప్రచారంతో మహిళా సాధికారతకు కొత్త అర్థాన్ని ఇవ్వబోతున్నారు. ఏలూరు శ్రీనివాసరావు మాట్లాడుతూ, కేవలం వేడుకలు జరుపుకోవడమే కాకుండా, మహిళలకు సమాన వేతనం, విద్య మరియు రక్షణ కల్పించడమే ఈ దినోత్సవం యొక్క ముఖ్య ఉద్దేశమని, మహిళలు ఆర్థికంగా స్థిరపడినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని వివరించారు. కార్పొరేటర్ మిక్కిలినేని మంజుల మాట్లాడుతూ నేటి మహిళా దినోత్సవం కేవలం ఒక రోజు కార్యక్రమం కాకుండా, ప్రతి మహిళా తన హక్కుల కోసం, న్యాయం కోసం నిరంతరం పోరాడే స్ఫూర్తినిచ్చే రోజు మహిళా దినోత్సవం అని అభిప్రాయపడ్డారు. జిల్లా సంక్షేమ అధికారిణి శ్రీమతి వేల్పుల విజేత మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో ముందుండాలని కార్యాలయాలలో కూడా మహిళలకు సమానా హక్కులు కల్పించాలని జిల్లాలో మహిళలు అన్నిరంగాలలో సగభాగాన్ని కలిగి ఉన్నారని అభిప్రాయపడ్డారు. కార్యక్రమం అనంతరం మహిళా అధికారులకు ఘనంగా సన్మానం చేయడం జరిగింది, అనంతరం మహిళా దినోత్సవ కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. అనంతరం శ్రీ సత్య సాయి మహిళా వృద్ధాశ్రమంలో మహిళలకు పండ్ల పంపిణీ నిర్వహించారు అనంతరం కార్యక్రమం ఏలూరి శ్రీనివాసరావు గారి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. భోజనం అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలలో అధిక సంఖ్యలో మహిళా అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టీజీవో జిల్లా అధ్యక్షులు కొంగర వెంకటేశ్వర్లు కార్యదర్శి మోదుగు వేలాద్రి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొండపల్లి శేషు ప్రసాద్ హౌస్ బిల్డింగ్ సొసైటీ కార్యదర్శి డాక్టర్ పి విజయ్ కుమార్ కోశాధికారి సూరదపల్లి రాంబాబు టీజీవో మహిళా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు శ్రీమతి ఎస్ విజయ కుమారి, ప్రిన్సిపల్ అసోసియేషన్ నవీన జ్యోతి, మహిళా గెజిటెడ్ అధికారులు డాక్టర్ పి అనిత, డాక్టర్ డి సుజాత, లెక్చరర్ సంఘం అధ్యక్షురాలు ప్రమీల, చంద్రకళ, రాధా, లలిత, అగ్రికల్చర్ ఆఫీసర్స్ అరుణకుమారి, అరుణ జ్యోతి, తార, బ్రిజిట్ గెజిటెడ్ అధికారులు మంజుల, శారద, లావణ్య, రమ, నిర్మల, సాజిద, కవిత, శ్రీరమ, లలిత, విజయలక్ష్మి, షమీన్, నాగమణి, శిరీష, నాలుగో తరగతి జిల్లా అధ్యక్షులు బిక్కు నాయక్ డ్రైవర్ సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్లు స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు పి. పుల్లయ్య మున్సిపల్ సంఘ అధ్యక్షులు సుధాకర్, భాస్కర్ మోదుగు వెంకటేశ్వర్లు, మల్లయ్య, కృష్ణార్జునరావ్ తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు



**మహబూబాబాద్, విశాల భారతి:** మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రగతిశీల మహిళా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. మహిళల హక్కులు, భద్రత, సమానత్వం వంటి అంశాలపై అవగాహన కల్పిస్తూ కార్యక్రమం కొనసాగింది. ఈ సందర్భంగా ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు కుంజ వసంత మాట్లాడుతూ, సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగుతున్నప్పటికీ ఇంకా అనేక అన్యాయాలు, వివక్షలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. మహిళలకు సమాన హక్కులు, భద్రత కల్పించే దిశగా సమాజం మొత్తం కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు. రాష్ట్ర కార్యదర్శి శారు కవిత మాట్లాడుతూ, మహిళలపై జరుగుతున్న హింస, వేధింపులను అరికట్టేందుకు కఠిన చట్టాలు అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. మహిళలు స్వాభిమానంతో జీవించాలంటే విద్య, ఉపాధి అవకాశాలు విస్తరించాల్సిన అవసరం ఉందని తెలిపారు. మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలు తమ హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాడాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం నాయకులు, కార్యకర్తలు పాల్గొని మహిళల సమస్యలపై చర్చించారు. సమాజంలో మహిళలకు గౌరవం, భద్రత కల్పించాలన్నదే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని నిర్వాహకులు తెలిపారు.

## కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి

**ధర్మవరంలో సిసి రోడ్లకు శంకుస్థాపన**



**వాజేడు, విశాలభారతి:** కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి కాకర్లపూడి విక్రాంత్ బాబు అన్నారు ములుగు జిల్లా వాజేడు మండల పరిధిలోని ధర్మవరం గ్రామపంచాయతీలో 15 లక్షల రూపాయల వ్యయంతో ఎన్ఆర్ఈజీఎస్ మంజూరైన సిసి రోడ్లకు ధర్మవరం సర్పంచ్ కాకా సుమతి కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు ఈ సందర్భంగా కాకర్లపూడి విక్రాంత మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతుందని ప్రభుత్వం అందించే సంక్షేమ కార్యక్రమాలు నిరుపేదలకు అందే విధంగా స్థానిక ప్రజాప్రతినిధులు తమ వంతు కృషి చేయాలని గ్రామాలలోని రోడ్ల సమస్యలు ఎక్కడెక్కడ ఉన్నాయో గుర్తించి సిసి రోడ్ల నిర్మాణం చేపట్టాలన్నారు త్వరలోనే రెండోదప ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేయడం జరుగుతుందని నిరుపేదలను గుర్తించి వారికి లబ్ధి చేకూరే విధంగా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మారం ఉపసర్పంచ్ బొల్లె సూర్యం పంచాయితి కార్యదర్శి  యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు గౌరారపు సర్వేశ్వరరావు ఆత్మ డైరెక్టర్ గౌరారపు వెన్నెల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్కే కాజావలి ఎస్కే షబ్బీర్ పాషా  పాల్గొన్నారు

## అనాథకు అండగా బయ్యారం గ్రామపంచాయతీ

**సర్పంచ్ శాంతి కిషన్ నాయక్ ఆధ్వర్యంలో దహనసంస్కారాలు**



**బయ్యారం విశాలభారతి:** బయ్యారం గ్రామపంచాయతీ పరిధిలోని కాకతీయనగర్ కాలనీలో అనాథగా మిగిలిన మహిళకు మానవతా దృక్పథంతో దహన సంస్కారాలు నిర్వహించిన సంఘటన స్థానికంగా హృదయాలను కదిలించింది. కాలనీలో నివసిస్తున్న ముత్యాల భద్రయ్య సతీమణి గత ఇరవై రోజులుగా తీవ్ర అనారోగ్యంతో పాటు తిండి లేక, ఆలనా పాలన లేక ఒంటరిగా జీవిస్తూ ఉన్నట్లు కాలనీ వాసులు తెలిపారు. ఆమెకు చూసుకునే కుటుంబ సభ్యులు లేకపోవడంతో పరిస్థితి మరింత విషమమై, నిన్న రాత్రి ఆమె మృతి చెందింది. ఈ విషయాన్ని గమనించిన కాలనీ వాసులు వెంటనే బయ్యారం గ్రామపంచాయతీ సర్పంచ్ గుగులోత్ శాంతి కిషన్ నాయక్ కి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే స్పందించిన సర్పంచ్ శాంతి కిషన్ నాయక్ అక్కడికి చేరుకుని మానవతా దృక్పథంతో దహన సంస్కారాలు నిర్వహించే ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో బయ్యారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కంబాల ముసలయ్య, మహబూబాబాద్ పార్లమెంట్ లీగల్ అడ్వయిజర్ గుగులోత్ కిషన్ నాయక్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాయిని శ్రీనివాస్ రెడ్డి, బీరెడ్డి సంగయ్య తదితరులు పాల్గొన్నారు. వారు స్వయంగా మృతదేహాన్ని ట్రాక్టర్‌లో పెట్టి శ్మశానవాటికకు తరలించి దహన సంస్కారాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికులు, కాలనీ వాసులు కూడా పాల్గొని మానవతా విలువలను చాటారు. అనాథగా మిగిలిన మహిళకు గ్రామ నాయకులు కలిసి దహన సంస్కారాలు నిర్వహించడం పట్ల స్థానిక ప్రజలు అభినందనలు తెలిపారు. ఈ సంఘటన సమాజంలో మానవతా విలువలు ఇంకా నిలిచే ఉన్నాయనే విషయాన్ని మరోసారి గుర్తు చేసింది.

## సేవాలాల్ సేన రాష్ట్ర ప్రచార కార్యదర్శి జన్మదిన వేడుకలు



**బయ్యారం, విశాలభారతి:** బయ్యారం మండల కేంద్రంలో సేవాలాల్ సేన రాష్ట్ర ప్రచార కార్యదర్శి భూక్య రవి నాయక్ జన్మదిన వేడుకలు ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అభిమానులు, స్నేహితులు, నాయకులు కలిసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమం స్నేహపూర్వక వాతావరణంలో జరిగి, పాల్గొన్న ప్రతి ఒక్కరూ రవి నాయక్‌కు ఆయురారోగ్యాలు, విజయాలు కలగాలని కోరుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ భూక్య రవి నాయక్ సామాజిక సేవలో ముందుండే వ్యక్తిగా, గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి చేసే నాయకుడిగా గుర్తింపు పొందారని పేర్కొన్నారు. సమాజ సేవ పట్ల ఆయనకు ఉన్న నిబద్ధత ఆదర్శప్రాయమని వారు అభిప్రాయపడ్డారు. ఈ జన్మదిన వేడుకల్లో మద్దినేని గుట్టయ్య, ఆంగోతు శ్రీకాంత్ నాయక్, సాక్షి వీరన్న, ఆంధ్రజ్యోతి గిరి, వార్తా విలేఖరి సుమన్ రెడ్డి, బాబు సార్, కొమిరి వెంకన్న, అజ్మీర రూప్లా నాయక్, మంగీలాల్ నాయక్, జాటోత్ రవి నాయక్, బోడ బాలు నాయక్, ఎస్.కె. మౌలానా, నరేష్ నాయక్, శ్రీకాంత్ నాయక్, అరుణ్ నాయక్, అనిల్ నాయక్, అజ్మీర వీరన్న నాయక్, అజ్మీర ప్రవీణ్ నాయక్, రాజా నాయక్ తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

## పలు శుభకార్యాలలో పాల్గొన్న ఎమ్మెల్యే జారె ఆదినారాయణ



- మహిళల ముష్టిబండలో అన్నప్రాసన, అశ్వారావుపేటలో రిసెప్షన్ వేడుకలో పాల్గొనడం
- మహిళల సున్నంబట్టి, పాత మామిళ్లగూడెం గ్రామాల్లో కుటుంబ శుభకార్యాలకు హాజరు
- మహిళల స్థానిక ప్రజలతో కలసి శుభాకాంక్షలు తెలియజేసిన ఎమ్మెల్యే

**అశ్వారావుపేట, విశాలభారతి:**

అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పలు గ్రామాల్లో జరిగిన కుటుంబ శుభకార్యాలలో పాల్గొని ఆశీర్వాదాలు అందజేశారు. దమ్మపేట మండలం ముష్టిబండ గ్రామంలో నందమూరి కుటుంబానికి చెందిన అన్నప్రాసన వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అశ్వారావుపేట మండల కేంద్రంలోని శ్రీశ్రీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన రంగా కుటుంబ రిసెప్షన్ వేడుకలో హాజరయ్యారు. అలాగే సున్నంబట్టి గ్రామంలో పొట్టా కుటుంబం నిర్వహించిన నూతన వస్త్రాలంకరణ వేడుకలో పాల్గొని ఆశీర్వదించారు. పాత మామిళ్లవారి గూడెం గ్రామంలో బోడపాటి కుటుంబానికి చెందిన వివాహ వేడుకలో పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమాలలో అశ్వారావుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ బాబు, దమ్మపేట మండలం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రావు గంగాధర్ రావు, ఆత్మ కమిటీ చైర్మన్ సుంకవల్లి వీరభద్రరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహిళలపై హింసకు మద్యపానం ప్రధాన కారణం

**న్యాయవాది శారదా, అందోజు రవీంద్ర చారి**

**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్:**



మహిళలపై జరుగుతున్న హింస, హత్యలు, అత్యాచారాలకు పురుషాధిపత్య భావజాలంతో పాటు మద్యపానం కూడా ప్రధాన కారణమని హైకోర్టు న్యాయవాది శారదా, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందోజు రవీంద్ర చారి అన్నారు. మహిళల భద్రత కోసం మద్యపానాన్ని పూర్తిగా రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం రావి నారాయణ రెడ్డి కాలనీ ఫేజ్ 2లోని సిపిఐ పార్టీ కార్యాలయంలో భారత జాతీయ మహిళా సమాఖ్య అబ్దుల్లాపూర్ మెట్ మండల సమితి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. జిల్లా అధ్యక్షురాలు కాటి అరుణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి హైకోర్టు న్యాయవాది శారదా, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందోజు రవీంద్ర చారి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 1910లో కోపెన్‌హేగన్‌లో జరిగిన అంతర్జాతీయ సదస్సులో మహిళా నాయకురాలు క్లారా జెట్కిన్ ప్రతిపాదించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం వెనుక ఎన్నో మహిళల పోరాటాలు, త్యాగాలు ఉన్నాయని తెలిపారు. మార్చి 8 పండుగ కాదని, శ్రామిక మహిళలు తమ హక్కుల సాధన కోసం పోరాడి సాధించుకున్న చారిత్రాత్మక దినమని అన్నారు. సాంకేతికంగా అభివృద్ధి చెందిన సమాజంలో కూడా ప్రతి పదిహేను నిమిషాలకు ఒకసారి మహిళలపై దాడులు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మద్యపానం కారణంగా మహిళలపై హింస, హత్యలు, అత్యాచారాలు పెరుగుతున్నాయని తెలిపారు. ప్రభుత్వాలు మద్యం, గుట్కా, పాన్ మసాలా విక్రయాల ద్వారా ఆదాయం పొందడమే లక్ష్యంగా పనిచేస్తున్నాయని విమర్శించారు. మహిళల రక్షణ కోసం చట్టాలను కఠినంగా అమలు చేయాలని, మహిళలపై దాడులు జరిగితే ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా నిందితులకు త్వరితగతిన శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్‌ను వెంటనే అమలు చేయాలని కోరారు. మహిళలు రాజకీయ, సామాజిక, ఉద్యోగ, వ్యాపార రంగాల్లో ముందుకు రావాలని, తమ హక్కుల సాధన కోసం చట్టపరంగా పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. నిర్భయ చట్టం, ఆస్తి హక్కు చట్టం, లింగ నిర్ధారణ పరీక్షల నిరోధక చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి, ప్రజా నాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి పల్లె నర్సింహా, సిపిఐ అబ్దుల్లాపూర్ మెట్ మండల ప్రధాన కార్యదర్శి అజ్మీరా హరిసింగ్ నాయక్, సహాయ కార్యదర్శి కేతారాజు నర్సింహా, చిర్ర శేఖర్, గణేష్, పల్లె జ్యోతి, దేవమ్మ, అనూష, సుజాత, చందన, కవిత, ప్రియా, లక్ష్మి, రేణుకమ్మ, ప్రమీల, అనురాధ, అన్నపూర్ణ, అలివేల, నీలా, రాణి, షాలిని, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి ఎస్.ఎఫ్.ఐ టాలెంట్ పరీక్ష విజయవంతం

**మహబూబాబాద్, విశాలభారతి:**

మహబూబాబాద్ జిల్లాలో ఎస్.ఎఫ్.ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి టాలెంట్ పరీక్ష విజయవంతంగా జరిగింది. మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థులకు జిల్లా స్థాయిలో ఈ పరీక్షను నిర్వహించారు. జిల్లాలోని వివిధ మండలాల నుంచి సుమారు 100 మంది విద్యార్థులు ఈ టాలెంట్ పరీక్షలో పాల్గొన్నారని ఎస్.ఎఫ్.ఐ నాయకులు తెలిపారు. విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను వెలికి తీసి, వారిని ఉన్నత లక్ష్యాల వైపు నడిపించాలనే ఉద్దేశంతో ఈ పరీక్షను నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ మహబూబాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి యాకుబ్ మాట్లాడుతూ, రాబోయే పదో తరగతి ఫలితాల్లో మహబూబాబాద్ జిల్లా మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులు కష్టపడి చదివి తమ జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. విద్య అనేది వ్యక్తి భవిష్యత్తును నిర్మించే ప్రధాన సాధనం అని, క్రమశిక్షణతో చదువుకుంటే మంచి విజయాలు సాధించవచ్చని తెలిపారు. గౌతమి విద్యాసంస్థల డైరెక్టర్ తక్కెళ్లపల్లి సంధ్యారాణి మాట్లాడుతూ, విద్యార్థులు తమ లక్ష్యాలను స్పష్టంగా నిర్ణయించుకుని కష్టపడి చదివితే తప్పకుండా విజయాన్ని అందుకుంటారని చెప్పారు. ఇలాంటి టాలెంట్ పరీక్షలు విద్యార్థుల్లో పోటీ భావనను పెంచి, చదువుపై మరింత ఆసక్తిని కలిగిస్తాయని ఆమె పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఎస్.ఎఫ్.ఐ నిర్వహించిన ఈ టాలెంట్ పరీక్షను రాసిన విద్యార్థులకు జిల్లా ఎస్.ఎఫ్.ఐ నాయకత్వం ధన్యవాదాలు తెలిపింది. విద్యార్థులు తమ ప్రతిభను మరింతగా అభివృద్ధి చేసుకుని భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఎఫ్.ఐ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు గంధసిరి జ్యోతి బసు, జిల్లా కార్యదర్శి పట్ల మధు, జిల్లా నాయకులు ఎం.డి అమీర్, గుండ్ల రాకేష్, వీరేందర్, మహేష్, వంశీ, వినయ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.




## మహిళలకు చీరల పంపిణీ

**మహిళల స్వయం ఉపాధికి ఆర్థిక సహకారం.. మహిళల అభివృద్ధి నా లక్ష్యం**



**చౌటుప్పల్ విశాలభారతి:** పట్టణ కేంద్రంలోని ఈ ఎల్ వి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ సందర్భంగా మున్సిపాలిటీ,ఆశా వర్కర్లు మరియు అంగన్వాడి మహిళలకు చీరలు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన చైర్మన్ ఇరుగుదిండ్ల భాస్కర్ వారికి చీరలు పంపిణీ చేశారు.అనంతరం వారు మాట్లాడుతూ...మహిళలకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ.. ఈ మహిళా దినోత్సవం ప్రతి సంవత్సరం మార్చి 8న ప్రపంచ వ్యాప్తంగా జరుపుకుంటారు.మహిళల సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక మరియు రాజకీయ సాధనలను వేడుకగా జరుపుకోవడంతో పాటు, లింగ సమానత్వం, హక్కుల పరిరక్షణ మరియు మహిళా సాధికారతను ప్రోత్సహించడం ఈ దినోత్సవం యొక్క ప్రధాన ప్రత్యేకత.ఇది మహిళల పట్ల వివక్షను రూపుమాపి, వారి గౌరవాన్ని చాటడం.మహిళ స్వయం అభివృద్ధి నా లక్ష్యం అని, మహిళలు స్వయం ఉపాధికి ఆర్థిక సహకారం అందిస్తాం అని తెలిపారు.మహిళలు తమ సొంత కాళ్ల పై నిలబడిడే ఇఎల్వి సంస్థ లక్ష్యమని ఈ సందర్భంగా అయన తెలిపారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కోయడ శేఖర్ గౌడ్, బత్తుల జయమ్మ దాసు, ఆలే శ్రీలత, మరియు వివిధ గ్రామాల సర్పంచులు ప్రజాప్రతినిధులు మహిళలు పాల్గొన్నారు.

## ఆర్థిక సాయం చేసిన మాజీ ఎంపీపీ



**వలిగొండ, విశాలభారతి:** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం ఆరూరు గ్రామంలో ఇటీవల మరణించిన ఎలిమినేటి సావిత్రమ్మ కుటుంబానికి వలిగొండ మాజీ ఎంపీపీ చిట్టెడి జనార్దన్ రెడ్డి ఆర్థిక సహాయం అందించారు. బాధిత కుటుంబానికి రూ.5,000 నగదును అందజేసి తన సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కుటుంబాన్ని కోల్పోయిన వారి పరిస్థితి ఎంతో బాధాకరమని, ఇలాంటి సమయంలో అందరూ సహాయ సహకారాలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు బండారు నరసింహారెడ్డి, మాజీ ఎంపీటీసీ బైకాని ముత్యాలు, మాజీ మత్స్య గిరి గుట్ట డైరెక్టర్ బండి రవికుమార్, అరూరు రజక సంఘం అధ్యక్షులు ఎలిమినేటి సంతోష్ కుమార్, బాసాని సత్తయ్య తదితరులు పాల్గొని సావిత్రమ్మకు శ్రద్ధాంజలి ఘటించారు.

## నీతి, నిజాయితీకి మారుపేరు మాలోతు బిక్షపతి నాయక్



**మహబూబాబాద్, విశాలభారతి:** మలిదశ తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించిన ఉద్యమకారుడు, నీతినిజాయితీలకు మారుపేరుగా పేరుగాంచిన ప్రొఫెసర్ బియ్యాల జనార్దన్ రావు, ప్రొఫెసర్ జయశంకర్ సార్‌ల ప్రియ శిష్యుడు మాలోతు బిక్షపతి నాయక్ ఆదివారం హనుమకొండలో తక్కలపల్లి వాసుదేవరావు అలియాస్ ఆశన్న, రూపేష్‌ని స్నేహపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు తెలంగాణ ఉద్యమ స్మృతులను గుర్తు చేసుకుంటూ, సమాజంలో ప్రజల అభివృద్ధి కోసం చేపట్టాల్సిన కార్యక్రమాలపై పరస్పరం చర్చించారు. తెలంగాణ సాధన కోసం ఎన్నో కష్టాలు పడిన రోజుల్ని స్మరించుకుంటూ, ఉద్యమంలో పాల్గొన్న నాయకుల సేవలను గుర్తు చేసుకున్నారు. అదేవిధంగా యువతలో సామాజిక చైతన్యం పెంపొందించాల్సిన అవసరాన్ని కూడా ప్రస్తావించారు. తెలంగాణ కోసం పోరాడిన ఉద్యమకారుల ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. ఈ భేటీ స్నేహపూర్వక వాతావరణంలో కొనసాగింది.

## వైభవంగా 18వ వార్షికోత్సవ వేడుకలు

**శ్రీ పద్మావతి గోదా సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం**



**వలిగొండ, విశాలభారతి:** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని మాందాపురం గ్రామంలో శ్రీ పద్మావతి గోదా సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ సముదాయంలో 18వ వార్షికోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం భక్తుల నడుమ ఘనంగా జరిగింది. వేద పండితుల వేదమంత్రాల మధ్య డప్పు చప్పుళ్లు, మహిళల కోలాటాలతో ఆలయ ప్రాంగణం ఉత్సాహభరితంగా మారింది. ఆలయ నిర్మాణ దాతలు సోలిపురం ప్రభాకర్ రెడ్డి (యూఎస్ఏ), సోలిపురం వెంకటరెడ్డి, డాక్టర్ రంజిత్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ మరియు మాజీ జెడ్పిటిసి కుసాంగి రాములు, గ్రామ పంచాయతీ పాలకమండలి సమక్షంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని శ్రీ పద్మావతి గోదా సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి, శ్రీ ఆంజనేయ స్వామి, నవగ్రహ నాగేంద్ర స్వామి ఆలయ సముదాయంలో కళ్యాణ మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారికి ఆలయ నిర్మాణ దాత సోలిపురం వెంకటరెడ్డి కుటుంబ సభ్యులు పట్టు వస్త్రాలను సమర్పించారు. అధిక సంఖ్యలో మహిళలు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొని అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించారు. కార్యక్రమంలో సోలిపురం బంధుమిత్రులు, గ్రామ పెద్దలు, మాజీ సర్పంచ్ సోలిపురం సాగర్ రెడ్డి, సోలిపురం రాంరెడ్డి, సోలిపురం ఉపేందర్ రెడ్డి, జిల్లా నాయకులు వాకిటి అనంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. మీడియాతో మాట్లాడిన గ్రామ పెద్దలు, భవిష్యత్తులో 20వ వార్షికోత్సవ వేడుకలకు శ్రీ శ్రీ చిన్న జీయర్ స్వామిని ఆహ్వానించేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు. అలాగే ఆలయ ప్రాంగణంలో శివపార్వతుల గుడి నిర్మాణం చేపట్టేందుకు స్థలం కేటాయించి త్వరలో నిర్మాణ పనులు ప్రారంభిస్తామని వెల్లడించారు.

## మాలోత్ కవితకు ఘన సన్మానం



**మహబూబాబాద్, విశాల భారతి:** మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మాజీ ఎంపీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవిత ని బీఆర్ఎస్ నాయకులు ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. మహిళల సాధికారతకు ఆమె చేస్తున్న సేవలను కొనియాడుతూ పూలమాలలు వేసి, శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ జిల్లా నాయకులు పర్కాల శ్రీనివాస్ రెడ్డి, మహబూబాబాద్ మున్సిపల్ కౌన్సిలర్ ముత్యం వెంకన్న గౌడ్, జిల్లా పరిషత్ మాజీ కోఆప్షన్ సభ్యుడు షేక్ మహబూబ్ పాషా, మహబూబాబాద్ మార్కెట్ మాజీ చైర్మన్ కత్తెరసాల విద్యాసాగర్, ఉగ్గంపల్లి సర్పంచ్ అయూబ్ పాషా తదితరులు పాల్గొన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా మాలోత్ కవిత కి శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆమె రాజకీయ, సామాజిక రంగాల్లో చేస్తున్న కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాలోత్ కవిత మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందుకు రావాలని, సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర అత్యంత కీలకమని తెలిపారు. మహిళల అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కలిసి పని చేయాలని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ కార్యకర్తలు, స్థానిక నాయకులు కూడా పాల్గొని ఆమెకు అభినందనలు తెలిపారు.

## వివాహానికి హాజరైన సిహెచ్ శ్రీనివాస్ – రమాదేవి



**కురవి విశాలభారతి:** మహబూబాబాద్ జిల్లా కురవి లో జరిగిన తిర్మలాపురం గ్రామానికి చెందిన కల్లెపు వీరన్న కుమారుడు కల్లెపు రంజిత్ మరియు నాగేశ్వరి వివాహ వేడుకలకు టియుడబ్ల్యూజే ఐజేయు మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు సిహెచ్ శ్రీనివాస్ - రమాదేవి దంపతులు ప్రత్యేకంగా హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. వివాహ కార్యక్రమంలో శ్రీనివాస్ - రమాదేవి దంపతులు వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి దాంపత్య జీవితం ఆనందంగా, సుఖసంతోషాలతో కొనసాగాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులతో ఆత్మీయంగా మాట్లాడి, నూతన దంపతులకు ఆశీస్సులు అందజేశారు. ఈ సందర్భంగా కల్లెపు వీణనాగరాజు సహా కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. వివాహ వేడుకలో సిహెచ్ శ్రీనివాస్ - రమాదేవి దంపతుల హాజరు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

# అందరివాడు.. ఆడబిడ్డలకు అన్న.. రేవంతన్న

**కరీంనగర్**

అందరివాడు... ఆడబిడ్డలకు అన్న... రేవంతన్న. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ వారసత్వాన్ని తెలంగాణలో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ సర్కారు కొనసాగిస్తున్నది. అందుచేతనే రాష్ట్రంలోని మహిళలను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్ళేందుకు ముందడుగు వేస్తున్నది ప్రజా ప్రభుత్వం. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఇందిరా మహిళా శక్తి పథకాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నది మన ప్రభుత్వం. మహిళలను ప్రోత్సహించడంలో భాగంగా... సోలార్ ప్లాంట్ల ఏర్పాటు, ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ బాధ్యతను ఆడబిడ్డలకు అప్పగించిన ఏకైన ప్రభుత్వం దేశంలోనే మన తెలంగాణ. ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడమే కాదు... ఆర్టీసీకి వెయ్యి బస్సులను అద్దెకు ఇచ్చేలా ప్రోత్సహించి వారిని బస్సులకు యజమానులను చేసింది ప్రభుత్వం. హైటెక్ సిటీలో విప్రో, మైక్రోసాఫ్ట్ సంస్థలు ఉండేచోట మహిళా సంఘాలు తయారు చేసిన వస్తువులను మార్కెటింగ్ చేసుకునే సదుపాయం కల్పించింది. దాంతో, తెలంగాణ మహిళలు ప్రపంచంతో పోటీ పడుతున్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి తరచూ ఉద్ఘాటించడం ఈ ప్రాంత మహిళలు చేసుకున్న అదృష్టం. బీఆర్ఎస్ ప్రభుత్వ ఆడబిడ్డలను పట్టించుకోలేదని విమర్శలు గణనీయంగా ఉన్నాయి. గత ప్రభుత్వంలో ఐదేళ్ల వరకు మంత్రివర్గంలో మహిళలు లేదు. స్థానిక సంస్థల్లో మహిళా రిజర్వేషన్ తెచ్చిందే కాంగ్రెస్ ప్రభుత్వం. దాంతోపాటు, త్వరలోనే చట్టసభల్లో కూడా మహిళలకు 33శాతం రిజర్వేషన్ రాబోతుందని సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా వెల్లడించారు పలు సందర్భాల్లో. ఏ మార్పు కావాలని ఆడబిడ్డలు ఆశీర్వదించారో ఆ మార్పు ఇప్పుడు పరేడ్ గ్రౌండ్‌లో కనిపిస్తోంది. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేస్తేనే రాష్ట్రం వన్ ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థ అవుతుందని ప్రభుత్వం పదేపదే చెబుతున్నది. వాటిని ఆచరణలో పెడుతూ ముందుకు వెళుతున్నది. ఆడబిడ్డలు తలచుకుంటే వన్ ట్రిలియన్ ఆర్థిక



సత్తు మల్లేష్, కరీంనగర్ జిల్లా గ్రంథాలయ కమిటీ ఛైర్మన్

వ్యవస్థ సాధన పెద్ద కష్టమేమీ కాదు. ఎందుకంటే, ఈ రాష్ట్రంలో 65 లక్షల మంది మహిళలు స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా ఉన్నారు. పాఠశాలల నిర్వహణ, బడి పిల్లలకు కోటి 30 లక్షల జతల యూనిఫాం కుట్టించే పని మహిళలకే అప్పగించారు. ఈ ప్రభుత్వంలో మంత్రులుగా సీతక్క, కొండా సురేఖ పనిచేస్తున్నారు. గత ప్రభుత్వం హయాంలో కేబినెట్‌లో ఒక్క మహిళకు కూడా మంత్రిగా లేరు. ఇచ్చిన మాటకు కట్టుబడుండే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే సోనియాగాంధీ పుట్టిన రోజు సందర్భంగా రాష్ట్ర ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం సౌకర్యాన్ని అమలుచేసి వారికి ఆర్థికంగా లబ్ధి చేకూర్చింది. ఉచిత ప్రయాణంలో సగటున రోజుకు 30 లక్షల మంది మహిళా ప్రయాణికులు ప్రయోజనం పొందుతుండడంతో వారికి రూ.1,500 కోట్ల ఆదా అవుతోంది. ఉచిత బస్సు పథకానికి ప్రభుత్వం ఆర్టీసీకి నెలకు రూ.455 కోట్లు చెల్లిస్తూ ఆర్థిక భారాన్ని భరిస్తోంది. గతంలో నష్టాల ఊబిలో కూరుకుపోయిన ఆర్టీసీకి ఉచిత బస్సు ప్రయాణంతో ఆక్యుపెన్సీ పెరిగి లాభాల బాట పట్టింది. ఆర్థికంగా ఎన్ని సమస్యలు ఎదురైనా కుటుంబ భారం మోస్తూ కుటుంబ గౌరవాన్ని కాపాడే మహిళల ఇబ్బందులు దృష్టిలో పెట్టుకొని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే తెలంగాణ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణమే కాకుండా సబ్సిడీ గ్యాస్, ఉచిత విద్యుత్, ఆరోగ్య శ్రీ ఇన్సూరెన్స్ పెంపు పథకాలను కూడా అమలు చేసి చేదోడుగా నిలిచి మహిళల ఆత్మగౌరవాన్ని పెంచింది. రాష్ట్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్‌పై అందిస్తున్న రూ.500 సబ్సిడీతో సుమారు 40 లక్షల కుటుంబాలకు లబ్ధి చేకూరుతోంది. గృహజ్యోతి కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌తో 50 లక్షల కుటుంబాలకు ప్రయోజనం కలుగుతోంది. దాంతోపాటు, పేదల్లో భరోసా నింపేలా ఆరోగ్యశ్రీ పథకం కింద ఇన్సూరెన్స్‌ను రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచింది. మరోవైపు తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవాన్ని పెంచేలా ప్రభుత్వం ఒక్కో నియోజకవర్గం పరిధిలో 3,500 ఇళ్ల చొప్పున రాష్ట్రంలో మొత్తం 4.50 లక్షల ఇందిరమ్మ ఇండ్లను మహిళల పేరున అందజేసే ప్రక్రియ ప్రారంభించింది. అంతేకాక మహిళల పేరుమీదనే 40 లక్షలకుపైగా నూతన రేషన్ కార్డులను కూడా జారీ చేస్తుంది. ఇచ్చిన హామీలను అమలు చేస్తున్న కాంగ్రెస్ తమ బాధ్యత తీరిపోయింది అనేలా కాకుండా మహిళల సమగ్రాభివృద్ధికి మరిన్ని పథకాలను ప్రారంభించింది. భారత దేశ ఉక్కు మహిళ ఇందిరాగాంధీ పేరిట ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా మహిళలను కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్థికంగా బలోపేతం చేస్తోంది. కోటిమంది తెలంగాణ మహిళలను కోటీశ్వరులుగా చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం రాష్ట్రంలోని స్వశక్తి మహిళా సంఘాలను ప్రోత్సహిస్తోంది. ఇప్పటికే 63.86 లక్షల మంది మహిళలు మహిళా సంఘాల్లో సభ్యత్వం తీసుకోవడం వారికి ప్రభుత్వంపై ఉన్న విశ్వాసానికి నిదర్శనం. రాష్ట్రంలో ఇంటింటికీ తిరిగి ప్రతి మహిళకు సంఘాల్లో సభ్యత్వం కల్పించాలని ప్రభుత్వం కంకణం కట్టుకుంది. మహిళా సంఘాలకు ఐదేళ్లలో రూ.లక్ష కోట్లు ఏటా 5,000 గ్రామ సంఘాలకు రూ.5,000 కోట్లు కేటాయించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మహిళా సంఘంలో చేరిన ప్రతి మహిళకు రూ.15.50 లక్షల ఆర్థిక సాయం అందజేయనుంది. వీరందరికీ ప్రభుత్వం రూ.5 లక్షల బీమా కల్పించనుంది. రాష్ట్రంలో ప్రతి జిల్లాలో ఇందిరా మహిళా శక్తి భవనాల నిర్మాణం కోసం ఇప్పటికే అనుమతులు జారీ చేసిన ప్రభుత్వం ఒక్కో భవన నిర్మాణానికి రూ. 5 కోట్ల చొప్పున మొత్తం 22 భవనాల కోసం రూ.110 కోట్లు మంజూరు చేసింది. సిరిసిల్లలో 60 ఎకరాల్లో అపెరల్ పార్కులో రెడీమెడ్ వస్త్రాల తయారీలో ప్రభుత్వం మహిళలకు ప్రాధాన్యతనిస్తోంది. నారాయణపేటలో పూర్తిగా మహిళలే నిర్వహించేలా పెట్రోల్ బంకులు ప్రారంభించిన ప్రభుత్వం ఇకపై అన్ని జిల్లాల్లో కూడా వీటిని ఏర్పాటు చేయడానికి కృషి చేస్తుంది. మహిళలచే ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఇందిరా శక్తి క్యాంటీన్లను ప్రారంభించింది. కుట్టు శిక్షణతో సహా మరో 15 వ్యాపారాల్లో మహిళలకు శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఉచిత కుట్టు మిషన్లను పంపిణీ చేయాలని నిర్ణయించిన ప్రభుత్వం పాఠశాలల్లో యూనిఫాం కుట్టే పనులను కూడా మహిళలకే అప్పచెప్పింది. మహిళా సంఘాల ఆధ్వర్యంలో 32 జిల్లాల్లో 64 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ఇక కోఠిలోని మహిళా యూనివర్సిటీకి పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ పేరు పెట్టి ఆమెను ప్రజా ప్రభుత్వం గౌరవించుకున్నది. సామాజికవేత్త సావిత్రీబాయి పూలే పుట్టిన రోజును మహిళా ఉపాధ్యాయుల దినోత్సవంగా తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఇద్దరు మహిళలకు మంత్రి పదవులిచ్చి గౌరవించుకుంది. వడ్డీ లేని రుణాలకు సంబంధించి చెక్కులను ఇవ్వడంతో పాటు, ఏడాది కాలంలో ప్రమాదవశాత్తు మరణించిన మహిళలకుటుంబాలకు రూ.40 కోట్ల బీమా అందజేసి ప్రభుత్వం ఆదుకోనుంది. 14 వేల అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల ఉద్యోగాల నియామకం కోసం నోటిఫికేషన్ జారీ చేసి మహిళలకు ఉపాధి కల్పనపై దృష్టిసారించింది. తెలంగాణ ప్రజల ఆకాంక్ష తెలిసిన సోనియా గాంధీ ఇచ్చిన మాట ప్రకారం తెలంగాణ రాష్ట్రం ఇచ్చింది. ఈ విషయాన్ని మన రాష్ట్ర ఆడబిడ్డలందరూ గుర్తించి రేవంతన్నకు అండగా నిలవాలి.

# దాతల దయ కోసం ఎదురుచూపులు

- ఒక చిన్న సహాయం... ఒక ప్రాణాన్ని కాపాడగలదు
- ఒక్క క్షణం ప్రమాదం... ఆసుపత్రి మంచంపై ప్రాణాల కోసం అనూష పోరాటం.
- కాళ్లు, చేతులు విరిగిన అనూష... ఆపరేషన్‌కు రూ.15 లక్షలు కావాలి అంటూ కుటుంబం వేడిక.
- "మా చెల్లిని బ్రతికించండి"... కన్నీటి వేడికతో సహాయం కోరుతున్న సోదరుడు.
- ప్రమాదం చిద్రమ చేసిన యువతి జీవితం... దాతల సహాయం కోసం ఎదురుచూస్తున్న కుటుంబం.
- ఒక చిన్న సహాయం... అనూషకు కొత్త జీవితం ఇవ్వగలదు



చావు-బ్రతుకుల మధ్య అనూష పోరాటం

**కురవి, విశాలభారతి:** ఒక్క క్షణం జరిగిన ప్రమాదం ఒక యువతి జీవితాన్ని పూర్తిగా మార్చేసింది. నవ్వుతూ ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆమె... ఇప్పుడు ఆసుపత్రి మంచంపై ప్రాణాల కోసం పోరాడుతోంది. కురవి మండలం కందికొండ గ్రామానికి చెందిన కోర్ని అనూష ప్రస్తుతం తీవ్రమైన గాయాలతో చికిత్స పొందుతూ జీవన మృతుల మధ్య పోరాటం సాగిస్తోంది. ఈ ఏడాది జనవరి 26న సికింద్రాబాద్ నుండి రైలులో మహబూబాబాద్‌కు వచ్చిన అనూష, స్టేషన్‌లో రైలుబండి దిగుతుండగా ప్రమాదవశాత్తు ట్రాక్ మధ్యలో పడిపోయింది. ఒక్క క్షణంలో జరిగిన ఈ ప్రమాదం ఆమె జీవితాన్ని చిద్రమయ్యేలా చేసింది. ప్రమాదంలో ఆమె రెండు కాళ్లు, చేతులు తీవ్రంగా విరిగిపోవడంతో పాటు వెన్నెముక కూడా దెబ్బతింది. తీవ్ర రక్తస్రావంతో ఉన్న ఆమెను వెంటనే మహబూబాబాద్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరిస్థితి అత్యంత విషమంగా ఉందని చెప్పడంతో కుటుంబ సభ్యులు ఆమెను వెంటనే హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో ఆమెకు చికిత్స కొనసాగుతోంది. పేద కుటుంబానికి చెందిన అనూషను కాపాడేందుకు కుటుంబ సభ్యులు అప్పులు చేసి, తెలిసిన వారిని వేడుకొని, చేతిలో ఉన్నదంతా ఖర్చు పెట్టి ఇప్పటివరకు సుమారు రూ.10 లక్షలు ఖర్చు చేశారు. అయినప్పటికీ ఆమె పూర్తిగా కోలుకోవాలంటే అత్యవసరంగా శస్త్రచికిత్స చేయాల్సి ఉందని వైద్యులు తెలిపారు. ఆపరేషన్ కోసం మరో రూ.15 లక్షలు అవసరమని చెప్పడంతో కుటుంబం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో పడింది. ప్రస్తుతం ఆసుపత్రి మంచంపై కదలలేని స్థితిలో ఉన్న చెల్లెల్ని చూసి ఆమె సోదరుడు కోర్ని ప్రశాంత్ (పవన్) కన్నీళ్లు ఆపుకోలేకపోతున్నాడు. "మా చెల్లి మళ్లీ నడవాలి..., మాతో మాట్లాడాలి..., ఆమె ప్రాణాలు కాపాడటానికి దయచేసి దాతలు ముందుకు వచ్చి సహాయం చేయండి" అంటూ అతను కన్నీటి స్వరంతో వేడుకుంటున్నాడు. పేదరికం ఒక వైపు..., ప్రాణం కోసం పోరాడుతున్న చెల్లెలు మరో వైపు..., ఈ క్లిష్ట పరిస్థితిలో కుటుంబం దయా మయుల సహాయం కోసం ఎదురుచూస్తోంది. మనం అందరం కలిసికట్టుగా చేయి అందిస్తే ఒక యువతి జీవితం మళ్లీ నిలబడే అవకాశం ఉంది. సహాయం చేయాలనుకునే వారు సంప్రదించవలసిన ఫోన్ నంబర్: 81212 99382

# పోలీస్ శాఖలో కృత్రిమ మేధ అవసరం

**మంత్రి శ్రీధర్ బాబు**



**రాజేంద్రనగర్, విశాలభారతి:** రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు పోలీసు శాఖ ఆధునిక సాంకేతికతను, ముఖ్యంగా కృత్రిమ మేధను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. గండిపేట మండలం బండ్లగూడలోని తెలంగాణ పోలీస్ అకాడమీలో నిర్వహించిన తెలంగాణ పోలీస్ రిట్రీట్ -2026 కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా నేరాల పరిశోధనలో ఆధునిక సాంకేతికతను ఉపయోగించడం అవసరమని చెప్పారు. తాను మొదటిసారి శాసనసభ్యుడిగా ఎన్నికైన సమయంలో రాష్ట్రంలో తీవ్రవాదం ఎక్కువగా ఉండేదని గుర్తుచేశారు. పోలీసు అధికారుల కృషి, త్యాగాల వల్ల నేడు తీవ్రవాదం పూర్తిగా తగ్గిందని పేర్కొన్నారు. సెలవులు లేకుండా విధులు నిర్వహిస్తూ ప్రాణత్యాగం చేసిన పోలీసు సిబ్బంది సేవలను ఆయన కొనియాడారు. భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనేందుకు పోలీసింగ్ వ్యవస్థను సిద్ధం చేయడమే ఈ రిట్రీట్ ప్రధాన లక్ష్యమని మంత్రి తెలిపారు. పోలీసు అధికారులు తమ విధి నిర్వహణలో ప్రజలకు నిజంగా న్యాయం చేస్తున్నామా లేదా అన్న విషయంపై స్వీయ సమీక్ష చేసుకోవాలని సూచించారు. ప్రజల్లో విశ్వాసం పెరిగినప్పుడే శాంతిభద్రతల వ్యవస్థకు మరింత గుర్తింపు వస్తుందని అన్నారు. డీజీపీ శివధర్ రెడ్డి మాట్లాడుతూ రిట్రీట్‌లో జరిగే చర్చలు వాస్తవ పరిస్థితులకు దగ్గరగా ఉండాలని సూచించారు. అధికారులు ఓపెన్ ఫోరంలో తమ అభిప్రాయాలను నిర్భయంగా వ్యక్తపరచి వాటిని అమలు చేయాలని కోరారు. మాజీ డీజీపీ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పోలీసు సిబ్బంది నియామకం ఎప్పుడూ సాధ్యం కాదని చెప్పారు. అందుబాటులో ఉన్న వనరులతో పనితీరును ఎలా మెరుగుపరుచుకోవాలో ఆలోచించాలని సూచించారు. ప్రస్తుతం దేశంలోనే తెలంగాణ పోలీస్ అగ్రస్థానంలో ఉందని, ఆ స్థానాన్ని నిలబెట్టుకోవాలని అన్నారు. మరో మాజీ డీజీపీ హెచ్.జె. దొర అధికారులు తమ అనుభవాలను ఉపయోగించి శాంతిభద్రతల పరిరక్షణలో మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు.

# వాసవీ పారాయణ గీతం ఆవిష్కరించిన మంత్రి కొండా సురేఖ



**హైదరాబాద్, విశాలభారతి:**

ఈనెల 22న తెలంగాణ ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్ పర్సన్ కల్వ సుజాత గుప్తా ఆధ్వర్యంలో తలపెట్టిన శ్రీ వాసవి మహాశక్తి మహోత్సవంలో పాడనున్న వాసవీ మాత పారాయణ గీతాన్ని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదివారం ఆవిష్కరించారు. ఈ గీతాన్ని డాక్టర్ చింతల శ్రీనివాస్ రచించగా గాయని కల్పన స్వరపరిచి, ఆలపించారు. హైదరాబాద్ ఎల్ బీ స్టేడియంలో 30 వేల మందికి పైగా ఆర్యవైశ్యులు దీనిని సామూహికంగా పారాయణం చేస్తారని కల్వ సుజాత మంత్రి సురేఖకు తెలిపారు. ఇది ప్రపంచ రికార్డు కానుందని ఆమె వెల్లడించారు. ఈ కార్యక్రమం విజయవంతం కావాలని మంత్రి సురేఖ ఆకాంక్షించారు. కల్వ సుజాతను, నిర్వాహకులను అభినందించారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో బెల్లి శ్రీధర్, రమాకాంత్, నాగేశ్వరరావు, సంతోష్, సంపత్, చైతన్య, సాంబశివరావు, రమేష్, దీప్తి, కవిత, నిఖిత, హారిక , కమిటీ సభ్యులు పాల్గొన్నారు.





# డెంటల్ క్లినిక్‌ను ప్రారంభించిన వడ్డేపల్లి రాజేశ్వరరావు



**కూకట్ పల్లి విశాలభారతి:** కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని శాంతినగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన కానమనేని డెంటల్ హాస్పిటల్ ప్రారంభోత్సవ ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు హాజరై రిబ్బన్ కట్ చేసి దంత వైద్యశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజేశ్వరరావు మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన సామాన్య మధ్యతరగతి ప్రజలకు అందుబాటు రుసుములో దంత వైద్య సేవలు అందించడం హర్షించదగ్గ విషయం అన్నారు. ఆధునిక సదుపాయాలతో ప్రారంభమైన కానమనేని డెంటల్ హాస్పిటల్ ద్వారా కూకట్‌పల్లి పరిసర ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. సమాజానికి ఉపయోగపడే ఆరోగ్య సేవలను అందిస్తున్న ఆసుపత్రి యాజమాన్యాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి నిర్వాహకులు, స్థానిక ప్రముఖులు, బిజెపి నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు. వడ్డేపల్లి రాజేశ్వరరావు గారికి హాస్పిటల్ యాజమాన్యం వారు ఘనంగా సన్మానం చేసి, ఆతిథ్యాన్ని అందించారు.

# పాల్వంచ పట్టణ పోలీస్ స్టేషన్‌లో మహిళా దినోత్సవ వేడుకలు

**మహిళా పోలీసుల సేవలు అభినందనీయం.. డీఎస్పీ ఆర్ సతీష్ కుమార్**




**పాల్వంచ, విశాలభారతి:** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పాల్వంచ పట్టణ పోలీస్ స్టేషన్ నందు డీఎస్పీ సతీష్ కుమార్ పాల్వంచ సబ్ డివిజన్ పోలీస్ అధికారులతో కలిసి మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా పోలీస్ అధికారులును సిబ్బందిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డీఎస్పీ ఆర్ సతీష్ కుమార్ మాట్లాడుతూ, మహిళల్లో సంకల్పశక్తి ఎక్కువగా ఉంటుందని, వారు ఏ రంగంలోనైనా గొప్ప విజయాలు సాధించగలరని అన్నారు. దేశంలోని అన్ని రంగాల్లో మహిళలు ఉన్నత స్థానాలకు చేరుకుంటూ పురుషులతో సమానంగా రాణిస్తున్నారని పేర్కొన్నారు. మహిళలకు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో హక్కులు ఉన్నాయని తెలిపారు. మహిళా అధికారులు తమ పూర్తి శక్తి, సామర్థ్యాలతో విధులు నిర్వహిస్తూ తమ లక్ష్యాలను సాధించేందుకు నిరంతరం కృషి చేయాలని సూచించారు. పురుషుల కంటే మహిళల్లో నిబద్ధత ఎక్కువగా ఉంటుందని, పలు విభాగాల్లో మహిళా పోలీస్ అధికారులు, సిబ్బంది సమర్థవంతంగా సేవలందిస్తున్నారని తెలిపారు. గృహహింస, వైవాహిక వివాదాల వంటి కేసుల్లో బాధిత మహిళలకు కౌన్సెలింగ్ అందిస్తూ మహిళా పోలీస్ అధికారులు, సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారని అభినందించారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ టౌన్ ఎస్సై తోట నాగరాజు, బూర్గంపాడు ఎస్సై ప్రసాద్, పాల్వంచ రూరల్ ఎస్సై సురేష్, పాల్వంచ టౌన్ ఎస్సై కళ్యాణి ,పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మహిళలను అణగాదొక్కే ఆలోచన జగిత్యాలలో జరుగుతుంది

- అర్ధరాత్రి పార్టీ మారిన చరిత్ర మాకూ లేదు.
- పదవికాలం ఉండగానే రాజీనామా చేసి పార్టీ మారిన
- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డాక్టర్ భోగ శ్రావణి




**విశాలభారతి, జగిత్యాల:**

మహిళలను అణగాదొక్కే ఆలోచన జగిత్యాలలో జరుగుతుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డాక్టర్ భోగ శ్రావణి ఆరోపించారు. భారతీయ జనతా పార్టీ జగిత్యాల నియోజకవర్గ కార్యాలయం కమల నిలయంలో శ్రావణి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రావణి మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అభివృద్ధి కి సహకరించతేలేదని ఆరోపించడం విడ్డురంగా ఉందన్నారు.నియోజకవర్గ పరిధిలో ఉన్న రోళ్ల వాగు ప్రాజెక్ట్ విషయమై ఎంపీ అరవింద్, కేంద్ర మంత్రికి లిఖిత పూర్వకంగా విజ్ఞప్తి చేయగా , కేంద్ర మంత్రి సంబంధిత లేఖ లో పరివేష్ 2.0 పోర్టల్ లో రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి ప్రపోజల్ పెట్టలేదని లిఖిత పూర్వకంగా తెలిపారన్నారు. నగర్ వాన్ యోజనా కింద ఎంపీ అర్వింద్ జగిత్యాల నియోజకవర్గనికి 2కోట్లు మంజూరు చేపించగా , మొదటి విడత 1.4 కోట్లు విడుదల అయ్యేయని, దానికి సంబంధిత ఖర్చు వివరాలు కేంద్ర ప్రభుత్వంకు రాష్ట్ర ప్రభుత్వం సమర్పించలేక పోవడం వల్ల మిగిలిన 60లక్షలు విడుదల కాలేదనే విషయాన్ని స్వయంగా కేంద్ర మంత్రి భూపేందర్ లిఖిత పూర్వకంగా పేర్కొనడం జరిగిందన్నారు. జగిత్యాల పట్టణ ప్రజల చిరకాల కోరిక యావర్ రోడ్ విస్తరణను ఎందుకు చేయలేకపోతున్నారని శ్రావణి ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ను సూటిగా ప్రశ్నించారు. ప్రధానమంత్రి విద్యార్హత గురించి స్థానిక ఎమ్మెల్యే మాట్లాడ్డం ఏమిటని, మోడీ పేరు ఉచ్చరించే అర్హత ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కు ఉందా అని శ్రావణి నీలాదీశారు. ప్రపంచ దేశాలే మోడీ ని విశ్వ గురువుగా కీర్తిస్తున్నాయనే విషయాన్ని ఎమ్మెల్యే గుర్తేరూగాలని సూచించారు. కేంద్రియ విద్యాలయం రాకతో ఆ ప్రాంతం అభివృద్ధి చెందడంతో పాటు, సెంట్రల్ సిలబస్ లో నాణ్యమైన విద్య విద్యార్థులకు అందుతుందని, అంతటి గొప్ప విద్యాలయం కు ఏమ్మెల్యే ఎందుకు అడ్డుపడ్తున్నారో అర్థం కావడం లేదన్నారు. 10 ఎకరాల స్థలం ఎందుకు ఇవ్వలేకపోతున్నారని ప్రశ్నించారు. మామిడి మార్కెట్ కు 25ఎకరాల స్థలం ఇచ్చిన మీరు కేంద్ర విద్యాలయం కు ఎందుకు ఇవ్వలేకపోతున్నారనే ఆరోపణలపై ఎమ్మెల్యే సంజయ్ కుమార్ సమాధానం ఇవ్వాలని శ్రావణి డిమాండ్ చేశారు. అభివృద్ధి కోసం అందరి కలుస్తానని మాట్లాడుతున్న సంజయ్ కుమార్, ఆనాడు తాను మున్సిపల్ ఛైర్ పర్సన్ గా ఉన్నపుడు ఎవరితో మాట్లాడినా మీరు తట్టుకోలేకపోయారని శ్రావణి ప్రశ్నించారు. మిమ్మలిని రాజకీయాల్లోకి తీసుకువచ్చిన కవిత జైలులో ఉంటే, కనీసం కలవకుండా రాత్రి కి రాత్రి దొంగ లాగా వెళ్ళి పార్టీ మారింది మీరు కాదా అని,తన పదవికి రాజీనామా చేసిన నెల తరువాత, అధికార పార్టీని రెండేళ్ల పదవీకాలం వదులుకొని తాను పార్టీ మారాన న్నారు. ఎమ్మెల్యే లాగా అధికారం కోసం ఒక పార్టీలో గెలిచి, అర్ధరాత్రి మరో పార్టీలోకి మారలేదని స్పష్టం చేశారు. సొంత పనులు, పెండింగ్ బిల్లుల మంజూరు కోసమే మంత్రులు, సీఎం ను ఎమ్మెల్యే కలుస్తున్నారని శ్రావణి విమర్శించారు. అభివృద్ధి, సంక్షేమమే ఎజెండాగా బీజేపీ ముందుకు వెళ్తుందని, ఆదే బాటలో ప్రజల ఆశీర్వాదంతో తాను ముందుకు వెళ్తున్నానని స్పష్టం చేశారు. ఈ సమావేశం లో కౌన్సిలర్లు వేముల శ్రీనివాస్, నిమ్మల నాగరాజు, గట్టిపెల్లి మానసజ్ఞానేశ్వర్,పట్టణ ప్రధాన కార్యదర్శిలు ఆముదరాజు, సిరికొండ రాజన్న,ఇట్యాల రాము,పవన్ సింగ్,రవితేజ, కాశెట్టి తిరుపతి, కడార్ల లావణ్య,సింగం పద్మ, మామిడాల కవిత, బద్దల గంగరాజు తదితరులున్నారు.

# నవ వధూవరులను ఆశీర్వదించిన రేగా కాంతారావు

**విశాలభారతి, భద్రాద్రి కొత్తగూడెం:** జిల్లా కరకగూడెం మండలం. బట్టుపల్లి గ్రామానికి చెందిన. గిరిశెట్టి ఉమాశంకర్ అమూర్త కుమార్తె దివ్య. పెళ్లి వేడుకల్లో పాల్గొని అక్షింతలు వేసి ఆశీర్వదించిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు శ్రీ రేగా కాంతారావు.






# విశ్వవిజేతగా భారత్

మొదటిపేజీ తరువాయి

మధ్య ఓవర్లలో టిమ్ సీఫెర్ట్ కాసేపు భారత బౌలర్లను ఎదిరించే ప్రయత్నం చేశాడు. వేగంగా ఆడుతూ అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్న సీఫెర్ట్, భారత అభిమానుల్లో చిన్న ఆందోళన కలిగించాడు. అయితే హార్దిక్ పాండ్య తన అద్భుతమైన డెలివరీతో చాప్‌మన్‌ను బోల్తా కొట్టించాడు. ఆ తర్వాతి ఓవర్లోనే వరుణ్ చక్రవర్తి తన మాయాజాలాన్ని ప్రదర్శించాడు. హాఫ్ సెంచరీతో జోరు మీదున్న సీఫెర్ట్‌ను భారీ షాట్‌కు ఉసిగొల్పి క్యాచ్ అవుట్ చేశాడు. సీఫెర్ట్ అవుట్ కావడంతో కివీస్ ఆశలు దాదాపు ఆవిరయ్యాయి. 72 పరుగులకే 5 వికెట్లు కోల్పోయిన స్థితిలో కివీస్ ఓటమి ఖాయమని అర్థమైపోయింది.

మిడిల్ ఆర్డర్‌లో డారిల్ మిచెల్, మిచెల్ శాంట్నర్ జంట వికెట్ల పతనాన్ని అడ్డుకునే ప్రయత్నం చేశారు. వీరిద్దరూ ఆచితూచి ఆడుతూ 50 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. భారత్ విజయాన్ని కాసేపు ఆలస్యం చేసినా, అక్షర్ పటేల్ మళ్ళీ రంగంలోకి దిగి మిచెల్‌ను అవుట్ చేయడంతో ఆ జోడీ విడిపోయింది. అప్పటికి స్కోరు 124 పరుగులు మాత్రమే. లక్ష్యం ఇంకా వంద పరుగులకు పైగా ఉండటంతో భారత్ సంబరాలు అప్పటికే మొదలైపోయాయి. ప్రేక్షకుల ఈలలు, కేకలతో స్టేడియం మారుమోగిపోయింది.

చివర్లో జస్ప్రీత్ బుమ్రా తన యార్కర్ల పదును చూపించాడు. 16వ ఓవర్లో బుమ్రా వరుస బంతుల్లో జిమ్మీ నీషమ్, మ్యాట్ హెన్రీలను అవుట్ చేయడంతో కివీస్ కథ ముగిసింది. అద్భుతమైన లైన్ అండ్ లెంగ్త్‌తో బౌలింగ్ చేసిన బుమ్రా, ప్రత్యర్థి బ్యాటర్లకు ఏమాత్రం అవకాశం ఇవ్వలేదు. చివరికి 19 ఓవర్లలో 159 పరుగులకే న్యూజిలాండ్ ఆలౌట్ కావడంతో భారత్ 96 పరుగుల భారీ తేడాతో చారిత్రాత్మక విజయాన్ని నమోదు చేసింది. అక్షర్ పటేల్ రెండు వికెట్లు తీయగా, బుమ్రా, హార్దిక్, వరుణ్ తలో వికెట్ పడగొట్టి విజయానికి బాటలు వేశారు.

ఈ విజయం భారత క్రికెట్ చరిత్రలో ఒక సువర్ణ అధ్యాయం. టీ20 ప్రపంచకప్ 19 ఏళ్ల చరిత్రలో ఏ కెప్టెన్‌కూ సాధ్యం కాని రికార్డును సూర్యకుమార్ యాదవ్ తన ఖాతాలో వేసుకున్నాడు. సొంతగడ్డపై వరల్డ్ కప్ నెగ్గిన తొలి టీ20 కెప్టెన్‌గా సూర్య చరిత్ర సృష్టించాడు. సాధారణంగా సొంత ప్రేక్షకుల మధ్య ఆడేటప్పుడు ఉండే ఒత్తిడిని అధిగమించి, జట్టును సమర్థవంతంగా నడిపించిన సూర్య నాయకత్వ పటిమపై ప్రశంసల జల్లు కురుస్తోంది. ఇదివరకు ఎంఎస్ ధోనీ, రోహిత్ శర్మ విదేశీ గడ్డలపై టైటిళ్లు అందించగా, సూర్య మాత్రం భారత్ గడ్డపై ఈ అరుదైన ఫీట్ సాధించాడు.

వరుసగా రెండుసార్లు టీ20 ప్రపంచకప్ గెలిచిన తొలి జట్టుగా భారత్ గ్లోబల్ క్రికెట్‌లో తన ముద్ర వేసింది. 2024లో వెస్టిండీస్ వేదికగా జరిగిన టోర్నీలో విజేతగా నిలిచిన టీమ్ఇండియా, ఇప్పుడు 2026లో మరోసారి ఛాంపియన్‌గా నిలిచింది. గతంలో వెస్టిండీస్, ఇంగ్లాండ్ జట్లు రెండేసిసార్లు కప్ గెలిచినప్పటికీ, వరుస ఎడిషన్లలో గెలిచిన ఘనత మాత్రం ఏ జట్టుకూ దక్కలేదు. భారత్ తన అజేయమైన ఆటతీరుతో ఆ రికార్డును తిరగరాసింది. ఇది భారత్ సాధించిన మూడో టీ20 వరల్డ్ కప్ టైటిల్ కావడంతో, అత్యధిక టైటిళ్లు గెలిచిన జట్టుగానూ భారత్ అగ్రస్థానానికి చేరుకుంది.

భారత జట్టు సాధించిన ఈ విజయం వెనుక ఆటగాళ్ల అంకితభావం, పట్టుదల కనిపిస్తోంది. సీనియర్లు, జూనియర్ల కలయికతో టీమ్ఇండియా ఒక పక్కా ప్లానింగ్‌తో టోర్నీ అంతటా రాణించింది. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్.. ఇలా ప్రతి విభాగంలోనూ భారత్ ప్రపంచ స్థాయి ప్రమాణాలను ప్రదర్శించింది. ముఖ్యంగా కీలకమైన ఫైనల్ మ్యాచ్‌లో ఒత్తిడికి లొంగకుండా ఆడి, భారీ స్కోరు సాధించడమే కాకుండా బౌలింగ్‌లోనూ కివీస్‌ను ముప్పుతిప్పలు పెట్టింది. ఈ విజయం భారత క్రికెట్ భవిష్యత్తుకు మరిన్ని వెలుగులు నింపుతుందనడంలో సందేహం లేదు. అహ్మదాబాద్ వీధులన్నీ ఇప్పుడు త్రివర్ణ పతాకాలతో నిండిపోయాయి. రాత్రంతా బాణసంచా కాలుస్తూ అభిమానులు పండగ చేసుకుంటున్నారు. టీమ్ఇండియా సాధించిన ఈ ఘనత కేవలం ఒక ఆట విజయం మాత్రమే కాదు, కోట్లాది మంది భారతీయుల కల. కివీస్ లాంటి బలమైన జట్టును అంత తక్కువ స్కోరుకే కట్టడి చేయడం అంటే భారత బౌలింగ్ విభాగం ఎంత పటిష్టంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. బుమ్రా వేగం, అక్షర్ తెలివితేటలు కలిసి భారత్‌ను విశ్వవిజేతగా నిలబెట్టాయి. ఈ టోర్నీలో భారత్ ప్రయాణం ఎంతో స్ఫూర్తిదాయకంగా సాగింది. గ్రూప్ దశ నుంచి ఫైనల్ వరకు ఓటమి అనేది లేకుండా అజేయంగా దూసుకురావడం టీమ్ఇండియా ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. కెప్టెన్‌గా సూర్యకుమార్ యాదవ్ తీసుకున్న నిర్ణయాలు, ఫీల్డ్ ప్లేస్‌మెంట్స్ మ్యాచ్ గమనాన్ని మార్చేశాయి. ఫైనల్ మ్యాచ్‌లో కూడా సూర్య ప్రశాంతంగా ఉంటూ జట్టును నడిపించిన తీరు విశేషం. ప్రపంచ క్రికెట్‌లో భారత్ ఇప్పుడు తిరుగులేని శక్తిగా ఎదిగిందని ఈ విజయం నిరూపించింది. క్రికెట్ ప్రపంచంలో భారత్ ఇప్పుడు ఒక అగ్రరాజ్యం. వరుస విజయాలతో ప్రత్యర్థులకు వణుకు పుట్టిస్తోంది. గతంలో 2007లో మొదలైన ఈ జైత్రయాత్ర, 2024 మీదుగా 2026 వరకు సాగుతూనే ఉంది. ప్రతి ఎడిషన్‌లోనూ కొత్త హీరోలు పుట్టుకొస్తూ భారత్‌కు విజయాలు అందిస్తున్నారు. ఈసారి అక్షర్ పటేల్ ఆల్ రౌండ్ ప్రదర్శన, బుమ్రా యార్కర్లు హైలైట్‌గా నిలిచాయి. టీమ్ఇండియా సాధించిన ఈ విజయం దేశవ్యాప్తంగా క్రీడా స్ఫూర్తిని రగిలిస్తోంది. ఆట ముగిసిన తర్వాత మైదానంలో ఆటగాళ్లు చేసిన సంబరాలు కళ్లకు కట్టినట్లు ఉన్నాయి. జాతీయ జెండాను చేతబూని మైదానం చుట్టూ ఆటగాళ్లు తిరుగుతుంటే ప్రేక్షకుల కేరింతలు మిన్నంటాయి. ఈ చారిత్రాత్మక విజయం గురించి రాబోయే తరాలు గొప్పగా చెప్పుకుంటాయి. సొంత గడ్డపై, తమ కళ్ల ముందే భారత్ ప్రపంచకప్‌ను ముద్దాడటం చూసిన అభిమానుల ఆనందానికి అవధులు లేవు. క్రికెట్ అంటే కేవలం ఒక ఆట మాత్రమే కాదు, అది ఒక ఎమోషన్ అని భారతీయులు మరోసారి చాటారు. బీసీసీఐ కూడా జట్టు విజయంపై హర్షం వ్యక్తం చేసింది. ఆటగాళ్లకు భారీ నజరానాలను ప్రకటించే అవకాశం ఉంది. ఈ విజయం వల్ల భారత్‌లో క్రికెట్ క్రేజ్ మరింత పెరగడమే కాకుండా, యువ క్రీడాకారులకు గొప్ప ప్రేరణగా నిలుస్తుంది. టీ20 ఫార్మాట్‌లో భారత్ సాధించిన ఈ వరుస విజయాలు, మన జట్టు ఎంతటి ప్రతిభావంతులతో నిండి ఉందో ప్రపంచానికి తెలియజేశాయి. భారత్ ఇప్పుడు 'వరల్డ్ ఛాంపియన్స్' అన్న గర్వంతో తలెత్తుకుని నిలబడింది. విశ్వ విజేతగా నిలిచిన టీమ్ఇండియాకు దేశవ్యాప్తంగా అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధాని నుంచి సామాన్యుల వరకు అందరూ సోషల్ మీడియా వేదికగా భారత జట్టును కొనియాడుతున్నారు. ఈ విజయం అందించిన ఉత్సాహం మరికొన్నేళ్ల పాటు భారత క్రికెట్‌ను నడిపిస్తుంది. అహ్మదాబాద్ గడ్డపై లిఖించిన ఈ చరిత్ర చిరస్థాయిగా నిలిచిపోతుంది. వరుసగా రెండుసార్లు విజేతగా నిలిచి, హ్యాట్రిక్ దిశగా భారత్ అడుగులు వేయాలని కోరుకుందాం.

## సింహంలా గర్జించిన సంజూ

అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం సాక్షిగా ఆదివారం జరిగిన టీ20 వరల్డ్ కప్ 2026 ఫైనల్ పోరులో భారత స్టార్ బ్యాటర్ సంజూ శాంసన్ ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. కివీస్ బౌలర్లను ముప్పుతిప్పలు పెడుతూ కేవలం 46 బంతుల్లోనే 89 పరుగులు సాధించి, భారత క్రికెట్ చరిత్రలో ఒకే ఎడిషన్‌లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా అగ్రస్థానానికి దూసుకెళ్లాడు. ఇన్నాళ్లు రన్ మెషీన్ విరాట్ కోహ్లీ పేరిట ఉన్న పాత రికార్డులను తుడిచిపెట్టేస్తూ, సంజూ సృష్టించిన ఈ విధ్వంసం ఇప్పుడు నెట్టింట ట్రెండింగ్‌గా మారింది. తన అద్భుతమైన టైమింగ్, పవర్‌ఫుల్ షాట్లతో మైదానాన్ని హోరెత్తించిన శాంసన్, టీమిండియాకు తిరుగులేని స్కోరును అందించడంలో కీలక పాత్ర పోషించాడు. గతంలో 2014 టీ20 ప్రపంచకప్‌లో విరాట్ కోహ్లీ 319 పరుగులు చేసి సృష్టించిన రికార్డును సంజూ అధిగమించడం విశేషం. తాజా ఇన్నింగ్స్‌తో తన మొత్తం పరుగుల సంఖ్యను 321కి చేర్చిన ఈ కేరళ స్టార్, కోహ్లీ కంటే రెండు పరుగులు అదనంగా సాధించి ఈ ఘనతను సొంతం చేసుకున్నాడు. అయితే ఈ రికార్డును సంజూ కేవలం ఐదు ఇన్నింగ్స్‌ల్లోనే అందుకోవడం చూస్తుంటే అతని బ్యాటింగ్ ఎంతటి ఉగ్రరూపం దాల్చిందో అర్థం చేసుకోవచ్చు. సంప్రదాయ బ్యాటింగ్‌కు ఆధునిక హంగులు అద్ది, ప్రతి బంతిని బౌండరీ దాటించడమే లక్ష్యంగా సాగిన అతని ఇన్నింగ్స్ భారత అభిమానులను ఉర్రూతలూగించింది.

నిజానికి ఈ టోర్నీ ఆరంభంలో సంజూ తుది జట్టులో లేకపోవడం గమనార్హం. కేవలం లక్ కలిసి రావడం కంటే, వచ్చిన అవకాశాన్ని అందిపుచ్చుకోవడంలోనే తన అసలు సిసలు ప్రతిభను చూపాడు. అభిషేక్ శర్మ అనారోగ్యం కారణంగా నమీబియాతో జరిగిన మ్యాచ్‌లో జట్టులోకి వచ్చిన సంజూ, ఆ తర్వాత తన బ్యాటింగ్ పొజిషన్‌ను మార్చుకుని ఓపెనర్‌గా బరిలోకి దిగాడు. మేనేజ్మెంట్ నమ్మకాన్ని వంద శాతం నిలబెడుతూ జింబాబ్వేపై మెరుపులు మెరిపించడమే కాకుండా, క్వార్టర్ ఫైనల్‌లో వెస్టిండీస్‌పై అజేయంగా 97 పరుగులు చేసి అందరి దృష్టిని ఆకర్షించాడు. ఇక సెమీఫైనల్‌లో ఇంగ్లాండ్‌పై, ఇప్పుడు ఫైనల్‌లో న్యూజిలాండ్‌పై వరుసగా 89 పరుగుల చొప్పున బాది తన ఫామ్‌ను నిలబెట్టుకున్నాడు.

సాంకేతికంగా చూస్తే సంజూ శాంసన్ నమోదు చేసిన స్ట్రైక్ రేట్ (199.37) ఇప్పుడు ప్రపంచ రికార్డుగా నిలిచింది. ఒకే వరల్డ్ కప్ ఎడిషన్‌లో కనీసం 250 పరుగులు చేసిన బ్యాటర్లలో ఇంతటి భారీ స్ట్రైక్ రేట్‌తో పరుగులు సాధించిన వారు మరెవ్వరూ లేరు. బంతిని బాదడంలో వేగం, పరుగుల వేటలో నిలకడ రెండింటినీ సమన్వయం చేస్తూ శాంసన్ సాగించిన ప్రయాణం అద్భుతం. ఇదే క్రమంలో పాకిస్థాన్ ఓపెనర్ సాహిబ్‌జాదా ఫర్హాన్ 383 పరుగులతో టాప్ స్కోరర్‌గా ఉన్నప్పటికీ, సంజూ కంటే అతను ఒక ఇన్నింగ్స్ అదనంగా ఆడటం గమనార్హం. భారత యువ సంచలనం ఇషాన్ కిషన్ కూడా 317 పరుగులతో ఈ జాబితాలో ఐదో స్థానంలో నిలిచి తన సత్తా చాటుకున్నాడు. శాంసన్ ఆడిన ఈ మెరుపు ఇన్నింగ్స్ కేవలం రికార్డుల కోసమే కాకుండా, టీమిండియా విజయానికి బలమైన పునాదిగా మారింది. సెంచరీ చేసే అవకాశాన్ని తృటిలో కోల్పోయినా, మైదానంలో అతను సృష్టించిన అలజడి కివీస్ జట్టు ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసింది. కోహ్లీ వంటి దిగ్గజాల రికార్డులను సమం చేయడమే కాకుండా, ఈ తరం యువ క్రికెటర్లకు సరికొత్త స్ఫూర్తిని నింపాడు. సంజూ శాంసన్ చూపిన ఈ అగ్రెసివ్ బ్యాటింగ్ శైలి, భారత క్రికెట్ భవిష్యత్తుపై అభిమానుల్లో భారీ ఆశలను రేకెత్తిస్తోంది. మరిన్ని రికార్డులు వేటాడుతూ, జట్టుకు విజయాలను అందిస్తూ సంజూ తన ప్రైమ్ ఫామ్‌ను కొనసాగించాలని క్రికెట్ ప్రపంచం ఆకాంక్షిస్తోంది.




## అభిషేక్ ఊచకోత

విమర్శలు ఎదురైనప్పుడే విశ్వరూపం చూపించడం కొందరికి అలవాటు. సరిగ్గా అదే బాటలో పయనిస్తూ, టీ20 వరల్డ్ కప్ నాకౌట్ పోరులో టీమిండియా యువ ఓపెనర్ అభిషేక్ శర్మ సృష్టించిన విధ్వంసం క్రికెట్ ప్రపంచాన్ని నివ్వెరపరిచింది. టోర్నీ ఆరంభానికి ముందు నంబర్ 1 ర్యాంక్ బ్యాటర్‌గా బరిలోకి దిగినప్పటికీ, గత ఏడు ఇన్నింగ్స్‌ల్లో కేవలం 89 పరుగులు మాత్రమే చేసి తీవ్ర విమర్శల పాలైన ఈ పంజాబ్ సంచలనం, కీలకమైన సమయంలో తన బ్యాట్‌తోనే విమర్శకుల నోళ్లు మూయించాడు. సునీల్ గవాస్కర్, సంజయ్ మంజ్రేకర్ వంటి దిగ్గజాలు సైతం జట్టు నుంచి తప్పించాలని సూచించినా, హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ ఉంచిన నమ్మకాన్ని అభిషేక్ వందకు వంద శాతం నిలబెట్టుకున్నాడు. 2024 వరల్డ్ కప్ ఫైనల్‌లో విరాట్ కోహ్లీ ఎలాగైతే తన అనుభవాన్నంతా రంగరించి జట్టును ఆదుకున్నారో, సరిగ్గా అలాగే ఈ యువ కెరటం కూడా విశ్వవేదికపై తన ముద్ర వేసింది. న్యూజిలాండ్ వ్యూహకర్తలు చేసిన ఒక చిన్న పొరపాటును అభిషేక్ తనకు అనుకూలంగా మార్చుకున్న తీరు అద్భుతం. అభిషేక్‌కు ఆఫ్ స్పిన్ అంటే ఇబ్బంది అని తెలిసినా, కివీస్ జట్టు స్పెషలిస్ట్ ఆఫ్ స్పిన్నర్






కోల్ మెక్కాన్చీని పక్కన పెట్టి భారీ మూల్యం చెల్లించుకుంది. పార్ట్ టైమ్ ఆఫ్ స్పిన్నర్ గ్లెన్ ఫిలిప్స్ బౌలింగ్‌లో తొలుత ఆచితూచి ఆడిన అభిషేక్, కివీస్ బౌలర్ల లయ తప్పగానే విరుచుకుపడ్డారు. ఒక్కసారి గేర్ మార్చిన తర్వాత మైదానంలో పరుగుల వరద పారింది. కివీస్ పేసర్ల బౌలింగ్‌ను చీల్చి చెండాడుతూ, కేవలం 18 బంతుల్లోనే 50 పరుగులు (6 ఫోర్లు, 3 సిక్సర్లు) పూర్తి చేసి టీ20 వరల్డ్ కప్ నాకౌట్ చరిత్రలోనే అత్యంత వేగవంతమైన హాఫ్ సెంచరీని తన పేరిట లిఖించుకున్నారు. ఈ అద్భుత ఇన్నింగ్స్‌తో తన మెంటర్ యువరాజ్ సింగ్ పేరిట ఉన్న 2007 నాటి రికార్డును సైతం అధిగమించడం విశేషం. ఈ మ్యాచ్‌లో అభిషేక్ విధ్వంసం కేవలం ఒక రికార్డుకే పరిమితం కాలేదు; అది ప్రత్యర్థి జట్టు ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసేలా సాగింది. టోర్నీ సెమీఫైనల్స్‌లో జాకబ్ బెథెల్, ఫిన్ అలెన్ నెలకొల్పిన 19 బంతుల రికార్డును కేవలం నిమిషాల వ్యవధిలో తుడిచిపెట్టేసి, భారత బ్యాటింగ్ సత్తాను చాటారు. ఒకవైపు విమర్శకులు "అతను పనికిరాడు" అని తేల్చిచెప్పిన వేళ, క్రీజులోకి వెళ్ళిన ప్రతి బంతినీ బౌండరీకి పంపిస్తూ తనలోని అసలైన పోరాట పటిమను ప్రదర్శించారు. ఇది కేవలం పరుగుల వేట మాత్రమే కాదు, తన సామర్థ్యంపై నమ్మకం ఉంచిన మేనేజ్‌మెంట్‌కు అతను ఇచ్చిన గొప్ప కానుక. యువరాజ్ సింగ్ మార్గదర్శకత్వంలో రాటుదేలిన ఈ యువ ఆటగాడు, ఒత్తిడిని ఎలా జయించాలో మరోసారి నిరూపించి క్రికెట్ ప్రేమికుల మనసు గెలుచుకున్నారు.

మరోవైపు అభిషేక్ శర్మ మెరుపులకు సంజూ శాంసన్ క్లాసిక్ టచ్ కూడా తోడవడంతో టీమిండియా స్కోరు బోర్డు రాకెట్ వేగంతో దూసుకెళ్లింది. ఈ ఇద్దరి జోరు చూస్తుంటే కివీస్ బౌలర్లకు ఎక్కడ బౌలింగ్ చేయాలో పాలుపోలేదు. భారత ఓపెనర్లు పవర్ ప్లే ముగిసేసరికి ఏకంగా 92 పరుగులు రాబట్టి, టీ20 వరల్డ్ కప్ చరిత్రలో ఏ జట్టుకైనా మొదటి ఆరు ఓవర్లలో ఇదే అత్యధిక స్కోరుగా సరికొత్త రికార్డును నెలకొల్పారు. ఒకప్పుడు పవర్ ప్లే అంటే వికెట్లు కాపాడుకోవడమే లక్ష్యంగా ఉండేది, కానీ నేటి తరం బ్యాటర్లు మొదటి బంతి నుంచే ప్రత్యర్థిపై ఆధిపత్యం చెలాయించే 'అటాకింగ్' గేమ్‌ను అలవర్చుకున్నారని ఈ స్కోరు నిరూపించింది. సంజూ శాంసన్ సహకారంతో అభిషేక్ ఆడిన ఈ ఇన్నింగ్స్ భారత ఇన్నింగ్స్‌కు ఒక దృఢమైన పునాదిని వేసింది.

## బుమ్రా 'బూమ్ బూమ్' మ్యాజిక్

మైదానంలో బంతి పడితే చాలు.. వికెట్లు గాలిలో ఎగరాల్సిందే! టీ20 ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్‌లో టీమిండియా స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా మరోసారి తన క్లాస్ ఏంటో చూపించాడు. ప్రత్యర్థి జట్టు బ్యాటర్లకు చుక్కలు చూపిస్తూ, తన అద్భుతమైన బౌలింగ్‌తో మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. కీలక సమయంలో బుమ్రా వేసిన స్పెల్ భారత్‌ను మళ్ళీ విశ్వవిజేతగా నిలబెట్టింది. కోట్ల మంది భారతీయుల కల నెరవేరిన వేళ, బుమ్రా ఆ విజయానికి ఒక బ్రాండ్ అంబాసిడర్‌లా నిలిచాడు. మ్యాచ్ ఆద్యంతం ఉత్కంఠగా సాగుతున్న వేళ, 16వ ఓవర్ భారత అభిమానుల గుండెల్లో ధైర్యాన్ని నింపింది. అప్పటికే ప్రమాదకరంగా మారుతున్న కివీస్ బ్యాటర్లను బుమ్రా తన పదునైన యార్కర్లతో కట్టడి చేశాడు. ఆ ఓవర్లో బుమ్రా వేసిన మ్యాజిక్ డెలివరీలకు జేమ్స్ నీషమ్ (8), మాట్ హెన్రీ (0) ఒక్కసారిగా బిత్తరపోయారు. బ్యాక్ టు బ్యాక్ వికెట్లు తీసి క్లీన్ బౌల్డ్ చేయడంతో స్టేడియం మొత్తం 'బూమ్ బూమ్ బుమ్రా' నామస్మరణతో మారుమోగిపోయింది. బుమ్రా వేసిన ప్రతి బంతి ఒక బుల్లెట్‌లా దూసుకుపోతూ ప్రత్యర్థి బ్యాటర్ల డిఫెన్స్‌ను ఛిన్నాభిన్నం చేసింది. ముఖ్యంగా ఆ క్లీన్ బౌల్డ్ విజువల్స్ చూస్తుంటే ఈ జనరేషన్ ఫ్యాన్స్‌కు ఫుల్ కిక్ ఇచ్చాయనే చెప్పాలి. మొత్తం 4 వికెట్లతో బుమ్రా చేసిన విధ్వంసం మ్యాచ్ ఫలితాన్ని తారుమారు చేసింది. ఒత్తిడిలో కూడా ప్రశాంతంగా ఉంటూ వికెట్లు పడగొట్టడం బుమ్రాకు మాత్రమే సాధ్యమని అతను మరోసారి నిరూపించుకున్నాడు.

ఈ విజయం కేవలం ఒక ట్రోఫీ మాత్రమే కాదు, టీమిండియా ఆధిపత్యానికి నిదర్శనం. బుమ్రా లాంటి వరల్డ్ క్లాస్ బౌలర్ మన జట్టులో ఉండటం భారత్‌కు దక్కిన అతిపెద్ద అదృష్టం. క్లిష్ట పరిస్థితుల్లో కూడా పట్టు వదలకుండా పోరాడి, విజయాన్ని మన ఖాతాలో వేసిన బుమ్రా ఆటతీరును చూసి క్రికెట్ దిగ్గజాలు సైతం ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు. న్యూజిలాండ్ ఆశలను ఆవిరి చేస్తూ భారత్ కైవసం చేసుకున్న ఈ టైటిల్ చరిత్రలో నిలిచిపోతుంది.






ఒకప్పుడు దేశవ్యాప్తంగా అత్యంత వేగంగా ఎదిగిన రియల్ ఎస్టేట్ మార్కెట్లలో హైదరాబాద్ ముందంజలో నిలిచింది. ఐటీ రంగం విస్తరణ, భారీ మౌలిక వసతుల ప్రాజెక్టులు, విదేశీ పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు పెరగడం వంటి కారణాల వల్ల నగరంలో గృహాల డిమాండ్ భారీగా పెరిగింది. ఫలితంగా గత దశాబ్దంలో హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగం ఊహించని వేగంతో విస్తరించింది. అయితే ప్రస్తుతం పరిస్థితి కొంత మారింది. మార్కెట్లో క్రయవిక్రయాలు మందగించడం, ధరలు భారీగా పెరగడం, రియల్ ఎస్టేట్ మోసాలపై వెలుగులోకి వస్తున్న కేసులు, పెట్టుబడిదారుల్లో పెరిగిన జాగ్రత్త ధోరణి వంటి అంశాలు నగర రియల్ రంగాన్ని సందిగ్ధ పరిస్థితిలోకి నెడుతున్నాయి. గణాంకాలు పరిశీలిస్తే మార్కెట్ పూర్తిగా క్షీణించలేదని, కానీ కొనుగోలు ధోరణిలో మార్పులు చోటుచేసుకున్నాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు. - విశాలభారతి, హైదరాబాద్



# పుట్టుకొస్తున్న రియల్ మోసాలు..

## పడిపోతున్న హైదరాబాద్ రియల్ గ్రాఫ్

### క్రయవిక్రయాల్లో మందగమనం – కొనుగోలుదారుల్లో జాగ్రత్త ధోరణి

### హైఎండ్ ప్రాజెక్టులే మార్కెట్‌కు ఊతమా? సందిగ్ధంలో నగర రియల్ రంగం

**తగ్గుతున్న లావాదేవీలు... పెరుగుతున్న విలువ**

రియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీ సంస్థలు విడుదల చేసిన నివేదికల ప్రకారం హైదరాబాద్‌లో గృహ రిజిస్ట్రేషన్ల సంఖ్య కొంత తగ్గినా మొత్తం లావాదేవీల విలువ మాత్రం పెరిగింది. 2025 సంవత్సరంలో నగరంలో మొత్తం సుమారు 75 వేలకుపైగా గృహ రిజిస్ట్రేషన్లు నమోదయ్యాయి. ఇది గత ఏడాదితో పోలిస్తే స్వల్పంగా తగ్గుదలే అయినప్పటికీ మొత్తం లావాదేవీల విలువ మాత్రం గణనీయంగా పెరిగింది. నగరంలో గృహాల కొనుగోలు, విక్రయాల ద్వారా జరిగిన మొత్తం లావాదేవీలు రూ. 52 వేల కోట్లకు పైగా నమోదైనట్లు మార్కెట్ అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఇది ఒక ముఖ్యమైన ధోరణిని సూచిస్తోంది. మార్కెట్లో లావాదేవీల సంఖ్య తగ్గుతున్నప్పటికీ అధిక విలువ కలిగిన గృహాల విక్రయాలు పెరుగుతున్నాయి.

**హైఎండ్ ప్రాజెక్టులే మార్కెట్‌ను నిలబెడుతున్నాయా?...**

హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో ప్రస్తుతం లగ్జరీ హౌసింగ్ కీలక పాత్ర పోషిస్తోంది. రూ1 కోటి పైబడిన గృహాల కొనుగోళ్లు గతంతో పోలిస్తే పెరిగాయి. గత ఏడాది నమోదైన రిజిస్ట్రేషన్లలో రూ1 కోటి పైబడిన గృహాల వాటా దాదాపు 18 శాతం వరకు చేరినట్లు నివేదికలు చెబుతున్నాయి. ఈ విభాగం మొత్తం లావాదేవీల విలువలో పెద్ద భాగాన్ని కలిగి ఉంది. ప్రత్యేకంగా ఐటీ కారిడార్ పరిధిలోని కొకాపేట్, గచ్చిబౌలి, హైటెక్ సిటీ, నానక్‌రామ్‌గూడ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతాల్లో విల్లాలు, లగ్జరీ అపార్ట్‌మెంట్లకు మంచి డిమాండ్ కొనసాగుతోంది. కొన్ని ప్రీమియం ప్రాజెక్టుల్లో ఫ్లాట్లు రూ.5 కోట్ల నుంచి రూ7 కోట్ల వరకు ధరలకు అమ్ముడవుతున్నాయి. అయితే ఈ డిమాండ్ ప్రధానంగా అధిక ఆదాయం కలిగిన వర్గాలకు మాత్రమే పరిమితమైందని నిపుణులు చెబుతున్నారు.

**మధ్యతరగతి గృహాల అమ్మకాలలో మందగమనం...**

మరోవైపు మధ్యతరగతి కొనుగోలుదారులను లక్ష్యంగా పెట్టుకున్న గృహాల అమ్మకాలలో మందగమనం కనిపిస్తోంది. రూ. 50 లక్షల లోపు గృహాల వాటా గతంలో అధికంగా ఉండగా ఇప్పుడు అది తగ్గుతున్నట్లు మార్కెట్ విశ్లేషణలు సూచిస్తున్నాయి. పెరిగిన నిర్మాణ ఖర్చులు, భూమి ధరలు, బ్యాంకు రుణాలపై అధిక వడ్డీ వంటి కారణాల వల్ల గృహాల ధరలు భారీగా పెరిగాయి. దీంతో మధ్యతరగతి కుటుంబాలు గృహ కొనుగోలు నిర్ణయాలను వాయిదా వేస్తున్నాయి. కొందరు అద్దె గృహాల్లోనే కొనసాగడాన్ని ఎంచుకుంటున్నారు.

**కొన్ని నెలల్లో పడిపోయిన రిజిస్ట్రేషన్లు...**

మార్కెట్‌లో అస్థిరతను సూచించే విధంగా కొన్ని నెలల్లో రిజిస్ట్రేషన్ గణాంకాలు కూడా తగ్గుముఖం పట్టాయి. కొన్ని నెలల్లో నగరంలో ప్రాపర్టీ రిజిస్ట్రేషన్లు గణనీయంగా తగ్గినట్లు గణాంకాలు సూచిస్తున్నాయి. గత ఏడాది ప్రారంభంలో కొన్ని నెలల్లో 15–16 శాతం వరకు తగ్గుదల నమోదైనట్లు నివేదికలు చెబుతున్నాయి. అయితే సంవత్సరం చివర్లో మళ్లీ కొంత పుంజుకోవడం కనిపించింది. దీంతో మార్కెట్ పూర్తిగా క్షీణించలేదని, కానీ స్థిరత్వం లేకుండా మార్పులు జరుగుతున్నాయని నిపుణులు చెబుతున్నారు.

**పుట్టుకొస్తున్న రియల్ మోసాలు...**

ఇటీవలి కాలంలో వెలుగులోకి వస్తున్న రియల్ ఎస్టేట్ మోసాలు కూడా కొనుగోలుదారుల్లో అప్రమత్తత పెంచాయి. అనుమతులు లేకుండా ప్రాజెక్టులు ప్రారంభించడం, ఒకే స్థలాన్ని పలువురికి విక్రయించడం, నిర్మాణం ఆలస్యం చేయడం వంటి కేసులు తరచూ బయటపడుతున్నాయి. కొన్ని సందర్భాల్లో కొనుగోలుదారులు కోట్ల రూపాయలు పెట్టుబడి పెట్టినా ప్రాజెక్టులు సంవత్సరాల పాటు పూర్తికాకపోవడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. దీంతో కొనుగోలుదారులు ఇప్పుడు భూమి పత్రాలు, అనుమతులు, రెరా నమోదు వంటి అంశాలను పూర్తిగా పరిశీలించిన తర్వాతే పెట్టుబడి పెట్టడానికి ముందుకు వస్తున్నారు.

**రేరాలో పెరుగుతున్న ఫిర్యాదులు...**

రియల్ ఎస్టేట్ రంగంలో పారదర్శకత కోసం ఏర్పాటు చేసిన రెరా సంస్థకు కూడా ఇటీవల ఫిర్యాదులు పెరిగినట్లు సమాచారం. నిర్మాణంలో ఆలస్యం, ఒప్పంద నిబంధనలు పాటించకపోవడం, వాగ్దానం చేసిన సౌకర్యాలు ఇవ్వకపోవడం వంటి కారణాలతో కొనుగోలుదారులు ఫిర్యాదులు చేస్తున్నారు. కొన్ని కేసుల్లో బిల్డర్లు, డెవలపర్లపై భారీ జరిమానాలు విధించిన ఘటనలు కూడా ఉన్నాయి. ఈ పరిణామాలు ఒకవైపు నియంత్రణను పెంచుతున్నప్పటికీ మరోవైపు మార్కెట్లో జాగ్రత్త ధోరణిని మరింత పెంచుతున్నాయి.

**పాత స్టాక్ తగ్గించుకునే ప్రయత్నం....**

ప్రస్తుతం నగరంలో నిర్మాణం పూర్తయిన కానీ అమ్ముడుపోని ఫ్లాట్ల సంఖ్య పెరిగినట్లు రియల్ ఎస్టేట్ వర్గాలు చెబుతున్నాయి. ఈ పాత స్టాక్‌ను తగ్గించేందుకు డెవలపర్లు వివిధ ఆఫర్లు ప్రకటిస్తున్నారు. డిస్కౌంట్లు, స్టాంప్ డ్యూటీ రాయితీలు, ఫ్రీ ఇంటీరియర్ ప్యాకేజీలు వంటి ప్రోత్సాహకాలు ప్రకటించినా కొనుగోలుదారుల స్పందన ఆశించిన స్థాయిలో లేదని చెబుతున్నారు.

**పెట్టుబడులతో ప్రభావం...**

మార్కెట్ మందగించినప్పటికీ హైదరాబాద్‌పై పెద్ద పెట్టుబడిదారుల ఆసక్తి మాత్రం కొనసాగుతోంది. ఇటీవల పలు రియల్ ఎస్టేట్ సంస్థలు, పెట్టుబడి నిధులు నగరంలో భారీ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చాయి. ఐటీ కారిడార్ పరిధిలో కొత్త కమర్షియల్ టవర్లు, మిక్స్‌డ్ యూజ్ ప్రాజెక్టులు, పెద్ద గేటెడ్ కమ్యూనిటీలు ప్రారంభమవుతున్నాయి. అంతర్జాతీయ పెట్టుబడి సంస్థలు కూడా హైదరాబాద్ రియల్ మార్కెట్‌ను దీర్ఘకాలిక పెట్టుబడి అవకాశంగా చూస్తున్నాయి. ఇటీవల ప్రకటించిన కొన్ని ప్రాజెక్టుల్లో వేల కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టనున్నట్లు డెవలపర్లు ప్రకటించారు. ఈ పెట్టుబడులు నిర్మాణ రంగానికి ఉపాధి అవకాశాలు కల్పించడమే కాకుండా భవిష్యత్తులో గృహాల డిమాండ్‌ను కూడా పెంచే అవకాశముందని నిపుణులు చెబుతున్నారు.

**మౌలిక వసతుల జాప్యంతో....**

నగర రియల్ ఎస్టేట్ మార్కెట్‌పై మౌలిక వసతుల అభివృద్ధిలో చోటుచేసుకుంటున్న జాప్యాలు కూడా ప్రభావం చూపుతున్నాయని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా మెట్రో రైలు విస్తరణ ప్రాజెక్టులలో ఆలస్యం కొనుగోలుదారుల నిర్ణయాలను ప్రభావితం చేస్తున్నట్లు తెలుస్తోంది. నగర పరిసర ప్రాంతాల్లో మెట్రో విస్తరణ జరుగుతుందనే ఆశతో గతంలో భారీగా ప్రాజెక్టులు ప్రారంభించినప్పటికీ పనులు అనుకున్న వేగంతో సాగకపోవడం పెట్టుబడిదారుల్లో సందేహాలను పెంచుతోంది. మరోవైపు మూసీ నది అభివృద్ధి, పునరుద్ధరణ ప్రాజెక్టుపై కొనసాగుతున్న వివాదాలు కూడా కొంత ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ కార్యకలాపాలపై ప్రభావం చూపుతున్నాయి. ముఖ్యంగా నది పరివాహక ప్రాంతాల్లో ఉన్న భూములు, నిర్మాణాలపై భవిష్యత్తులో ప్రభుత్వ నిర్ణయాలు ఎలా ఉంటాయన్న అనిశ్చితి కారణంగా కొంతమంది పెట్టుబడిదారులు వేచి చూసే ధోరణిని అవలంబిస్తున్నారని రియల్ రంగ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ పరిస్థితులు తొందరగా స్పష్టతకు వస్తే మార్కెట్‌లో విశ్వాసం మరింత పెరుగుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

**మార్కెట్ పునరుద్ధరణపై ఆశలు**

ప్రస్తుతం పరిస్థితి కొంత మందగించినప్పటికీ హైదరాబాద్ నగరానికి ఉన్న ఐటీ రంగం బలం, మౌలిక వసతుల అభివృద్ధి, అంతర్జాతీయ పెట్టుబడులు వంటి అంశాలు దీర్ఘకాలంలో రియల్ ఎస్టేట్ మార్కెట్‌కు బలాన్నిస్తాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ప్రత్యేకంగా మెట్రో విస్తరణ, రింగ్ రోడ్ ప్రాజెక్టులు, ఐటీ పార్కులు వంటి అభివృద్ధి కార్యక్రమాలు నగర పరిసర ప్రాంతాల్లో గృహాల డిమాండ్‌ను పెంచే అవకాశముంది.

**హైదరాబాద్ రియల్ ఎస్టేట్ గణాంకాలు**
**2025 మార్కెట్ సారాంశం**

- మొత్తం గృహ రిజిస్ట్రేషన్లు : సుమారు 75,000+
- మొత్తం లావాదేవీల విలువ : రూ52,000 కోట్లు పైగా
- రిజిస్ట్రేషన్లలో స్వల్ప తగ్గుదల
- లావాదేవీల విలువలో గణనీయ వృద్ధి
- రూ.1 కోటి పైబడిన గృహాల వాటా : సుమారు 18%

**మార్కెట్ ట్రెండ్**
**మారుతున్న కొనుగోలు ధోరణి**

- లగ్జరీ గృహాలపై పెరుగుతున్న ఆసక్తి
- మధ్య తరగతి గృహాల కొనుగోళ్లు తగ్గుదల
- ఐటీ కారిడార్ ప్రాంతాల్లో అధిక లావాదేవీలు
- విల్లా ప్రాజెక్టులకు పెరుగుతున్న డిమాండ్

**పరిష్కార మార్గాలు**
**రంగానికి ఊతమిచ్చే చర్యలు**

- మధ్యతరగతి గృహాలకు రుణ రాయితీలు
- స్టాంప్ డ్యూటీపై తాత్కాలిక తగ్గింపు
- రియల్ మోసాలపై కఠిన చర్యలు
- అనుమతుల ప్రక్రియ వేగవంతం
- చిన్న బిల్డర్లకు ఆర్థిక సహాయం





## సల్మాన్‌ఖాన్‌కి జోడీగా?

దక్షిణాదిన అగ్రస్థానంలో ఉన్న కథానాయిక ఎవరంటే.. 'నయనతార' అని టక్కున చెప్పేస్తారు. పారితోషికం పరంగా కూడా నయనే నంబర్ వన్. ప్రస్తుతం ఆ భాష, ఈ భాష అని లేకుండా, అన్ని భాషల్లోనూ సినిమాలు చేస్తూ సత్తా చాటుతున్నది నయనతార. మెగాస్టార్‌తో ఆమె రీసెంట్ హిట్ 'మన శంకర వరప్రసాద్‌గారు' టాలీవుడ్ రీజనల్ సినిమాల్లో నంబర్‌వన్ హిట్‌గా నిలిచింది. ప్రస్తుతం బాలకృష్ణ 'NBK 111'లో కథానాయికగా నటిస్తున్నది నయనతార. ఇక తమిళంలో అయితే.. ఆమె చేతిలో చాలా సినిమాలున్నాయి. ఇదిలావుంటే.. రీసెంట్‌గా ఓ బాలీవుడ్ సినిమాకు నయన్ సైన్ చేసినట్టు విశ్వసనీయంగా తెలిసింది. బాలీవుడ్ సూపర్‌స్టార్ సల్మాన్‌ఖాన్ హీరోగా రూపొందనున్న ఈ ప్రతిష్టాత్మక చిత్రానికి టాలీవుడ్ డైరెక్టర్ పైడిపల్లి వంశీ దర్శకుడు. దిల్‌రాజు నిర్మిస్తారట. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలోనే రానున్నది. ఇక నయన్ నటించిన తమిళ చిత్రం 'ముక్తీ అమ్మన్' సమ్మర్‌లో విడుదల కానుంది.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.